పెద్దకథ:

# మనిషి

## 1

"ఇవాళో రేపో అంటున్నార్ట." .

'ఎవరి సంగతి?' అని ఆమె అడగలేదు. "ఎవరు చెప్పారు?" అని అడిగింది.

"గంట క్రితం నాకు ఫోను చేసి చెప్పారు కామేశ్వరరావు గారు!"

"ఏమయిందట?"

"ఏమో, నేనా వివరాలు అడగలేదు. ఇక్కడ ఆసుపత్రులు లేనట్టు అంత దూరం వెళ్ళాడు. జీవితంలో సరయిన పని ఒక్కటి చెయ్యలేదు. ఎంతకని చచ్చేది!" అని ఓ క్షణమాగి, "రిజర్వేషను దొరికితే సాయంత్రం బండికి నేను వెళ్తాను. నువ్వు వస్తావా?" అంది ఆమె, ఎటో చూస్తూ.

క్షణమాలోచించి అంది విశాల, "వస్తాను" అని.

"రిజర్వేషను దొరికితే కబురు పంపుతాను, ఏ బండికో, ఏ టైముకో. సికిందరాబాదు స్టేషనుకు వచ్చెయ్యి."

"మీ ఆయన రావటం లేదా?"

"రానన్నారు. ఆయనకిష్టం లేదు. ఎవరొచ్చినా రాకపోయినా నాకు తప్పదు కదా?"

ఆ ఏష్ట మొగుడిమీదో, తనమీదో తేల్చుకో లేక పోయింది విశాల. 'తనకూ ఇష్టం లేదు. అయిన తప్పదు వెళ్ళాలి' అనుకుంది, అయితే పైకేం మాట్లాడలేదు.

మారు మాట్లాడకుండా భానుమతి వెనక్కితిరిగి, వీధి గేటు తీసింది. గేటు ముయ్యను కూడా లేదు. అలా బార్లా తెరిచే, కారెక్కి వెళ్ళిపోయింది. విశాల ఆమెని ఇంటి లోపలికి రమ్మని అడగలేదు. ఆమె కూడా మొక్కుబడిపూర్తయినట్టు చెప్పాల్సింది చెప్పేసి

వెళ్ళిపోయింది. ప్రహరీ గేటు మూసి వెనక్కు తిరిగింది విశాల. పచ్చగా పాకుడు పట్టిన ఇటుకలతో తన ఇల్లు దర్శనమిచ్చింది ఆమెకు. ఎప్పుడో కట్టిన ఇల్లు. బయటి ప్లాస్టరింగ్‌కు అది నోచుకోలేదు. పురాతనపు నాలుగ్గదుల కొంప.

'ఇంక ఈ ఆశ్రయమూ తనకుండదు కాబోలు. మళ్ళీ మరో ఇల్లు అద్దెకు చూసుకోవాలి' అనుకుంది విశాల.

ఆ వెంటనే బయటకు వెళ్ళి తన చిట్‌ఫండ్ కంపెనీ మానేజరు సెల్‌కు ఫోను చేసింది. అప్పుడు ఎనిమిది గంటలే అయింది. ఇంకా ఆఫీసు టైము కాలేదు. అతను లైను లోకి వచ్చాక చెప్పింది, "మా ఆయనకు సీరియస్‌గా ఉందట! నేను హరిద్వార్ వెళ్ళాలి. నాకో వారం రోజులు శలవు మంజూరు చెయ్యండి" అని.

"అయ్యో, ఆయన హరిద్వార్ ఎందుకు వెళ్ళారు?" అనడిగాడు మానేజరు.

"చూసి వస్తానని వెళ్ళారు లెండి" అని క్లుప్తంగా చెప్పి, శలవ మంజూరు చేయించుకుని ఫోను పెట్టేసింది విశాల.

✣ ✣ ✣

మనిషి కనుమరుగయినా ఆ వ్యక్తిని గూర్చిన జ్ఞాపకాలు చావవు.అందుకే అతని తోడి తన ప్రథమ పరిచయం గుర్తుకు వచ్చింది విశాలకు. తనా ఇంటికి మొదటిసారి 'అద్దెకు ఇల్లు ఇస్తారా?' అని అడగటానికి వచ్చిన దృశ్యం ఆమె కళ్ళ ముందు ఆడినట్లయింది.

"బాబాయిగారూ! ఇంత ఇల్లు మీకు ఒక్కరికీ పెద్దది కదా! ఆంటీ వాళ్ళకు రెండు గదులు అద్దెకిస్తారేమోనని తీసుకొచ్చాను" అనడిగింది అతన్ని తనను తీసుకు వచ్చిన నిర్మల.

ఆ అమ్మాయి కూడా అప్పుడు తనతో పాటు చిట్‌ఫండ్ కంపెనీలో పని చేసేది. ఆ కంపెనీలో తన కప్పుడు పదిహేను వందల జీత మిచ్చేవాళ్ళు. ఎలాగో తల్లీ, తనూ కష్టం మీద జీవితం వెళ్ళదీసేవాళ్ళు. అమీర్‌పేట నుండి తనను సికిందరాబాదు బదిలీ చేయటంతో, సికిందరాబాదులోనే అద్దెకు ఇల్లు ఏదయినా దొరుకుతుందేమోనని తను ప్రయత్నిస్తుంటే, తనతో పనిచేసే నిర్మల తన్నా చిలకలగూడలోని ఇంటికి తీసుకు వచ్చింది.

"మా పక్కింటి బాబాయిగారిది పెద్దిల్లు. ఆయనుండేది ఒక్కడే. అంత ఇల్లేం చేసుకుంటాడు! అడిగి చూద్దాం" అంది. అపైన, ఆ ఇంటికి వెళ్ళేటప్పుడు అంది, "ఆయన మంచితనంమీద భరవాసాతోనే వెళ్తున్నాంతప్ప, ఆయనంతకు ముందు ఇల్లు అద్దెకు

ఇచ్చినవాడు కాదు. నీ అదృష్టం ఎలావుందో చూద్దాం. మనమడిగితే కాదంటాడనుకోను" అంది నిర్మల.

తాము వెళ్ళేటప్పటికి అతను కత్తిపీట ముందేసుకుని కూరలు తరుగుతున్నాడు. అది నాలుగ్గదుల పాత మోడల్ ఇల్లు. మరో భాగం అద్దెకిచ్చే వీలుగానే ఉంది.'ఎంత అద్దె అడుగుతాడో'నని భయంగానే వుంది తనకు. అమీర్‌పేటలో ఇంటికి ఐదొందలిస్తోంది తను. అదే చాల ఎక్కువ. అంతకంటే ఎక్కువయితే మాత్రం తను భరించలేదు.

"ముందు గదిలో కూర్చోండి అమ్మాయి! ఇప్పుడే వస్తాను" అన్నాడు అతను.

ముందు గదిలో ఉన్న ప్లాస్టిక్ వైరు కుర్చీలో కూర్చుంటూ గోడమీద దండ వేసి ఉన్న స్త్రీమూర్తి ఫొటోవంక చూస్తుంటే అన్నది నిర్మల.

"పిన్నిగారు పోయి ఏళ్ళయింది. ఆయన కోకూతురు. తల్లి పోయేటప్పటికి ఆమె పసిపిల్ల. నాలుగేళ్ళక్రితం పెళ్ళి చేశాడు. వాళ్ళు హిమాయత్‌నగర్‌లో ఉంటారు. అల్లుడూ, కూతురూ ఈయన్ని తమ దగ్గరకొచ్చి ఉండమన్నారు కానీ ఈయన కిష్టంలేదు. వెళ్ళలేదు. ఒంటరిమనిషి. వంట తనే చేసుకుంటాడు. మంచిమనిషి. పెద్ద హోదా ఉద్యోగం. కానీ చాల సాదాసీదాగా ఉంటాడు."

తామలా మాట్లాడుకుంటూ ఓ పావుగంట కూర్చున్నాక అతను వచ్చాడు. సన్నటి మనిషి. నలుపు. మెరవబోతున్న రెండు రోజుల గడ్డం, లుంగీ, పైన చొక్కా కళ్ళజోడు. మనిషిలో ఏమాత్రం అందం లేదు.చూడగానే వికారమనిపించింది తనకు. అతనిలోని అందమల్లా నవ్వినప్పుడు కనపడుతుంది. అలాంటి అవకాశం కూడ చాల తక్కువ వచ్చేటట్లుంది.

ఆ నవ్వే చిందిస్తూ, "చాల రోజులయింది కనబడి, ఎట్లా ఉన్నారమ్మా మీరంతా?" అనడిగాడు, తనూ ఓ కుర్చీలో కూర్చుంటూ.

నిర్మల చెప్పింది: "ఎక్కడా తీరికలేదు, బాబాయిగారూ! ఈమె విశాల. మా ఆఫీసులోనే పని చేస్తుంది.అమీర్‌పేట నుంచి ట్రాన్స్ఫరయింది. అద్దె ఇల్లు వెతుక్కుంటూ మీ ఇంటికి వచ్చాం."

"నేనెప్పుడూ అద్దెకివ్వలేదు. అసలా ఆలోచన కూడ లేదు" అన్నాడు అతను.

"మీ ఒక్కళ్ళకూ నాలుగు గదులేం చేసుకుంటారు, అంకుల్! రెండు గదులు ఎవరికయినా అద్దెకిస్తే, మీకూ మనుషుల తోడు ఉంటుంది. ఇంటి చాకిరీ కొంత తప్పుతుంది" అంది నిర్మల చనువు తీసుకుంటూ.

"నువ్వన్నదీ నిజమే" అని తల పంకించి, "ఎవరెవరుంటారు?" అనడిగాడు తన వంక చూస్తూ.

"నేనూ, అమ్మా" అంది తను.

"మీ నాన్నగారు....?"

"పోయి పదిహేనేళ్ళయింది."

"మీ వారు...?"

"నేను పెళ్ళి చేసుకోలేదు."

నిజానికి కాలేదు. తన సంగతి పట్టించుకునే వారెవరూ లేరు. ఉన్న ఒక్క అన్నా మిలటరీలో పని చేసేవాడు. ఎప్పుడో చుట్టంచూపుగా రావటం తప్ప అతనేం చేయడు. చేయలేదు, చేయాలన్న ఆసక్తీ లేదు. తండ్రి బతికున్న రోజుల్లో ప్రయత్నం చేశాడు. అప్పటికి తమ స్థోమతుకు సరిపోయే సంబంధం కుదరలేదు. తను బి.ఏ. వరకూ చదువుకుంది. తనూ కాస్తోకూస్తో అందంగానే ఉంటుంది. ఆ రోజుల్లో కట్నమివ్వటమూ తన తండ్రి కిబ్బంది కల్గించేది కాదు. తనకే ఏ వరుడూ నచ్చేవాడు కాదు. అంతలో తండ్రి హృద్రోగంతో అకస్మాత్తుగా పోయాడు. ఆయన పోవటానికి మూడేళ్ళ ముందు ప్రభుత్వోద్యోగం మానేసి, ఓ చిన్న కంపెనీ ప్రారంభించాడు. ఎలక్ట్రికల్ మిషనరీ తయారుచేసే కంపెనీ అది. మొదట్లో అది బాగా సాగలేదు. కొంచెం పుంజుకుంటున్న దశలో తన తండ్రి మరణించాడు. వాటాదార్లు అప్పులు చూపించారు. ఉన్న ఆస్తి హారతి కర్పూరమై పోయింది, అప్పులు తీర్చటానికీ, బతుకు బండి నడిపించటానికీ. తన తండ్రి బతికి ఉన్న కాలంలోనే అన్న అల్లరిచిల్లరి తిరుగుళ్ళు తిరిగేవాడు. చదువు అబ్బలేదు. తండ్రి పోయి, ఆస్తిపోయి గడవని స్థితి వచ్చేసరికి ఇంట్లో నుండి పారిపోయి మిలటరీలో చేరాడు.

"మీ నాన్నగారు ఏం చేసేవారు?"

అతను వేసిన ప్రశ్నకు ఉలిక్కిపడి ఇహలోకంలోకి వచ్చింది తను. చెప్పింది.

"ఏం పేరు?"

"వేణుగోపాలరావుగారు, చంద్రగిరి వేణుగోపాలరావుగారు" అంది తను, అతను మళ్ళీ ప్రశ్నించకుండా.

"ఆయన కూతురా మీరు?" అన్నాడతను అప్రతిభుడవుతున్నట్టు, కుర్చీలో వాలికూర్చున్నవాడు నిటారవుతూ. అర్థంలేని ప్రశ్న!

"మీకాయన తెల్సా?" అనడిగింది తను.

అందుకతను జవాబు చెప్పలేదు.

"ఉద్యోగం చేస్తున్నారా?" అదీ అర్థంలేని ప్రశ్నే.

నిర్మల ఆ విషయం వస్తూనే చెప్పింది.అయినా మళ్ళా ఆ ప్రశ్నే వేస్తున్నాడంటే ఆమనిషికి బుర్రుందా లేదా అన్న అనుమాన మొచ్చింది తనకు. ఆపైన ఆ ప్రశ్న వింటూనే తనకు మండి పోయింది.

'లేకపోతే నువ్వు తిండి పెడతావా?' అనుకుని "అవును. నిర్మలతో పాటే చిట్‌ఫండ్ కంపెనీలో పని చేస్తున్నాను" అంది పైకి.

"ఎంతిస్తారు?"ఇంక తన కోపం నసాళానికంటింది.

'ఎంతో ఇస్తారు. వాళ్ళు ఎంతిచ్చినా నువ్వు అద్దె మాత్రం తగ్గించుకోవుగా' అనుకుని, "పదిహేను వందలు" అంది పైకి.

"ఇప్పుడున్న ఇంటికి ఎంత అద్దె ఇస్తున్నారు?"

"ఐదొందలు."

"వచ్చే పదిహేను వందల్లో ఇద్దరు బతకటమే కష్టం ఈ రోజుల్లో. సరే, ఇల్లు చూసుకోండి. నచ్చితే వచ్చి చేరండి" అన్నాడు కేశవమూర్తి.

కుడివైపు రెండు గదులు చూపించాడు. అతనికేం పెద్ద సామానులేదు. 'అయ్యవారి నట్టిల్లు'లావుంది.అతనికున్న సామానులకు రెండు గదులు కూడ ఎక్కువే. తనకు ఇల్లు నచ్చే ప్రశ్నేలేదు. ఉండటానికి ఏదో ఓ కొంప. అదీ తను భరించగలిగిన కిరాయికి దొరకాలి. ఇల్లు పాతదయినా, కావల్సిన సౌకర్యాలన్నీ ఉన్నాయి.'అద్దె ఎంత చెప్తాడో' అనుకున్నది తను.

"ఎంతివ్వాలి అద్దె?" అనడిగింది తను.

"మీరివ్వగలిగినంత ఇవ్వండి" అన్నాడతను నవ్వుతూ.

"అంటే?"

"అంటే ఏం లేదు. నాకసలు ఇల్లు కిరాయికివ్వాల్సిన అవసరంలేదు. నిర్మల చెప్పినట్లు ఇంతిల్లు నా కెందుకు?! పైగా అనవసరపు చాకిరీ చెయ్యాలి. అద్దెకు దిగేవాళ్ళకు భారమయ్యే బాడుగ నేను పుచ్చుకోను.అందుకే మీరివ్వగలిగింది మీరివ్వండి."

"నేను చెప్పలా– మా బాబాయిగారు మంచివారని, ఆయనేం డబ్బుకోసం పీడించరని!" అంది నిర్మల.

అయితే, తనకు 'మంచితనం' మీద వేరే అభిప్రాయాలున్నాయి. 'మంచితనం' ముసుగు కప్పుకున్నస్వార్థపు పులుల సమాజమిది అని తనకు తెలుసు.అందుకే, గట్టిగా, "అలా అంటే ఎలా? ఓ మాట అనుకుంటే ఇద్దరికీ బావుంటుంది" అంది తను.

"చెప్పానుగా, మీరివ్వగలిగినంత ఇవ్వమని. అది నేను ఊరికే అన్న మాట కాదు."

"సరే, రేపు దశమి. రేపొచ్చి ఇంట్లో చేర్తాం" అంది తను.

అతను 'సరే' నని తలూపాడు.

కేశవమూర్తి అద్దె విషయంలో ఉదారత్వం ప్రదర్శించటం తనలో అనుమానబీజం మొలకెత్తటానికి కారణ మయింది. ఆపైన, భార్యపోయి ఎన్నో ఏళ్ళయినా మళ్ళా పెళ్ళి చేసుకోక విధురుడిగా జీవితం గడుపుతున్న అతని ఇంటిలో చేరటానికి తన మనస్సంగీకరించ లేదు. కానీ తన వివశత్వం తనకు ప్రత్యామ్నాయాలను మృగ్యం చేసింది.

మర్నాడు తామొచ్చి ఇంట్లో చేరారు. కొద్ది రోజుల్లోనే కేశవమూర్తి తన తల్లిని ఆకట్టుకున్నాడు. గంటలతరబడి మాట్లాడుకునే వాళ్ళు వాళ్ళు. తల్లి తన సొదంతా అతనికి విన్పించేది. తనకు పెళ్ళికాలేదని ఆమెకు దిగులు. "మీ ఎరికలో ఏమైనా సంబంధాలుంటే చెప్పండి" అనడిగేది ఆమె. మొదట్లో అతను చాల సిన్సియర్‌గాప్రయత్నించినట్లే ఉన్నాడు, లేక అలా నటించాడేమో.

అతను తెచ్చినసంబంధాలలో ఒకటి కుడికాలు వంకరతో కుంటుతూ నడిచే వ్యక్తి. తాలూకుది. అతను ఏదో బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు.

"పెద్ద కాలు కుంటేం కాదు. కొద్దిగా కాలు ఈడుస్తూ నడుస్తాడు" అని కేశవమూర్తి చెప్పాడు.

"కుంటి, గుడ్డి సంబంధాలు నేను చేసుకోను" అని కరాఖండీగా చెప్పేసింది తను.

"అలా అంటే ఎలా? శారీరికంగా అతను కుంటి. మానసికంగా కుంటి మనుషులూ ఉంటారు. సాంఘికంగా, ఆర్థికంగా కుంటితనం మనలోనూ ఉంది. కట్నమివ్వలేక పోవటమూ ఓ రకంగా కుంటితనమే. జీవితంలో రాజీ పడక తప్పనప్పుడు రాజీ పడటమే మంచిది" అన్నాడతను.

ఎంత దౌర్భాగ్యం! జీవితంలో ప్రతివాడిచేత చెప్పించుకోవాల్సిన ఖర్మ తనకు పట్టింది.తనెలా బతికింది?ఎన్ని రాజీలు పడింది! చివరకు కుంటివాడితో పెళ్ళా?! 'చివరకు వృద్ధకన్య కుంటివాడిని చేసుకుంది గతిలేక' అనుకోరూ? అలా అందరి దృష్టిలో చులకనవటం తను భరించలేదు. అందుకే, కేశవమూర్తీ, తన తల్లీ ఎంత నచ్చచెప్పచూసినా

తను వాళ్ళ మాట వినలేదు.

"లోకులేదో అనుకుని పోతారని, మనం మన ప్రయోజనాలను కుంటుపర్చు కోకూడదు. వ్యక్తి ఆలోచన, లోకందృష్టి ఒకటవటం ఎప్పుడోకానీ జరగదు" అన్నాడతను.

తనకదే మంట! తన మనసులోని ఆలోచనలను చదివినట్టు మాట్లాడేవాడు. అతను తన మనసులోని ఆలోచన బయటపెట్టగానే, తాను నగ్నంగా, అనాచ్ఛాదితంగా నిలబడిన భావన కలిగేది.

'ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ద బెస్ట్ ఇంప్రెషన్' అంటారు. మొదటి సారి చూడగానే ఆ మనిషంటే తనకు సదభిప్రాయం కలగలేదు. మనిషి అంతఃసౌందర్యం బాహిర రూపంలో తప్పక ప్రతిఫలిస్తుందన్న అభిప్రాయం తనది. అందుకే, అతనేం ప్రతిపాదించినా తనలోని ప్రథమ ప్రతిచర్య అతన్ని వ్యతిరేకించటమే.

"మీరేం నాకు బుద్ధులు బోధించనక్కర లేదు. మా మానాన మమ్మల్నుండనివ్వండి. అసలు మా అమ్మకు బుద్ధిలేదు. అడ్డమైన వాళ్ళందరితోనూ అన్నీ చర్చిస్తుంది" అని తను విసురుగా లోపలి గదిలోకి వెళ్ళిపోయింది.

"అది అంతే నాయనా! నోటి దురుసుతనం! పరిస్థితులలా మార్చాయి. మనసు వెన్నకాదూ? అదలా అన్నదని నువ్వు మనసులో పెట్టుకోకు. నీటిలో కొట్టుకు పోయే మనిషికి గడ్డి పరక సాయం కూడా సాయమే" అని అతన్ని సమాధాన పర్చింది తన తల్లి.

అంత గట్టిగా చెప్పినా అతను తనకు పెళ్ళిసంబంధాలు చూడటం మానలేదు.

అతను రెండు రెండో పెళ్ళి సంబంధాలు తెచ్చాడు."నేను రెండో పెళ్ళివాడిని ఛస్తే చేసుకోను" అని తెగేసి చెప్పింది.

ఒక స్త్రీతో అంతకుముందే శారీరిక సంబంధం ఉన్న వ్యక్తిని తను చేసుకోలేదు. అది తనవల్ల కాని పని. తనా వ్యక్తిని భరించలేదు.

"నువ్వేం చిన్నపిల్లవుటే! ఇంత వయసు వచ్చాక, మొదటి సంబంధం అంటే దొరకొద్దూ? జ్ఞానం ఉండాలి మనిషన్న తర్వాత!" అంది అమ్మ.

"నేనేం ఇప్పుడు పెళ్ళికి వెంపరలాడటం లేదు. మాట్లాడకు" అని తల్లిని కసిరింది తను.

అతను చెప్పి చూశాడు, "జీవితంలో తోడు లేకుండా బతకటం కష్టం. మనకు ఇప్పుడున్న బలం రేపుండదు. కన్ను నొచ్చినా, కాలు నొచ్చినా చూసేందుకెవరయినా

ఉండాలి" అంటూ.

"ఏం ఫరవాలేదు లెండి. ఎలాగో గడుస్తుంది" అన్నదీ తను.

కేశవమూర్తి ఏమనుకున్నాడో ఏమో ఆ తర్వాత తనకు పెళ్ళి సంబంధాలు తెచ్చే ప్రయత్నం విరమించాడు.

అతను ఇలా తనకై సంబంధాలు వెతుకుతున్న సమయంలోనే ఓ సారి తల్లి అతనితో అంది, "అసలు మీరే మా అమ్మాయిని వివాహం చేసుకోవచ్చుగా? మీకు మాత్రం వయసేం మించుకు పోయింది. యాభై ఒకటో, యాభై రెండో! అసలు మీకా వయసు ఉన్నట్టే అన్పించదు" అని.

అతనేం మాట్లాడలేదు.

తన మొహం సిగ్గుతో కంది పోయింది. కోపం వచ్చింది. ఆ తర్వాత ఆమెను చీవాట్లు పెట్టింది.

"నీకు బుద్ధిలేదమ్మా! నేను రెండో పెళ్ళివాడిని చేసుకోనని చెప్పానా? పైగా ఎవరూ దొరకనట్టు ఇతనా! ఈ నల్లటి కురూపి తప్ప మరెవరూ నీకల్లుడుగా దొరకలా?" అని.

"నాకు కాదు, నీకు బుద్ధిలేదు. నీ గొంతెమ్మ కోర్కెలు తీర్చటానికి మీ నాయన లేరు. నీకు మాత్రం వయసు మళ్ళిపోలా? నీ సంగతి నువ్వు చూసుకోవేం? నలభై ఐదు, యాభైయేళ్ళచ్చేదాకా పెళ్ళి చేసుకోకుండా ఉండే మగాడు ఎక్కడ దొరుకుతాడు. ఒకవేళ ఉన్నా నలభై పైబడిన నిన్నెందుకు కట్టుకుంటాడు. వయసుపిల్లను చూసుకుంటాడు. పైగా మనమేమన్నా కట్నాలు పోసే తాహతులో ఉన్నామా? మన పరిస్థితి చూసుకుని ఆలోచన చెయ్యాలి" అంది అమ్మ.

"నేను పెళ్ళి చేసుకోను. నువ్వనవసరంగా శ్రమ పడకు. నామనసుకు బాధ కలిగించకు" అంది తను మొండిగా.

"ఇప్పుడు తెలీదే నీకు. చెవినిల్లుకట్టుకు పోరుతున్నా నీకు నా మాట అర్థం కావటంలేదు.నీ మూర్ఖత్వం నీదే. నేనేం చెయ్యగలను. ఆ మహారాజు పోయాడు. నాకే చావు రాకుండా ఉంది" అంది ఆమె కంట తడిపెడ్తూ.

కానీ కేశవమూర్తికి తనమీద కాంక్ష ఉన్నట్టు తను గమనించక పోలేదు. యాభై ఏళ్ళ మనిషికి ఆ బుద్ధులేమిటో? తను నిలబడి ఉంటే తన్ను రాసుకుంటూనే గదిలోకొస్తాడు. దగ్గరగా ఉన్నప్పుడు యథాలాపంగా అన్నట్లు చేతులు తాకిస్తాడు. తనకేసి గుడ్లార్పకుండా మిటకరించి చూస్తాడు.

ఓసారి, అలా అతను తన్ను ఆబగా చూస్తూంటే తను అడిగింది, "ఏమిటలా తినేసేట్టు

చూస్తారు నన్ను?" అని.

"మీరు కొరకరాని కొయ్య! మిమ్మల్ని తినెయ్యటమే? గొంతుకడ్డం పడతారు. మీరు దిగులు పడబోకండి. నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోబోవటంలేదు..."

"ఏం, పాపం, కరుణించి వదలి పెట్టారు?"

"రెండో పెళ్ళివాడిని చేసుకోటం మీకిష్టంలేదుగా?"

"అందుకా. సంతోషం! మీకు మాత్రం ఇప్పుడీ వయసులో మళ్ళా పెళ్ళి చేసుకోవాలన్న ఆరాటమెందుకూ? హాయిగా మీ అమ్మాయి దగ్గర ఉండొచ్చుగా?"

"ఉండొచ్చు. అప్పుడు వాళ్ళ బతుకు నేను బతకాలి. నాకూ ఓ బతుకుంది. నా పద్ధతిలో నేను బతకాలి."

"అవును. అలాగే నేనూ! నాబతుకు నన్ను బతకనివ్వండి. నా వెంట పడటం మానండి" అంది తను.

✣ ✣ ✣

"అమ్మా! కూరలు!" అంటూ కూరలమ్మే మనిషి గేటు బయటనుండి అరవటంతో ఉలిక్కి పడింది విశాల.

'పొద్దున్నే ఈయన ఆలోచనలో పడిపోయిందేం తను, మహా ప్రాతఃస్మరణీయుడన్నట్టు!' అనుకుని గేటుతీసుకుని బయటకొచ్చి, కూరలేం వద్దని చెప్పేసింది.

"నీ మొగడు ఎప్పుడొస్తాడమ్మా? కొన్నాళ్ళు బదిలీ అంటివి, కొన్నాళ్ళుయాత్రలకు పోయిండంటివి!" అనడిగింది ఆమె.

"ఆయన హరిద్వార్‌లో తపస్సు చేసుకుంటున్నాడులే! ఇప్పుడు నీకు ఆయనతో పనేం?" అని కస్సుమంది విశాల.

అతని పరిస్థితి బాగా లేదని చెప్పబుద్ధికాలేదు ఆమెకు.

"మంచోడు! పనిబడింది, అడిగినా" అని మూతి మూడొంకలు తిప్పి ఆమె కూరల తట్టఎత్తుకుని వెళ్ళిపోయింది.

ఆ పనేదో అడిగే ఆసక్తిలేదు విశాలకు. అప్పటికే పదిగంటలయిందేమో! 'తను కూడు ఉడకేసుకుని పూజ చేసుకోవాలి. భోజనం చేశాక బ్యాగు సర్దుకోవచ్చు. అక్కడ రెండు మూడు రోజులకంటె అధికం ఉండాల్సి రాకపోవచ్చు. తాము వెళ్ళేటప్పటికే అతను పోయి ఉండొచ్చు. అసలు పోయాడేమో! కూతురు బాధపడుతుందని అలా చెప్పాడేమో

కామేశ్వరరావు? దహనం, అస్థి సంచయనమయ్యాక అక్కడ ఉండి చెయ్యాల్సిందేంలేదు. ఆ కూతురు కర్మకాండ జరిపిస్తుందో లేదో తనకు తెలియదు. తనకు అందులో ఆసక్తీ లేదు, నమ్మకమూ లేదు. ఆపైన అంతఖర్చు పెట్టగలిగే స్థోమతా తనకులేదు. అంతా అయాక తను కొత్త ఆశ్రయం వెదుక్కోవాలి. సాయంత్రం బండెప్పుడో ఏమిటో? ఏదీ ఇదమిత్థంగా చెప్పక పోవటం, చెప్పినా వివరంగా చెప్పకపోవటం ఆ పిల్ల అలవాటు' అనుకుని విశాల పనిలో పడి పోయింది.

మధ్యాహ్నం భోజనం చేసి బ్యాగు సర్దుకు కూర్చుంది విశాల. భానుమతి నుండి కబురేం లేదు. కునుకు వస్తున్నట్టుంటే ఓ అరగంట నిద్రపోయి లేచింది. ఇంతలో 'పోస్ట్' అంటూ గేటు బయటనుండి కేకేసి పోస్ట్‌మాన్ ఓ ఉత్తరం లోపలికి గిరాటెట్టి వెళ్ళిపోయాడు. ఆ ఉత్తరం హరిద్వార్ నుండి వచ్చింది. అతను రాసిందేమోననుకుని చింపి చూస్తే అది కామేశ్వర రావు రాసిన ఉత్తరం. అందులో ఇలావుంది.

"విశాలగారికి, నమస్కారం. కేశవమూర్తికి జబ్బుగా ఉందని మీకు తెలిసే ఉంటుంది. భానుమతికి ఫోను చేసి చెప్పాను. ఆమె వీలు చూసుకుని వస్తానన్నది. ఇంతవరకు మీ దగ్గర నుండి ఎలాంటి కబురు లేదు. ఆ తర్వాత ఫోను చేస్తే భానుమతి ఫోను నంబరు కలవలేదు. మారిందో ఏమో! రెండు రోజులుగా కేశవమూర్తి అపస్మారకంలో ఉన్నాడు. డాక్టర్లు భరోసా ఇవ్వటంలేదు. రోజుల్లోనే ఉందంటున్నారు. పోయేటప్పుడు తన్ను కన్నవాళ్ళయినా, తను కన్నవాళ్ళయినా, కట్టుకున్నవాళ్ళయినా దగ్గర ఉండాలని ఏ మనిషయినా కోరుకుంటాడు. అతడికి స్పృహ లేదు. అది వేరే విషయం. ఢిల్లీ ఇంటర్ స్టేట్ బస్ టెర్మినస్ నుండి హరిద్వార్‌కు బస్సులు లభ్యమవుతాయి; 214 కిలో మీటర్ల దూరం. మీరెప్పుడొస్తున్నారో నా మొబైల్‌కు ఫోను చేస్తే, నేను బస్సు స్టాండుకు వచ్చి మిమ్మల్ని తీసుకు వెళ్తాను. అతడు కంఖాల్‌లోని రామకృష్ణా మిషను ఆసుపత్రిలో ఉన్నాడు. ఎన్నాళ్ళు ఈ లోకంలో ఉంటాడో తెలియదు. మీదగ్గర నుండి సమాధానం ఆశిస్తూ

– కామేశ్వర రావు."

ఆ ఉత్తరం నాలుగు రోజుల క్రితం రాసింది. అందులో అతని సెల్ నంబరు ఉంది.'తన కనీస బాధ్యత నిర్వర్తించాలి' అనుకుంది ఆమె. లేచి చీరె మార్చుకుని, బొట్టు పెట్టుకోబోతూ, ఓక్షణమాలోచించింది– ఉన్నాడో, పోయాడో. ఆశలేదనే భానుమతికి ఫోను చేశాడు. పోయినా ఇంకా శవ దహనంకాలేదు. పదో రోజు కదా బొట్టు, గాజులు

తీసేసేది.అయినా, అవి తను తియ్యాల్సిన పని లేదు. తను అతనికి భార్యగానే బతకలేదు–అనుకుంది. పర్సుతీసుకుని, ఇంటికి తాళం వేసి బయటి బయటికొచ్చింది. పబ్లిక్ కాల్ బూత్ నుండి హరిద్వార్‌కు ఫోను చేసింది. కామేశ్వర రావు పలికాడు.

"ఎలా ఉన్నారాయన?" అనడిగింది విశాల.

"ఇవాళ తెల్లవారు ఝామున పోయాడు. ఆ విషయం భానుమతికి ఫోనుచేసి చెప్పాను.కేశవమూర్తి సెల్‌లో ఆమె మారిన ఫోను నంబరు దొరికింది. ఆమె మీకు చెప్పలా? మీరెప్పుడు బయలుదేరి వస్తున్నారు? ఇవాళ బయలుదేరినా ఎల్లుండికి గాని చేరుకోలేరు. ఫ్లైట్‌లో అయితే కనీసం రేపటికయినా చేరుకోవచ్చు" అన్నాడతను.

'ఫ్లయిటా? అది తనవల్ల అయే పని కాదు. తనంత ఖర్చు పెట్టుకోలేదు'ఆ మాట అతనికి చెప్పలేక పోయింది. "భానుమతి టికెట్ రిజర్వ్ చేసి కబురంపుతా నన్నది. బహుశ:ఇవాళ సాయంత్రం బయలుదేరుతాం" అంది విశాల.

"ట్రెయినెక్కాక నాకు ఫోను చెయ్యండి" అని అతను సెల్ ఆఫ్ చేశాడు.

ఆ తర్వాత విశాల భానుమతి ఇంటికి ఫోను చేసింది. "ఈ నంబరుతో ఏ ఫోనూ పని చేయటంలేదు" అని జవాబొచ్చింది.'అతను పోయినట్టు ఆమె తనకెందుకు చెప్పలేదు. తన పొడ గిట్టదు ఆమెకు. నిజమే. కానీ ఇలాంటి విషయాలు కూడా దాచాలా? సాయంత్రం తమ ప్రయాణం గురించి ఆమె చెప్పింది నిజమో కాదో?'

## 2

ఆమె ఇంటి తోవ పట్టింది. తను అతని పట్ల ప్రవర్తించిన తీరు కంటె, భానుమతి తన పట్ల ప్రవర్తించే తీరు ఘోర మనిపించింది ఆమెకు. మళ్ళీ ఆలోచనలు ముసురుకున్నాయామెను.

ఆ పిల్ల తక్కువది కాదు. తన పెళ్ళయిన రెండో రోజు ఇంటికి వచ్చింది. అతను క్యాంపు కెళ్ళాడు.

"ముసలాయన ఎక్కడికి వెళ్ళాడు?" అని అడిగింది తనను, 'ముసలాయన' అన్న మాటను వత్తి పలుకుతూ, తన వంక ఎగాదిగా చూస్తూ.

ఆమె వచ్చేసరికి తను బయట ఆవరణలో ఉతికిన బట్టలు ఆరేస్తోంది.

ఆమె ఎవర్ని ఉద్దేశించి అన్నదో తనకు తెల్సినా, "ముసలాయనెవరు?" అనడిగింది తను.

"ఓ! నీకు యువకుడేగా, లేకపోతే పెళ్ళెందుకు చేసుకుంటావు? అదే నీ మొగుడి

సంగతి అడుగుతున్నా."

"క్యాంపు కెళ్ళాడు."

"'డు' కాదు 'రు.' ఆ మాత్రం మర్యాద చూపాలి మొగుడి పట్ల. కొత్తకదా! తెలియదని చెప్తున్నా. ఎంతముసలివాడయినా అంత నిర్లక్ష్యం పనికి రాదు."

"అలాగా? చెప్పావుగా- ఇంక అట్లాగే నడుచుకుంటాలే" అంది తను.

అంతకు ముందు- పెళ్ళికాక ముందు- ఓ సారి ఈ పిల్ల తన్ను అవమాన పర్చింది. తనకప్పటి నుండి ఆ పిల్లంటే అసహిష్ణుతా భావమే. అయితే, అతన్ని సాధించే పనిలో పడిన తను ఆమె పట్ల ఎలా ప్రవర్తించాలో ఇంకా నిర్ణయించుకో లేదు. అతను తన మొగుడని ఇప్పటికీ చెప్పలేదు. మెళ్ళో తాళి కట్టగానే మొగుడవలేదు.తన మనశ్శరీరాల కతనిప్పటికీ ఆమడ దూరమే.

"కొత్త పెళ్ళికూతురికి నగలు, కొత్తచీరెలు ఏం కొనిపెట్టాడేం? నాకు చూపించు. నేనేం ఈర్ష పడను."

"నగలేం కొనలేదు. కొన్నది ఒక్క ఎర్ర చీరె మాత్రమే. సాదాసీదా నేతచీర. గదిలోకి పద.చూపిస్తాను."

"అబద్ధం! మా నాయనకు కొత్త ఆడదంటే చాల బులపాటం. నగలూ, చీరెలూ కొనలేదంటే నేను నమ్మ లేను. చూపించటం ఇష్టం లేక పోతే మానెయ్యి. అంతేగానీ కొనలేదనొద్దు."

తండ్రిని తన ఎదుటే అవమానిస్తున్నది! అది ఆమె సంస్కారం. అతని పక్షం వహించి ఆమెతో వాగ్వాదానికి దిగాల్సిన అవసరం తనకు లేదు. తనకేమీ కాని వాడి కోసం తనెందుకు వాదించాలి?

"నాకు అబద్ధాలాడాల్సిన పని లేదు" అంది తను కొంత కటువుగానే.

తమ సంభాషణ వినపడినట్లుంది, ఇంట్లో ఉన్న తన తల్లి బయటకు వచ్చింది.

"ఓ, నువ్వా తల్లీ! రా, అమ్మా రా! అచ్చం లక్ష్మీదేవిలా ఉన్నావు. సాక్షాత్తూ ఆ శ్రీ మహాలక్ష్మి నడచి వచ్చినట్లుగా ఉంది. ఇంటి ఆడబిడ్డవు నువ్వు- నిలబెట్టే మాట్లాడుతున్నది మా అమ్మాయి. దాని కింకా తెలీదమ్మా! నువ్వేం అనుకోకు. లోపలికి రా తల్లీ!" అని ఆమెను ఆహ్వానించింది.

మనుష్యుల్లో సామాన్యంగా ఓ బలహీనత ఉంటుంది.ఎదుటి వ్యక్తి గౌరవిస్తుంటే అవమాన పర్చటం తేలికయిన విషయం కాదు. అలాంటి వాళ్ళు అరుదు. ఆ కోవకు

చెందిందే భానుమతి. తనన్నా, తన తల్లి అన్నా ఆమెకు గొంతువరకు అక్కసు ఉంది. తాము ఆమె తండ్రిని వంచించి, అతని సంపదను దోచ వచ్చినట్లుగా భావించేది. మా లాంటి నిర్భాగ్యులతో మాట్లాడటమే తన సామాజికస్థాయిని కుదించుకోటమని అనుకునేది.

తన తల్లి నెరపిన గౌరవాన్ని తృణీకరిస్తూ, "ఇంకేం వస్తాం లేండి. లక్ష్మీదేవి తరలి పోవటమే మిగిలి ఉంది, ఈ కొంపలో నుండి. మా నాన్నతో మాట్లాడాలని వచ్చాను" అని గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది.

అమ్మ మొహం తెలతెలబోయింది. ఆమె మనసుకు కష్టం కలిగిందని తన కర్థమయింది. తను అదే క్షణంలో ఆమెతో ఇక ముందు ఎలా వ్యవహరించాలో నిర్ణయించుకుంది. నిజానికి ఆమె మరో విధంగా ప్రవర్తించి ఉంటే తను ఆశ్చర్యపడాలి. ఆ తండ్రి కూతురు అలాగే ప్రవర్తిస్తుంది. అమర్యాద వ్యక్త పరచని లౌక్యం అతనిది. ఆ లౌక్యం కూతురిలో మృగ్యమయింది. ఆమెకు దాని అవసరంలేదు. అందుకు ఆమెను తప్పు పట్టాల్సిన పని లేదు.

"ఈ మనుషులు ఇలా ప్రవర్తిస్తారనే నేను పెళ్ళి అంటే విముఖత చూపింది. చూస్తున్నావుగా, అనుభవించు" అంది తను తన తల్లితో.

"కొత్తలు కదా! అసహిష్ణత సహజం. తల్లి స్థానంలో మరో ఆడది రావటం పిల్లలు సహించలేరు. కాలం అన్ని రుగ్మతల్నీ తీరుస్తుంది" అంది అమ్మ తేరుకుంటూ.

"ఆ మాట నిజమేలే. కాలం అన్నీ పరిష్కరిస్తుంది" అంది తను.

నిజమే, కాలం పరిష్కరిస్తూనే ఉంది. అమ్మ పోయింది. ఇప్పుడతను పోయాడు. తన పరిస్థితి ఏమిటోతనకు తెలియదు. కాలమే పరిష్కరించాలి!

మళ్ళా రెండు రోజుల తర్వాత వచ్చింది భానుమతి, పొద్దున పది గంటలకు. ఆ రోజు ఆదివారం. అతను ఇంట్లోనే ఉన్నాడు. వస్తూనే తండ్రి గదిలోకి వెళ్ళింది ఆమె. అతడు చదువుతున్న పుస్తకంలో నుండి తలెత్తి చూశాడు.

"నేనూ, ఆయనా, దీపికా సాయంత్రం మీ ఇంటికి భోజనానికి వస్తున్నాం. పెళ్ళి చేసుకున్న వాడివి పార్టీ ఇవ్వవా?" అంది సరదాగా మాట్లాడుతున్నట్టు.

అయినా ఆమె గొంతులోని వ్యంగ్యం స్పష్ట మవుతూనే ఉంది.

"నువ్వా! రా, కూర్చో" అని జరిగి మంచం మీద చోటు చూపెడుతూ, "సంతోషం! ఎన్ని గంటలకు వస్తారు" అని అడిగాడతను.

"అది ఆహ్వానించేవాడివి నువ్వు చెప్పాలి" అంది కూతురు.

తను పక్కగదిలో నుండి తండ్రీ కూతుళ్ళ సంభాషణ వింటూనే ఉంది.

"నేను నిన్ను పిలవలేదమ్మాయి! వస్తాననంటున్నావు. కూతురికి పుట్టింటికి వచ్చే హక్కుంది. ఎప్పుడొచ్చినా ఆహ్వానమే" అన్నాడు ఆ తండ్రి.

"భలే బాగా మాట్లాడతావు నాన్నా! సరే, నీ పెళ్ళాం పర్మిషను తీసుకోవూ, మమ్మల్ని పిలవటానికి?" అంది ఆమె రెచ్చగొడుతున్నట్టు.

"పినతల్లిని 'తండ్రి పెళ్ళాం' అని సంబోధించటం మర్యాద కాదు. నా పెళ్ళాం అన్నావు కనుక చెప్తున్నాను. ఆమెకిప్పుడు మీకోసం వంట చేసే ఓపిక లేదు. మనం హోటలుకు వెళ్దాం- మనం నల్గురం" అన్నాడతను.

"ఏం నీ పెళ్ళాం రాదా?"

"అదుగో మళ్ళీ అదే మాట! ఆమెని అడగాలి కదా! ఆమెకిష్టమయితే వస్తుంది. ఇతరులపై నా ఇష్టాన్ని రుద్దటం నా అభిమతం కాదు. అది భార్య అయినా, కూతురయినా నాకొకటే."

"నువ్వు బాగా మాట్లాడతావు, నాన్నా, పెళ్ళాన్ని సమర్థిస్తూ!"

"ప్రతిసారీ ఇలా వ్యంగ్యంగా మాట్లాడి నన్ను అవమాన పరిచి, నువ్వు సంతోష పడాలని భావిస్తే అందుకు నా అభ్యంతరమేమీ లేదు. పెళ్ళాన్ని సమర్థించటం భర్త కనీస కర్తవ్యం!"

"ఇంటికొచ్చిన మనిషికి కనీసం కాఫీ ఇవ్వాలన్న ఇంగితం నీ పెళ్ళానికి లేనట్టుందే?"

"విశాలా! అమ్మాయొచ్చింది. కాఫీ తీసుకురా."

"నువ్వు కల్పించుకోక పోతే ఈ ఇంట్లో అతిథులకు మర్యాదలేం జరిగేట్టులేవు!"

"....."

"రెండ్రోజుల క్రితం వచ్చా. కనీసం పలకరించినవాళ్ళే లేరు."

"....."

"మాట్లాడవేం?"

"ఏం మాట్లాడమంటావు? నువ్వు ఎప్పుడొచ్చావో, వచ్చినప్పుడేమయిందో నాకు తెలీదు కదా! తెలీని విషయాల గురించేం మాట్లాడ గలను. శాసించి గౌరవింప బడాలనుకోవటం మానసిక దుర్లక్షణం."

"అంటే ఈ ఇంటికి రాకూడదా నేను? ఈ ఇంట్లో పుట్టాను, పెరిగాను, చదువుకున్నాను. అమ్మ బతికుంటే ఎట్లా ఉండేదో! ఇక్కడే నా పెళ్ళయింది. ఎవరికయినా

ఈ ఇంట్లో హక్కు ఉందంటే అది నా తర్వాతనే" అంది పెద్దగా, తను వినాలనే.

"....."

"మమకారం చావక నేననుకోవటమేకానీ అవన్నీ అమ్మతోనే పోయాయి! కొత్తబుద్ధులు పుడుతున్నాయి! కొత్త మనుషులొస్తున్నారు. కొంప బజారయి పోయింది. పెద్దవాళ్ళెవరో, చిన్నవాళ్ళెవరో తెలియకుండాపోతున్నది..." అంది ఆమె అన్యాపదేశంగా తన తండ్రినీ, తన్నీ, తన తల్లినీ బాడిస్తూ.

తను కాఫీ కప్పు తీసుకెళ్ళి ఆమెకిచ్చింది. తను తిరిగి వెళ్తూ, తలుపు దగ్గరకు వచ్చే సరికి, "ఏయ్! మర్యాద లేదా? కాఫీ కప్పు నా మొహాన పడేసి వెళ్ళిపోవటమేనా? ఇట్రా" అంది.

అత్తా, ఆడబిడ్డా లేని లోటు తీర్చేటట్లుగా అధికార స్వరంతో మాట్లాడింది. తనకు ఒళ్ళు కాలిపోయినట్లయింది. అతనయితే మాటకు మాట బదులు చెప్పేది. ఆ పిల్ల నోట్లో నోరు పెట్టి గెలవటం కష్ట మేమో ననిపించింది. అతను మృదు స్వభావి. పెద్దగా గొంతెత్తి కూడ మాట్లాడడు. బహుశః తల్లి పోలికేమో! ఏంచేయాలో తోచక తను వెనక్కు తిరిగింది. అప్పుడతను పేపరు పక్కన పడేసి, "నువ్వు వెళ్ళు" అని తన్ను పంపేశాడు.

తను తలుపు దాటి పక్కగది లోకి వచ్చాక, "ఎదుటి వ్యక్తులకు గౌరవమిచ్చి, గౌరవం పుచ్చుకోవాలనే జ్ఞానం లేకపోతే నువ్వీ ఇంటికి రాకపోవటమే మంచిది. ఆమె ఎవరనుకుంటున్నావు? ఈ ఇంటికి యజమానురాలు. నీకు పూజనీయ స్థానంలో – నీ తల్లి స్థానంలో ఉన్న మనిషి. ఆమెను నౌకర్ను శాసించినట్లు ఆదేశిస్తావా? తప్పు. నీకు ఇష్టం లేకపోతే గౌరవించనక్కరలేదు, మాట్లాడనక్కరలేదు. కానీ, కావాలని అవమానించ వద్దు. నిన్నలా పెంచలేదు. ఈ కొత్త బుద్ధులు ఎక్కడ నేర్చుకున్నావో నాకు తెలియటం లేదు" అన్నాడు.

అతని మాటలు సౌమ్యంగా వున్నా, దృఢంగా, వేరే వాదనకు తావు కల్పించనట్టుగా ఉన్నాయి. అతను తన్ను గురించి అంత మర్యాదగా మాట్లాడటం విన్నాక, మనసు అతని పట్ల మొగ్గు చూపేట్టుగా అయిందికానీ, తను మనసును తొక్కి పట్టింది. ఈ మనిషి ఎన్నో రూపమో ఇది!

ఆ కూతురు తక్కువది కాదు.

"పెద్దవాళ్ళకే పెడ బుద్ధులు పుడుతుంటే, పిన్నలకు కొత్త బుద్ధులు పుట్టటంలో ఆశ్చర్య మేముంది?" అంది.

"నువ్వు నా కూతురివి కనుక, నన్ను శాసించాలని భావిస్తే నేనేం చెయ్య లేను.నేను

తండ్రి నని నీకిష్టంలేని పని నేనెప్పుడూ నీ చేత చేయించలేదు. మళ్ళా చెప్తున్నాను, నా అభిప్రాయాల నెప్పుడూ నీపై రుద్దలేదు. నీ బతుకు నువ్వు బతుకు తున్నావు. నా బతుకు నన్ను బతకనీ."

"నీకేం తక్కువైందీ అక్కడ! నా మాట కాదనలేక రెండు రోజులున్నావు. నా దగ్గరుంటే నీ పనులకు అనువు కాదని మళ్ళీ ఈ కొంపకు వచ్చి పడ్డావు! చెయ్యాల్సింది చేశావు!"

"అనువు గాని పనులు నేనేం చెయ్యలేదు. నేనేం చేసినా అది నా వ్యక్తి గతం. స్వీకరించేంత మంచి హృదయం లేకపోతే నోర్మూసుకుని ఊర్కో ఇంక నీ ఇంట్లో ఉండటం సంగతి. నా కక్కడ బాగాలేదు. అందుకే వచ్చేశాను. ఎవర్నీ నిందించటం నా అభిమతం కాదు. నేను వచ్చేసినందువల్ల నీకేమి ఇబ్బంది కల్గిందీ?"

"నలుగురూ నాలుగు రకాలుగా అనుకున్నారు. ఆయన వేషాలు సాగకే తిరిగి వెళ్ళిపోయాడన్నారు."

"నలుగురి పేరూ చెప్పి తండ్రినే 'వేషాలు' అని విమర్శించే స్థాయికి ఎదిగిన కూతురికి నేను చెప్ప గలిగిందేమీ లేదు. గాజు భవంతులలో నివశించేవాళ్ళు ఇతర్ల మీద రాళ్లు వెయ్య కూడదు. తల్లిలేని పిల్లవని పస్తాయిస్తున్నాను. నేను ఒక్క మాట అంటే ఏడుస్తావు!"

అంతే, కుండ పగిలినట్టు భానుమతి భళ్ళున ఏడవసాగింది. వెక్కుతూ, "నా తల రాత ఇట్లా ఉంది! తల్లి పోయాక తండ్రి సవతి తండ్రే కానీ కన్న తండ్రి కాదని అందరూ అనేమాట నిజం చేశావు. అసలు ఈ ఇంటిలో కాలు పెట్టకుండా ఉండాల్సింది నేను. మనసులో ఇంత దుష్టత్వం పెట్టుకునే ఇంటిని నా దగ్గర నుండి కొనుగోలు చేశావు. తండ్రి కదా అని చవగ్గా ఇచ్చాను-తిరిగి ఎలాగో నాకు వచ్చేదే కదా అని. ఇప్పుడర్థమవుతోంది- నీ కడుపులో ఇంత కుళ్ళు ఉందని..."

"ఈ నాలుగ్గదుల పాత ఇంటికి రెండేళ్ళ క్రితమే మూడు లక్షలు పుచ్చుకున్నావు. ఇప్పుడిది అమ్మినా మూడు లక్షల డబ్బు నాకు తిరిగి రాదు. నువ్వు ఇల్లు కొనుక్కుంటున్నావంటే అప్పుచేసి ఐదు అక్షలిచ్చాను. ఆ డబ్బు చాలక ఈ ఇంటిని కూడా అమ్మకానికి పెట్టావు. మీ అమ్మకు మీ తాత ఇచ్చిన ఇల్లు అమ్మటం ఇష్టం లేక అదనపు భారమయినా మళ్ళా అప్పుచేసి మూడు లక్షలకు నీ దగ్గర నుండి కొన్నాను. అప్పుడు చేసిన అప్పు ఇంకా తీరుస్తూనేఉన్నాను. 'ఇంతకయితే నీ కిస్తాను, లేకపోతే బయట అమ్ముకుంటాన'ని నువ్వు నిర్మోహమాటంగా చెప్తే, మార్గాంతరంలేక తప్పక తీసుకున్నాను. బయటవాడి కమ్మితే మూడు లక్షలు రావని నీకూ తెల్సు. తండ్రి అని మాత్రం చవగ్గా ఇవ్వ లేదు. తండ్రిని కనుక నువ్వు ఇల్లు కొనుక్కుంటుంటే నేను ఐదు లక్షల సాయం చెయ్యాలి. ఈ ఇంటిని మీ అమ్మ తండ్రి పసుపు కుంకమ క్రింద ఇచ్చాడు కనుక స్త్రీ

ధనం క్రింద నీకు చెందుతుంది. నాకు ఎలాంటి హక్కులేదని నువ్వే తీర్మానించి, దాన్ని నాకే అమ్మావు. ఇది దోపిడీ అని నీకు నాకూ ఇద్దరకూ తెల్సు. అయినా కూతురన్న వాత్సల్యంతో నేనది పట్టించుకోలేదు. ఇహ నీ ఇంట్లో ఉండటం సంగతి!..."

ఆ పిల్ల లేచి నట్టుంది, అతని మాటలు వినకుండా.

"విను. లేచి పోతావేం...?" అన్నాడతను అరుస్తూ.

అప్పుడు కామేశ్వరరావు లోపలకు ప్రవేశించాడు, "మూర్తీ, ఉన్నావట్రా ఇంట్లో" అని పిలుస్తూ.

తండ్రీ కూతుళ్ళకు అతని పిలుపు విన పడలేదు.అప్పుడు తనే వాళ్ళున్న గది గుమ్మం ముందుకు వెళ్ళి, "ఎవరో వచ్చారు" అని చెప్పింది.

"ఎవరూ?" అంటూ ముందు గదిలో కొచ్చిన అతనికి కామేశ్వరరావు కన్పించాడు. "నువ్వట్రా! రా, లోపలికి, అక్కడే నిలబడ్డావేం" అని అతన్ని తీసుకుని తన గదిలోకి వెళ్ళాడు.

"మామయ్యొచ్చాడు, మనం తర్వాత మాట్లాడుకుందాం" అన్నాడు కూతురితో.

"కాదు. అదేదో ఇప్పుడే తేలిపోవాలి. మామయ్యకు తెలియని సంగతులేం లేవు. ఆయన ఎదుట దాచుకోవాల్సిన అవసరమూ లేదు" అంది భానుమతి మొండిగా, కోపంగా.

"నేన్నీకు తరవాత అన్నీ విడమరచి చెప్తాను. ఇప్పుడు వదిలెయ్" అన్నాడు తండ్రి.

"నువ్వు నాకు చెప్పాల్సిందేంలేదు. నాపెళ్ళయాక మూడేళ్ళు నిన్ను భరించాను చూడు అది నా తప్పు. నా అవసరం ఇప్పుడు నీకు లేదు. ఓ తిప్పులాడిని తెచ్చుకున్నావు. కనుక ఇప్పుడెట్లా అయినా మాట్లాడతావు. అమ్మకు వాళ్ళ నాయన ఇచ్చింది స్త్రీ ధనం కాదా? ఏ లాయర్ని అడిగినా చెప్తాడు. నువ్వు చెప్పు మామయ్యా! అమ్మ ఆస్తి నాకు రావల్సింది కాదా? పెద్ద ఐదు లక్షలు ఇచ్చానని చెప్తున్నాడు! అమ్మకు ఇల్లు కాక తాత డబ్బుకూడ ఇచ్చాడు. అదంతా ఏం చేశావో మామయ్యకు చెప్పు. నాకేమన్నా పుట్టింటి నుండి సొమ్ము ముట్టిందంటే అది అమ్మదే కానీ నీది కాదు. అమ్మ నా కిచ్చింది..."

"తల్లి ఆస్తి వేరు, తండ్రి సంపాదన వేరు! మంచి నిర్వచనమిచ్చావు. దీపికకు కూరన్నం నువ్వు పెడితే, శంకరం పప్పన్నం పెడుతున్నాడన్నమాట!"

"అది నిజమేలే అమ్మాయి! భార్యా భర్తలను వేరుగా చూడకూడదు, వాళ్ళ ఆస్తులూ వేరు కావు" అన్నాడు కామేశ్వరరావు కల్పించుకుంటూ.

"మూడేళ్ళు భరించానని చెప్తున్నావు, పెద్ద గొప్పగా! తండ్రికి చేసిన చాకిరీని ఎవరూ గొప్పగా చెప్పుకోరు. నీ ఇంట్లో ఉన్నప్పుడు నేనూ నాకు తోచింది చేశాను, ఉరికే

ఉండలేదు..."

"అట్టా ఊరికే అనేస్తే పోదు. నాకేం చేశావో చెప్పు. పెద్దమనిషి మామయ్య కూడ వింటాడు..."

"సర్లే, పదరా. అల్లా బయట తిరిగొద్దాం" అన్నాడు కామేశ్వరరావు, గొడవ సద్దుమనిగించేట్టు చెయ్యాలన్న ఉద్దేశంతో.

"కాదు మామయ్యా! ఇవాళ అదేదో తేలాలి. ఒట్టిగా మాటనగానే సరిపోదు."

"ఈ మాటలు నీతో అనగూడదనుకున్నాను. కానీ తప్పటం లేదు. నీ ఇంట్లో మీ బతుకు నేను బతికాను కానీ నా బతుకు కాదు. అల్లుడు ఆఫీసుకు వెళ్ళిందాకా, నేను అతనికి ఏ విషయంలోనూ అడ్డం రాకూడదు. మీ ఇంట్లో ఉన్నందుకు మీ ఇంటి పనులు నాకు చెయ్యక తప్పదు. కూరలు నేనే తేవాలి. సరుకులు తేవాలి. వెయ్యో రెండువేలూ పెట్టి సరుకులు తెస్తే నువ్వు డబ్బివ్వవు. నెల కాగానే నేను నీఇంట్లో ఉన్నందుకు రెండు వేలు నీకివ్వాలి. మొన్న రెండు వేలు పెట్టి సరుకులు తెచ్చా కదా అని ఆ నెల డబ్బివ్వటం మానేస్తే, 'నాన్నా! ఇంకా జీతం రాలేదా? మాకూ ఇబ్బందిగా ఉంది' అని నిర్మొహమాటంగా అడిగేదానివి. కూతురింట్లో పడి తినాలని ఏ తండ్రీ కోరుకోడు. నాకిష్టం లేక పోయినా నువ్వు మనసు కష్ట పెట్టుకుంటావని నీ ఇంటి కొచ్చాను.నా అవసరం పడితే తప్ప ఆ ఇంట్లో నన్నెవరూ పట్టించుకోరు.నాన్నను ఇంట్లో తెచ్చిపెట్టుకున్నాను కదా, ఇంక ఆయనకు చేయాల్సిందేముంది అనుకునే తత్త్వం నీది. ఓ సారి ఒంట్లో బాగులేక, 'అల్లుడు ఆసుపత్రి దగ్గర నన్ను డ్రాప్ చెయ్య గలడా?' అని నిన్నడిగితే, 'ఆయనకు కుదర్దులే, నాన్నా! నేను తీసుకెళ్తాలే' అన్నావు. ఆ తర్వాత నాసంగతే మర్చి పోయావు. నేనే ఎలాగో ఓపిక తెచ్చుకుని వెళ్ళాను. ఏదయినా చెయ్యమని మిమ్మల్ని అడిగితే, మీరు అప్పటికి 'సరే' నంటారు. ఆ తర్వాత నేనడిగిందీ మీకు గుర్తుండదు, నేనూ గుర్తుండను. ఇంక ఇంటికి మీఅత్తా, మామా వస్తే, నా ఉనికే గిట్టనట్టు నువ్వుంటావు. వాళ్ళు వచ్చిన సందర్భంలో సినిమాలు, షికార్లు, పిక్నిక్కులు, కార్లో తిరుపతి, శ్రీశైలం యాత్రలు – వీటిల్లో నేనెక్కడా ఉండను.మీ అమ్మ ఫొటో గోడకు వేళ్ళాడుతుంది, నేను బతికున్నాను కనుక ఇంకా నా ఫొటో వేలాడదీయ లేదు. అంతే తేడా! గుర్తుందా నీకు, నువ్వు నన్ను నీ కారెక్కొద్దన్నావు. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది.కార్ల సంగతి నాకు తెలియంది కాదు. ఆఫీసు కెళ్తే నేనెక్కడికి వెళ్ళాలన్నా కారే. నా ఆఫీసు కారు స్వంత పనులకు వీల్లేదని అంటే, మీకు కోపమా? మీ మావగారు ఆఫీసులో కలసి ఎవరికో అన్‌డ్యూ ఫేవరు చెయ్యమంటే నేను కాదన్నానని, శంకరం కోపం తెచ్చుకోటం సరయిన పనేనా? నేను ఎలా బతికానో నీకు తెల్సు. అయినా నన్ను నా ఇష్టానికి వ్యతిరేకంగా

బతకమని శాసిస్తే అక్కడ ఉండలేక, వచ్చేశాను..."

అతనింకా పూర్తి చెయ్యనే లేదు ఆమె లేచి నిలబడి నట్లుంది, కోపంగా.

"ఏవిటీ వెళ్ళి పోతున్నావా? ఇంతకు ముందు ఎప్పుడూ నోరు విప్పాలనుకోలేదు. ఆవేశంలో నోరు జారాను. వయసు మీరిపోతున్న ఈ తండ్రిని క్షమించెయ్! మరి రాత్రికి ఏ హోటల్‌కు వెళ్దామో చెప్పు. అక్కడికి నేను వస్తాను. లేదూ, సాయంత్రం మీరంతా ఇక్కడకు వస్తామంటే అందరం కలిసే వెళ్దాం" అన్నాడతను.

"నీ డిన్నరూ మాకక్కరలేదు, నువ్వూ అక్కరలేదు. నీ కడుపున పుట్టటమే నా దురదృష్టం! అమ్మతోనే పోయింది ఈ ఇంట్లో నా స్థానం!" అంటూ తాగకుండానే కాఫీకప్పు కింద పెట్టి, విసవిసా నడుచుకుంటూ వెళ్ళిపోయింది భానుమతి.

అతను లేచి బయటకు వచ్చేటప్పటికే ఆమె డోరు తెర్చుకుని కూర్చోటం, డ్రైవరుకు పోనిమ్మనిచెప్పటం, కారు దూసుకు పోవటం అన్నీ జరిగిపోయాయి.

ఆ తర్వాత ఆర్నెల్ల దాకా ఆ పిల్ల అయిపు లేదు.

ఓ రోజు సాయంత్రం, అతను ఉద్విగ్నంగా ఆఫీసు నుండి ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటికి వచ్చిన మనిషికి మంచినీళ్ళు, కాఫీ లాంటివి ఇచ్చే అలవాటు తనకు లేదు. తనకు పెళ్ళయిన కొత్తల్లోనే కాఫీకి తిలోదకాలిచ్చి నాకు మహోపకారం చేశాడు.

అమ్మని పిల్చి ఏదో చెప్పాడు. ఆమె లోపలికి వచ్చి, "భానుమతికి అబార్షనయిందట! అల్లుడు మీ ఆయనకు ఫోను చేసి చెప్పాడట! పిల్ల ఆసుపత్రిలో ఉంది. ఆడతోడు కావాలని అడిగాడట! నువ్వు వెళ్తావా?" అనడిగింది.

"నేను వెళ్ళను. నాకేం సంబంధం? దానికి అహంకారం, పొగరు. నన్ను మనిషిగానే పరిగణించదు"అంది తను.

"చిన్న పిల్ల కదా! తల్లి స్థానంలో మరో స్త్రీ రావటం సంతానం హర్షించలేదు. అది నువ్వు గుర్తుంచుకు ప్రవర్తించాలి, ఓరిమి వహించాలి. ఇలాంటప్పుడే అయినవాళ్ళ అవసరం పడుతుంది. ఆమె అత్తగారికి బిపి, గుండెజబ్బు. ఆసుపత్రిలో ఉండలేదట! అందుకే అల్లుడు మీ ఆయన్ను అడిగాడు నిన్ను పంపమని."

తల్లి 'మీ ఆయన' అన్నప్పుడల్లా తనకు చిరాకు వేసేది. అయితే, అది తను బయటికి ప్రదర్శించేది కాదు.

"తన్ని అడిగితే చాలా, నన్నడగ పనిలేదా?" అంది తను.

"బావుందే, మొగుణ్ణి అడిగితే పెళ్ళాన్ని అడిగినట్టు కాదూ? మొండితనంతో నువ్వు

వెళ్ళ నన్నావనుకో. మంచి మనిషి, అతను మనసు కష్ట పెట్టుకుంటాడు. తర్వాత నీ ఇష్టం."

ఇప్పటికల్లా అతని పట్ల ద్వేషం పోయి, ఓనిర్లిప్త భావం ఏర్పడింది. అందుకే తను అయిష్టంగానే ఒప్పుకుంది. రెండు రోజులు ఉండాల్సి వస్తుందేమోనని అతడన్నాడు. కావల్సిన బట్టలు సంచీలో పెట్టుకుని అతనితో బయలు దేరింది. చాల రోజుల తర్వాత తామిద్దరూ కల్సి బయటకు వచ్చారు. అప్పుడుపెళ్ళికి రిజిస్ట్రారు ఆఫీసుకి వెళ్లటమే. పక్కన రామానుజం, కామేశ్వరరావు కూడ ఉన్నారు. ఇప్పుడు లేరు. తామిద్దరే. ఆటోలో వెళ్దామన్నాడు. తను తలూపింది.

అదో పెద్ద కార్పొరేట్ ఆసుపత్రి. అబార్షనులో చాల రక్తం పోయింది భానుమతికి. ఓ బాటిలు రక్తం కూడ ఎక్కించారట. బెడ్ మీద పడుకుని ఉన్న భానుమతి బాగా నీరసంగా కన్పించింది. తన రాక ఆమె కేమీ ఆనందం కల్గించినట్లు లేదు. అయినా ఆమె పుల్ల విరుపు మాటలేమీ మాట్లాడలేదు.

"నీకు ఆసరాగా ఉంటుందని ఆమెని తీసుకు వచ్చాను" అన్నాడు కేశవమూర్తి భానుమతితో.

తను చాల సార్లు గమనించింది. తన్ను గురించి ఆమెకు ఎప్పుడు చెప్పినా, అతను 'ఆమె' అనే అంటాడు, 'పిన్ని' అనడు. ఆ బాంధవ్యం కలుపుకునే ఉద్దేశం ఆ పిల్లకు లేదు. మనసులో లేని బాంధవ్యాన్ని అంటగట్టటం అతనికిష్టం లేదు. అందుకే, ఆ పిల్లకు సంబంధించినంత వరకు తను 'ఆమె', 'ఈమె'నే.

కేశవమూర్తి మాటలకు భానుమతి జవాబేం చెప్పలేదు.

"ఇప్పుడెలా ఉందీ?"అడిగాడతను కూతుర్ని.

ఆ గొంతులో ఉద్వేగం ఉంది, ప్రేమ ఉంది.

"బాగానే ఉంది. నీరసం తప్ప మరేం లేదు" అంది ఆమె.

"అల్లుడిని అడిగాను. రెండు రోజుల తర్వాత డిశ్చార్జి చేస్తారని చెప్పాడు. ఈ రెండు రోజులూ ఈమె ఇక్కడే ఉంటుంది. మొహమాట పడక, ఏం కావల్సి వచ్చినా ఆమె నడిగి చేయించుకో. మరి నే వెళ్ళేదా? నువ్వు ఇంట్లో కనసడకపోతే దీపిక దిగులు పెట్టుకున్నదట! స్కూలుకెళ్ళటానికి మొండికేస్తున్నదట! నేను దాన్ని మా ఇంటికి తీసుకెళ్తాను, నువ్వు డిశ్చార్జయి ఇంటికొచ్చేదాకా. మీ అత్తగారు సంబాళించుకో లేక పోతోంది, చిన్న పిల్ల కదా!"

"స్కూలు పోతే ఎట్లా?" అంది గాబరాగా భానుమతి.

"రెండు రోజులు స్కూలుకెళ్ళక పోతే నష్టమేం లేదులే" అని అతను వెళ్ళి పోయాడు.

తను వచ్చేటప్పుడే ఓ నిర్ణయం చేసుకు వచ్చింది. సాయమర్థించిన వాళ్ళకు తను చేతనైనంత సాయంచేస్తుంది. ఈ సందర్భంతో భానుమతి, మరొకప్పుడు మరొకరు. భానుమతికి చేయటంలో బంధుత్వ బంధమేదీ లేదు.ఆమెకు అబార్షను ఎందుకయిందో తను వివరాలు అడగలేదు. తనకు చెప్పాల్సిన అవసరం ఉందని ఆమె కూడ భావించ లేదు. ఆసుపత్రిలో ఉన్న ఆ రెండు రోజులూ, భానుమతి మొహమాట పడకుండా తన సాయం తీసుకున్నది.'అది చెయ్యి, ఇది చెయ్యి' అనే కానీ, తన్ను సంబోధించటం కాని, పిలవటం కాని లేదు. తనేం పెద్దగా ఆ పిల్లతో కల్పించుకుని మాట్లాడింది లేదు. ఆమె కూడ తిక్కగా ఏం మాట్లాడలేదు.

డిశ్చార్జి అయే సమయానికి కేశవమూర్తీ, శంకరం కలిసే వచ్చారు.బిల్లులు కట్టాక, భానుమతి సామానంతా రెండు బాగుల్లో సర్ది, కేశవమూర్తి కారులో పెట్టాడు. తను బట్టలు సర్దుకుని బాగు పట్టుకుని బయట పడింది. మొగవాళ్ళు ఇద్దరూ ముందు వెళ్తున్నారు. తామిద్దరూ కల్సి బయటకొస్తూంటే, "రెండు రోజులు నాకుసాయం చేశావు. థాంక్స్!" అంది భానుమతి.

"ఆ అవసరం లేదు. ఎవరికవసరమయినా సేవ చెయ్యటానికి నేను సిద్ధమే. నీకు చెయ్యటంలో ప్రత్యేకతేం లేదు" అంది తను.

భానుమతి పెడసరంగా నవ్వింది.

"ప్రత్యేకత లేక పోవట మేమిటి? నీ మొగుడి కూతురికి నువ్వు కాకపోతే ఎవరు సాయపడ్తారు? అది నీ కర్తవ్యం! ఎవరి కర్తవ్యం వాళ్ళు నిర్వహించినందుకు కృతజ్ఞతలు చెప్పాల్సినపనిలేదు. నేను పొరపాటు చేశాను..." అంటూ తనకు తిరుగు జవాబు ఇచ్చే అవకాశమీయకుండా, కారు డోరుతెర్చుకుని భర్త పక్కన ఫ్రెంటు సీటులో కూర్చుంది.

"మీరు కూడా రండి, మాతో" అన్నాడు శంకరం.

"మీరు పదండి. నేను ఇంటికెళ్ళి దీపికను తీసుకొస్తాను. అది అమ్మకోసం దిగులు పెట్టుకుంది" అన్నాడు కేశవమూర్తి.

తామిద్దరూ ఆటోలో ఇంటికి బయలు దేరారు.అతను ప్రభుత్వంలో పెద్ద హోదా ఉన్న ఆఫీసరే. డిప్యూటీ కలెక్టరని ఓసారి ఆ కూతురే చెప్పింది, విరసంగా.

తమ పెళ్ళయాక, "డిప్యూటీ కలెక్టరని, బాగా సంపాదించి నగలు దిగేస్తాడని పెళ్ళి చేసుకున్నావేమో, నువ్వు పొరపాటు పడ్డావు. కట్టెనా కంపనా కాలని మనిషని మా నాయనకు పేరు ఆఫీసులో, నీకు తెలుసో, లేదో" అంది.

"అంటే?" అనడిగింది తను.

"అంటే, మా నాయన నీతీ, న్యాయాలను పట్టుకుని వేళ్ళాడే మనిషి. ఆయన తన జీతానికి మించి పైన పైస ఆశించడు. నువ్వు మోసపోయానని బాధ పడకు. ప్రేమగా చూసుకుంటాడులే."

"నా కెవరి డబ్బూ అక్కరలేదు. నగలూ, చీరెలూ అన్న మోజూ లేదు నాకు" అంది తను.

"నువ్వు చెప్పావు కనుక నేను నమ్మాలి! నేనేం చెవిలో పూలు పెట్టుకోలేదు."

"నమ్మటం, నమ్మకపోవటం నీ ఇష్టం. ఎవరి నమ్మకం, అపనమ్మకం పై ఆధారపడి బతికే మనిషిని కాను నేను."

"మరేం చూసి ఈ వయసులో ఆయన్ని చేసుకున్నావు?"

"నీ వల్ల! చుట్టూ ఉన్న సమాజం వల్ల! అపనిందలు భరించలేక, మా అమ్మ నిస్సహాయతను చూడలేక!" అంటూ ఆ పిల్లకు వివరణ ఇవ్వాల్సిన తన వివశత్వానికి తనకు ఏడుపు వచ్చింది. ఆ పిల్ల మూతి మూడు వంకరలు తిప్పుతూ అక్కడ నుండి వెళ్ళిపోయింది.

## 3

గేటు తీసుకుని ఇంట్లో పడేటప్పటికి మూడు గంటలయింది.

తను తాళం తీస్తున్న చప్పుడు విని కాబోలు పక్కింటి సుశీలమ్మ గేటు తీసుకుని లోపలికి వచ్చి, "ఎక్కడికి వెళ్ళారు? మీ కోసం ఎవరో వచ్చారు. ఉండమన్నా కానీ మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళి పోయాడు" అంది.

"ఎవరతను?" ప్రశ్నించింది విశాల.

"ఏమో, అతను చెప్పలేదు. నాకు అడగాలని కూడా తోచలేదు" అంది సుశీల.

బహుశః భానుమతి ట్రయినులో బెర్త్ రిజర్వు చేసి టిక్కెట్టు ఎవరికయినా ఇచ్చి పంపిందేమో. మళ్ళీ వస్తాడేమో ననుకుంది విశాల.

"పొద్దున మీ సవితి కూతురు వచ్చినట్టుంది. పనిమీదనా?" అని అడిగింది సుశీలమ్మ అనవసరపు కుతూహలాన్ని ప్రదర్శిస్తూ.

"ఆయన హరిద్వార్‌లో ఉన్నారు. నన్ను రమ్మన్నారట! నాకు ఫోను లేదు కదా! కూతురికి చెప్పి పంపించారు. సాయంత్రం వెళ్తాను" అంది విశాల, తన కడుపులో పుట్టిన మంటను అణిచేసుకుంటూ.

"ఏం చేస్తున్నారాయన అక్కడా?"

"పేకాడుతున్నారేమో, నాకు సరిగ్గా తెలియదు."

"అదేంటమ్మా, పేకాడటానికి అంత దూరం వెళ్ళాలా? ఇక్కడే ఆడుకోవచ్చుగా?"

"ఏం చెప్తాం పిన్నిగారూ? ఇక్కడ గుర్రప్పందాలు లెవ్వనా, బెంగుళూరు, చెన్నయ్యీ వెళ్ళకుండా ఉండటానికి! పెళ్ళాం బాగా ఉండదనా బోగం కొంపల చుట్టూ తిరగకుండా ఉండటానికి కారణం? మీ వార్ని కూడారమ్మన్నార్ట ఆయన! 'ఆ పనేదో ఇక్కడే చేసుకుంటాలే' అని వెళ్ళ లేదంట! ఆ మాత్రం బుద్ధి మా ఆయనకు లేకపోయింది..."

"సర్లే, మా ఆయన బుద్ధే చెప్పాలి, చెప్పక, చెప్పక. వస్తా. పనుంది" అని, మళ్ళీ విశాల తన మొగుడి ప్రస్తావన చేయకండా సుశీలమ్మ పారిపోయింది.

ఆమె భర్తకు లేని అలవాటు లేదు కానీ, ఇతర్ల విషయాలు తెలుసుకోలన్న ఆరాటం మాత్రం మిక్కుటం ఆమెకు. ఆమెను భయపెట్టి పంపించి వెయ్యటానికే విశాల అన్యాపదేశంగా ఆమె భర్త ప్రస్తావన చేసింది. ఇప్పుడింక కేశవమూర్తి లేదని తెలిశాక అతని పట్ల ఆమె మనసు ఆర్ద్రమయింది. తను అతని పట్ల పొరపాటుగా ప్రవర్తించానేమోనన్న భావమూ కలిగింది. మళ్ళీ మనస్సు గతాన్ని తవ్వ సాగింది

✣ ✣ ✣

తామా ఇంట్లో ఉండటం మొదలెట్టిన రెండేళ్లలో అతనికీ, తన తల్లికీ సఖ్యత పెరిగి పోయింది.

"నువ్వు మగాడివి చెయ్యి కాల్చుకోవటమెందుకయ్యా, మాతో పాటు నీకూ ఇంత ఉడకేస్తాను. మాతో పాటే తిందువు కాని!" అంది తన తల్లి.

మాటవరస కేదో నసిగాడు కానీ, ఆ మర్నాటి నుండి తిండికి తయారయ్యాడు. సిగ్గులేని మనిషనే తనకన్పించింది అప్పుడు.

తనూ తల్లికి చెప్పి చూసింది."అతని గోల మనకెందుకు? అనవసరపు లంపటం పెట్టు కుంటున్నావు!" అని.

కానీ ఆమె వినలేదు."లంపటమేంటే? పాపం, అతను వంట చేత కాక బాధ పడుతూంటే నేను చూస్తుండ లేను, మనకెందుకని. నీ లాగా కఠినంగా ఉండటం నావల్ల కాదు" అంది ఆమె.

ఆ తరవాతి ఫస్టుకు తను అద్దె ఇవ్వబోతే అతను తీసుకోలేదు. అతను తాము చేరినప్పుడు అద్దె ఇంతని చెప్పకున్నా, తను అంతకు ముందున్న ఇంటికి ఇచ్చే కిరాయి ఐదొందల రూపాయలూ ఇవ్వబోయింది.

"మీకొచ్చే పదిహేను వందల్లో కిరాయి ఐదొందలంటే చాల ఎక్కువ. రెండొందలివ్వండి చాలు" అన్నాడతను.

అతను మంచివాడని ఆ క్షణంలో మురిసి పోయింది.ఆ తర్వాతి సంఘటనలతో తన మీద వ్యామోహంతో తన్నులోబరుచుకునేందకే ఈ కన్సెషను అని తను అర్థం చేసుకుంది. 'లేకపోతే రొండుగదుల పోర్షన్ని రెండొందల కద్దె కివ్వ రెవరూ!'

అప్పటి నుండి తను రెండు వందల కిరాయి ఇవ్వ సాగింది, అతను మరేం మాట్లాడకుండా పుచ్చుకునేవాడు.అందులోనే కరెంటు, నల్లా బిల్లులు కూడా.

అతను తన ఇంట్లో భోజనం చెయ్యటం మొదలెట్టాక వచ్చిన మొదటి ఫస్టు తారీకున తను అద్దె ఇవ్వబోతే అతను పుచ్చుకోలేదు.

"నిజానికి భోజనానికింద నేనే నాలుగొందలు ఇద్దామనుకుంటున్నాను. మీరేం ఇంటి అద్దె ఇవ్వ నవసరం లేదు" అన్నాడతను.

"అంటే మా భోజనానికి ఆరొందలు లెక్క కట్టారన్న మాట!"

"పోనీ ఎంతివ్వాలో చెప్పండి. అంతా ఇస్తాను" అన్నాడతను.

"అసలు మీరు మా ఇంట్లో భోజనం చెయ్యటం నాకిష్టం లేదు."

"ఆ సంగతి నాకు తెల్సు."

"మరి మా అమ్మకు చెప్పి మానెయ్యొచ్చుగా?"

"ఆమె మనసు నొప్పించటం నాకిష్టం లేదు."

"నా మనసు నొప్పించటం మీకిష్టమా?"

"అనవసరంగా నొప్పించుకునే మనసు మీది. అందుకు నేనేం చేయ లేను."

"ఇది నా దగ్గరకు రావాలనే ప్రయత్నం."

"మీరలా అనుకుంటే నేనేం చెయ్యగలను!"

ఇంక అతనితో మాటలనవసరమనిపించింది అప్పుడు తనకు. అయితే, అతను అమ్మను మొహమాట పెట్టి ఆమె చేతిలో ఐదొందలు పెట్టాడు కానీ, తను ఇంత నిరసన వ్యక్తం చేసినా తమ ఇంట్లో భోజనం చెయ్యటంమాత్రం మానలేదు. తన తల్లి కూడ అతని పార్టీలో చేరిపోయింది. కనుక తనేం చెప్పినా ఆమె అతని గురించి చెడు అభిప్రాయం

ఏర్పరుచుకోలేదు. అద్దె తప్పటమే కాకుండా అదనంగా ఐదొందలు రావటంతో తనకు ఆర్థికంగా వెసులుబాటు కలిగింది. అతనికి భోజనం పెట్టినందుకు తనకు అదనంగా పడిన భారమేమీ లేదు.

అయితే, రోజులంత సీదాగా వెళ్ళమారి పోలేదు. ఆ ఇంట్లో చేరిన నాలుగేళ్ళకు కాబోలు తను చేస్తున్నఉద్యోగం మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తనకు కీళ్ళ నొప్పులు మొదలయ్యాయి. కాలు తీసి కాలు పెట్టాలంటే విపరీతమైన బాధ నరకం అనిపించేది. నడక కష్టమై పోయింది.

"రోజులు ఏదో విధంగా నెట్టివేస్తున్నామంటే, నీ కిప్పుడీ మాయ రోగం వచ్చి పడింది కదే! మనబతుకు గడవటమెట్లా?" అని తన తల్లి వాపోయింది.

"మీ రంతగా కంగారు పడ్తారెందుకూ? డాక్టరుకు చూబెడదాం. నయమై పోతుంది. ఆమె త్వరలోనే కోలుకుని ఉద్యోగం చేసుకోగలరు" అని అతను భరవాసా ఇచ్చాడు.

"నాయన్నాయనా! మంచివాడివి! నీ పెద్దలకు వెయ్యి దణ్ణాలు. ఈ గండం గడిపించు, తండ్రీ! మమ్మల్నీమాత్రంగా నయినా బతికే ఏర్పాటు చెయ్యి, బాబూ!" అంది తల్లి.

"మీరంతగా ప్రాధేయపడాల్సిన పనిలేదు. మనిషి మనిషికి సాయం చెయ్యకపోతే ఎలా? ఇవ్వాళ సాయంత్రమే డాక్టరు దగ్గరకు వెళ్దాం" అన్నాడతను.

అతని సాయం తీసుకోటానికి తన మనస్సేమాత్రం అంగీకరించలేదు. అయితే తప్పనిసరి పరిస్థితి. తనవాళ్ళెవరూ తనకు సాయం చెయ్యరు. ఇలాంటి పరిస్థితుల్లో రెండేళ్ళకో, మూడేళ్లకో చుట్టం చూపుగా ఇంటికొచ్చే అన్నయ్య కూడ రావటం మానేస్తాడు. తనూ, అమ్మా, అతనూ ఆ రోజు సాయంత్రం డాక్టరు దగ్గరకు వెళ్ళారు. డాక్టరు ఏవేవో పరీక్షలు చేయాలన్నాడు. ఉపశమనానికి ఏవో మందు లిచ్చాడు. మొదట్లో డాక్టరు దగ్గరకు వెళ్ళేప్పుడు తన తల్లి కూడా వచ్చినా తరువాత్తరవాత తామిద్దరే వెళ్ళేవాళ్ళు. డాక్టరు బిల్లులు, మందు ఖర్చులు అతనే భరించేవాడు. తన్ను పైస అడిగేవాడు కాదు. తన దగ్గరేం డబ్బు లేదు. ఉన్న ఉద్యోగం కూడ చేయలేక మానుకోవటంతో తను నిస్సహాయ పరిస్థితిలో పడింది. అతని డబ్బు వాడుకోటం తనకిష్టంలేక పోయినా తప్పలేదు. ఆటోలో ఇంటి దగ్గర తల్లి సాయం పట్టి ఎక్కించినా, డాక్టరు దగ్గర అతనే రెక్క పట్టుకుని తన భారాన్నంతా మోస్తూ లోపలకు తీసుకెళ్ళేవాడు. అతను తన ఒంటి మీద చెయ్యేస్తే చాలు తనకు తేళ్ళూ, జెర్రులూ పాకుతున్నట్లుండేది. అయినా తప్ప లేదు. 'భగవంతుడా! నన్నీ స్థితికి దిగజార్చావెందుకయ్యా?' అని తను ఏడ్చిన క్షణాలు ఎన్నో.

కొన్నాళ్ళ చికిత్స తర్వాత తను కొంత మేరకు కోలుకుంది. 'ఇంక తను వెళ్ళి

ఉద్యోగంలో చేర్తుంది. ఎలాగో తన బతుకు తను బతకగలుగుతుంది. ఈ కేశవమూర్తి పీడా వదిలించుకోవాలి. అతను తన మీద చేతు లేసి ఆసుపత్రిలోకి తీసుకెళ్తున్నప్పుడు ఆ చేతులు తన శరీరాన్ని నొక్కటం తన మీద అతనికున్న కాంక్షని వ్యక్తంచేసేవి. ఎంత దౌర్భాగ్యుడీ మనిషి! రోగిష్టి మనిషి మీద కూడ ఇంత కోరికా, కామమా?' తనకు అతన్ని చూస్తే ఏహ్య మనిపించేది.

ఓ సారి డాక్టరు దగ్గరకు ఆటోలో వెళ్తూంటే–"నిన్న మందు వేసుకోలేదట! రోగం నయమెలా అవుతుందీ?"అన్నాడతను.

"నయం కాకపోతే పీడా పోతుంది. అయినా మీకెందుకు?" అంది తను.

"బావుంది! దగ్గరున్న మనిషిని నేను. నాకు కాకపోతే మీ సంగతిఎవరికి ఎవరికి పడుతుంది!"

"పట్టక పోయినా ఫర్లేదు. రోగం ముదిరితే ఛస్తాను."

"చావంత తేలిగ్గా వస్తే ఎవరైనా చావుకు సిద్ధమే. కాని బతికినంత కాలం వైద్యం అవసరం. మూల పడితే మీరెవరికీ ఏం చేయలేక పోవటమే కాదు, మీకే అందరూ చెయ్యాల్సి వస్తుంది. మీకిలా ఉంటే మీ అమ్మగారెలా బాధ పడుతున్నారో చూడండి."

"అవును. ఆమె కోసమే మీ సాయం అంగీకరించాల్సి వస్తోంది. లేకపోతే హాయిగా చచ్చిపోయేదాన్ని. నేను లేకపోతే మా అమ్మనెవరు చూస్తారు."

"మీ అన్నయ్య లేడూ? తల్లి నామాత్రం తీసుకెళ్ళడూ? ముసలి తల్లికి చేయాల్సిన బాధ్యత అతనికి లేదూ?"

"ఉంది. వాడొట్టి మృగం! వాడేం పట్టించుకోడు."

"పోన్లే. మీరేం భయపడకండి. నేను బతికి ఉన్నంత కాలం ఆమె మా పెద్దక్కనుకుని నా దగ్గర ఉంచుకుంటాను."

"నేను పోయినా, మా అమ్మను మీదగ్గరే ఉంచుకుంటారా?"

"మరి మీ గురించే ఆమె అంటే నాకు శ్రద్ధ అనుకున్నారా? ఈ నాలుగైదేళ్ళలో ఆమె పట్ల ప్రేమ, గౌరవం పెరిగాయి నాలో. నా గురించి తపన పడే మనిషి నాకు దొరికిందని నా కెంత సంతోషంగా ఉందో!"

తనింకేం మాట్లాడలేక పోయింది. అతని సంగతి తనకు తెల్సు, తనకు నయమవుతుంది, తన మీద ఆశతోనే అతడు తన తల్లిపై ఆపేక్ష ఒలకబోసి ఆమెను ఆకట్టుకుంటున్నాడు అనుకుంది తను.

ఆర్నెల్ల తరువాత తనో మోస్తరుగా కోలుకుంది. మళ్ళీ ఉద్యోగంలో చేరటానికి తను చిట్‌ఫండ్ కంపెనీకి వెళ్ళింది.

మేనేజర్ తన్ని చూడగానే అడిగాడు, "ఏవమ్మా, ఇప్పుడెలా ఉన్నావు?ఆరోగ్యం బాగయిందా?"అని.

"ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాను. మళ్ళీ ఉద్యోగంలో చేరదామని వచ్చాను" అంది తను.

"బావుందమ్మా! ఆరు నెలలు నీ పోస్టు ఖాళీగా ఉంటే మా పనులెలాకాను! నీ జాగాలో మరో అమ్మాయిని పోస్టు చేశాం. ఇప్పుడామెను ఉద్యోగంలో నుంచి తొలగించి నీకివ్వలేం. ఆమె బాగానే పని చేస్తున్నది. రెండుమూడు నెలల్లో మరో అవకాశం వచ్చేట్టుంది. అప్పుడు తప్పకుండా నీకు ఉద్యోగమిస్తాను" అన్నాడాయన.

తను నీరస పడిపోయింది. తను ఎలా బతగ్గలదు? తల్లినెలా పోషించగలదు? ఉన్న జీవనాధారమొక్కటీ పోయింది. పదిహేడేళ్ళబట్టీ తనా ఉద్యోగం చేస్తున్నది. అయినా నిర్దయగా ఉద్యోగం తీసేశాడతను. తను ప్రాధేయ పడింది. తనకు ఆ ఉద్యోగమే జీవనాధారమంది. అయినా అతనేం పట్టించుకోలేదు.

"ఇన్ని నెలలెలా గడిపావమ్మా? మరో రెండు నెలలు ఆగలేవా? నీకు తప్పకుండా ఉద్యోగమిస్తానంటున్నాగా? నా చేతిలో లేని పని నన్ను చేయమంటే కుదరదు. నువ్వు సెలవు పెట్టేప్పుడు రెండునెలలన్నావు! ఆరు నెలలయింది. ఆరు నెలలు ఆ సీటు ఖాళీగా ఉంచితే మా పనెలా అవుతుంది? వెళ్ళు. మళ్ళీ రెండు నెలల తర్వాత కలువు. నేను చెయ్యగలిగిన సాయం చేస్తాను" అన్నాడు మేనేజరు.

నిస్సహాయంగా తను ఇంటికి వచ్చింది.తల్లి తన్ను చూసి గాబరా పడిపోయింది.

"ఏమైందమ్మా, ఎందుకలా డీలా పడిపోయి ఉన్నావు?" అని అడిగింది.

తనకెలా చెప్పాలో తెలియలేదు, చెప్పకా తప్పలేదు.

"అంతేనా? మరేమోననుకున్నాను. నీకుద్యోగం లేకపోతే ఈ ఆర్నెల్లూ గడవలా? అలాగే గడుస్తుందిలే. ఆ దేవుఁడే ఉన్నాడు. ప్రతిదానికీ మనం భయపడుతూ కూర్చుంటే ఎలా? గాలిలో పెట్టిన దీపాలు మన బతుకులు! మీ నాయన సంపాదించినదంతా ఖర్చయి పోయింది. మనమెలా బతుకుతామా అనుకున్నాను. ఆ దేవుడే దోవ చూపించాడు. ఇప్పుడూ చూపుతాడు. మనల్ని దిక్కులేకుండా వదల్డు" అంది ఆమె.

తల్లి కా దన్ను ఎలా వచ్చిందో తనకు తెల్సు. అది కేశవమూర్తి ఆమెకిచ్చిన ఆసరా,

ధీమా. వాళ్ళిప్పుడు పరాయివాళ్ళలా వుండటంలేదు. తోడబుట్టినవాళ్ళలా వుంటున్నారు. డబ్బు అవసర పడితే అతని దగ్గర అడిగి తీసుకోటానికి ఆమె ఏమాత్రమూ సందేహపడటం లేదు. ఇప్పుడు మళ్ళా తల్లి తన దగ్గర కేశవమూర్తితో వివాహ ప్రస్తావన చేసినప్పుడు తనకు ఆ విషయం నిర్ధారణ అయింది. అప్పటికీ తనలో అహం చావలేదు. యాభై నాలుగేళ్ళ ముసలివాడినా తను కట్టుకోటం! తనకు తెల్సిన వాళ్ళేమనుకుంటారు? ఎవడూ దొరక్క చివరకు ఈ ముసలాడిని ఎంచుకున్నదని జనం అనుకుని పోరూ? రెండో పెళ్ళివాడయినా ఈ వికృతపు మొహాన్నా? అతని మాటంటేనే తనకు పడదు. అతన్ని చూస్తేనే తనకు మంట! నిజానికి అతన్ని ద్వేషించాలని తనకెందుకు పుట్టిందో తనకే తెలియదు. స్త్రీని ఆబగా చూసే మనుషులు తనకెంతమంది తెలియదు? కానీ, వాళ్ళందర్నీ తను ద్వేషించిందా? లేదే! దేనికీ అతను తన్ను బలవంతం చేసింది లేదు. అద్దె ఎంత ఇస్తే అంతే పెచ్చుకున్నాడు. చివరకు. తను భోజనం చేసినందుకు డబ్బిచ్చాడు. తను ఉద్యోగం చేయలేకపోతే ఆదుకున్నాడు, మందులిప్పించాడు, రోగం నయం చేయించాడు. అయినా అతనంటే తనకు గిట్టదు.

ఓసారి అతనితో ఆసుపత్రి కెళ్ళేటప్పుడు ఈ ప్రస్తావనే వచ్చింది. అతను తన మనసును చదివినట్టు చెప్పాడు, "నేను మీకేం చేసినా, అది మీపై నాకుండే ఇచ్ఛతోనే నేను చేస్తానని మీ నమ్మకం. అంతకంటే భిన్నమైనభావన ఉండొచ్చని మీ ఆలోచనకసలు తట్టదు..."అని.

"అట్లనా..." అంది తను ఎగతాళిగా అతని మాటలను తీసిపారేస్తున్నట్టు.

"మనిషి తనకనుభవం నేర్పిన పాఠాలే శాశ్వత సత్యాలనుకుంటాడు. ఊర్కే ఎవరూ ఏదీ చెయ్యరు, ఎవరూ ఏదీ ఇవ్వరు అని మీకు అనుభవం నేర్పింది. ఎవడయినా అలా చేస్తే, అందులో మీకు స్వార్థం, స్వలాభం కనిపిస్తుంది. అలా చేసే మనిషిని అనుమానంగా చూస్తారు. ఆ వ్యక్తి చేసేది తప్పుకనుక, మీరేమన్నా పడిఉండాలని భావిస్తారు!"

"నన్ను చదివేసినట్లే చెప్తున్నారే?"

"అన్నింటి కంటే మీలో ఉన్న పెద్ద భయం లోకం ఏమనుకుని పోతుందేమోనని. లోకాన్ని లెక్కచేయనట్లే కనిపిస్తారు కానీ మీకదంటే చాల భయం."

అతనే మనుకున్నా తనకు లెక్కలేదు. అయితే పరిస్థితులలాగకూడ సాగలేదు. ఓ సారి పక్కింటి సుశీలమ్మతో మొదలయిన గొడవ, భానుమతి రాకతో అంటుకుని తన ఆలోచనలనే మార్చేసి, తనను పరిస్థితులకు రాజీ పడేట్టు చేసింది.

"ఎట్లా ఉన్నావు, విశాలా? కాస్తంత తగ్గినట్టేనా? ఇది వరకు అసలు నడవటమే

కష్టంగా ఉండేది. ఇప్పుడతని పక్కన నడుస్తుంటే హుషారుగా కూడ కనిపిస్తున్నావు!" అంది సాయంత్రం ఇంటికొస్తూనే సుశీలమ్మ.

జనాల మాటలవెనుక అర్థాలుంటాయని తనకు తెలుసు.

"అంటే రోగం తగ్గింది కనుక హుషారుగా ఉన్నానా, లేక అతని పక్కన నడవటం వల్ల హుషారుగా ఉన్నానా?" అనడిగింది తను శషభిషలు లేకుండా.

"నాకెలా తెలుస్తుంది, నువ్వే చెప్పాలి, ఎందుకో?" అని అంటూ, అప్పుడే వచ్చిన భానుమతితో, "మీ నాయన ఇప్పుడు హుషారుగా ఉంటున్నాడు. అంతా విశాల చలవే. ఆయన కిప్పుడు ఒంటరితనం పోయింది, వంట చేసుకునే పని కూడ లేకుండా చేసేసింది విశాల. ఆమెను కూడ మీ కుటుంబంలో చేర్చుకోండి, అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుంది..." అని మాటలు కల్పింది సుశీలమ్మ.

"మీకు ఆమోదయోగ్యంగా ఉంటుందేమో, మాకు కాదు. మీరు మహా ఉత్సాహ పడుతున్నట్టున్నారు ఆయనకేదో ఆలంబనం చూడటానికి! ఏదో ఏడ్చుకుంటున్నాడని చూసీ చూడనట్టుగా ఊరుకుంటున్నాం. మీబోటివారిప్పుడు నడుం కట్టుకుని ఆయన్ని ఓ ఇంటివాడిని చేసేదాకా ఊరుకునేటట్టులేరే!" అంది విరసంగా భానుమతి.

ఇంక చూస్తూ ఉండలేక పోయింది తన తల్లి.

"చిన్న పిల్లవి! పెద్ద పెద్ద మాటలు మాట్లాడకమ్మా, బావుండదు. ఇక్కడేం జరుగుతున్నది? నువ్వేం చూసీచూడనట్టుగా ఊరుకుంటున్నావు? మనుషుల శీలాలకు పేడకళాపి చల్లే మాటలొద్దు. డబ్బు లేదు కానీ, మాకూ మానం మర్యాదా ఉన్నాయి!" అంది.

ఆ నోట్లో నోరు పెట్టి బతకటం కష్టం. అమ్మ మాటలతో ఆ పిల్ల పెట్రేగి పోయింది.

"ఎందుకు లేవు, అనసూయమ్మ తల్లీ, ఉన్నాయి! ఇంత వయసొచ్చింది. చెప్పుకుంటే సిగ్గు చేటు. అటు మా నాయనా, ఇటు మీరూ! మా ముసలాడికి బుద్ధిలేదని నేనెప్పుడో తీర్మానించుకున్నాను. మొన్న నేనొచ్చినప్పుడే కమలమ్మగారంటే, నేను ఆవిడను నాలుగూ ఝాడించాను. ఇప్పుడు సుశీలమ్మ గారి మాటలతో నిర్ధారణఅయిపోయింది. బరి తెగించి పోయారు మా నాయనా, నీ కూతురూ! నలుగురూ నా నోట్లో గడ్డి పెడుతున్నారు! నీ కళ్ళు మూసుకు పొయ్యాయా? లేక ఇదీ బాగుందిలే అని కళ్ళు మూసుకుంటున్నావా?"

"ఏం కళ్ళు మూసుకుంటున్నాను! నా కూతురి మూర్ఖత్వం వల్ల నేనీ వయసులో నీ బోటిదాని మాటలుపడాల్సిన ఖర్మ నాకు పట్టింది..." అని తన తల్లి కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

అయితే, కళ్ళనీళ్ళకు కరిగిపోయే రకం మనిషి కాదు భానుమతి. ఆమె తన వంక

తిరిగి, "అవునూ, నీ పని నచ్చక నిన్ను ఉద్యోగంలో నుండి తీసేశారటగా?" అని అడిగింది.

"ఎందుకు తీసేశారో నీకనవసరం" అంది తను.

"ఇప్పుడు నువ్వూ, నీ తల్లీ మా నాయన మీద పడి తింటున్నారు కనుకే అడగాల్సి వచ్చింది కానీ, నీకు ఉద్యోగముంటేనేం, లేకపోతేనేం. నాకేం పట్టింది నిన్నడగటానికి?"

"అంతేగా మరి! నీకు చెందాల్సిన డబ్బు ఎవరో తినేస్తుంటే నీకు గుండెల్లో మంట పుట్టటం సహజమే! మా ఆయన కూడ చెల్లీ, అక్కా అంటూ డబ్బు దొబ్బబెట్టటం చూసేసరికి నాకు మంట పుట్టి, మా ఆయన కా రోగం వదిలేదాకా తిండి పెట్టలేదు. చచ్చినట్టు దిగివచ్చాడు" అంది సుశీలమ్మ.

"ఆయన పేకాడి డబ్బు తగలేస్తాడంటారు....!"

"ఆడితే మాత్రం! అది ఆయన కానందం కలిగిస్తుంది. అక్కా, చెల్లీ కిస్తే వస్తుందా ఆ ఆనందం."

"అది నిజమేలే. మన డబ్బు మనిష్టమొచ్చినట్టు తగలెట్టుకుంటాం. నేనడిగాను మా నాయన్ని, 'ఎంతకాలం ఈ గుంపును మేపుతావు?' అని. 'మీ నాయన ఎవత్తెనో ఉంచుకున్నాడంటగా?' అని కూడా అడుగుతున్నారని చెప్పాను. 'దాన్ని పెళ్ళి చేసుకుంటావా?' అనీ నిలదీశాను..."

"ఏమన్నాడేం మీ నాయన?"

"'వాళ్ళ విషయం నువ్వు మాట్లాడకు. జనం వంద అనుకుంటారు, అడుగుతారు. అందరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. పెళ్ళి చేసుకుంటే చేసుకుంటా. నీకు చెప్పాల్సిన పనిలేదు' అన్నాడు.'పెళ్ళాడకపోయినా ఆవిడ నా భార్యే' ననీ అన్నాడు."

"అంత సిగ్గూ, లజ్జా వదిలేసి మాట్లాడాడన్నమాట! !"

"మరే! ఆడాళ్ళే సిగ్గూ, లజ్జా వదిలేస్తూంటే మగాళ్ళకేమిటి? బరి తెగించేస్తారు" అంటూ తన తల్లి వంక తిరిగి, "ఆయన అంత స్పష్టంగా చెప్తూంటే, నీ కూతురు పతిత్త, నువ్వు మహా నీతిమంతురాలని నమ్మటానికి నేనేం చెవిలో పూలు పెట్టుక కూర్చోలేదు. తప్పుడు ముం...!"అంది భానుమతి.

అంతే, తన తల్లి శివమెత్తిన దానిలా అయిపోయింది. కూరలు తరుగుతున్నది కాస్తా, కత్తి పీట పట్టుకుని "పిచ్చి కూతలు కూశావంటే నీ ప్రాణం తీస్తానే, గుడిసేటిదానా! నువ్వేమనుకుంటున్నావే, మమ్మల్నిగురించి. నీకంటే బాగా బతికిన వాళ్ళమే..." అని లేచేసరికి, భానుమతీ, సుశీలమ్మా వీధిలోకి పారిపోయారు.

వీధిలో నుండే భానుమతి గొంతెత్తి, "ఇదిగో, చెప్తున్నా, వినుకో. మా ముసలాడు

పాపిష్టి కొడుకు! మాఅమ్మ ఉన్నప్పుడే చెడ తిరిగేవాడని పేరు. తను వేసే వేషాలకు మా ఇంట్లో వీలు చిక్కక ఇక్కడ ఈ భాగోతం నడుపుతున్నాడు. ఇంక నీతో మాటలు అనవసరం. రేపటిలోగా మీరు ఇల్లు ఖాళీ చేసి వెళ్ళకపోతే, వచ్చి మీ ముఖాల మీద పేడకళాపి చల్లుతాను. సామాన్లన్నీ తీసి బయట పారేయిస్తాను. ఎవడడ్డ మొస్తాడో చూస్తాను" అని బాడించి, కారులో ఉడాయించింది.

తన తల్లి ఆ అరుపులకు నేల కూలబడి పోయింది. తనూ మాన్పడి పోయింది. చుట్టు పక్కల వాళ్ళు ఈ రాద్ధాంతమంతా చూస్తూవుంటే తన మొహాన కత్తివాటుకు నెత్తురు చుక్క లేక పోయింది.కూలబడిన తన తల్లి గుండె పట్టుకుంది. ఏమయిదో నని తను గాబరా పడింది.

"ఏం భయపడకు. చావటం కూడ నాకు చేతనవటం లేదు" అంది ఆమె, కఠినంగా.

తనమీద అంత ద్వేషం ఎందుకో తను అర్థంచేసుకో లేక పోయింది.

"పద వెళ్దాం" అంది ఆమె.

"ఎక్కడికి?" అనడిగింది తను.

"ఏమో? ఈ ఇంట్లో మాత్రం ఇక ఉండొద్దు."

తామా ఇంట్లో ఉండటం ఎంత అసందర్భమైన సంగతో ఆమెకు కూడ అవగతమైనట్లుంది. ఎక్కడికి వెళ్ళాలి, ఏట్లా బతకాలి అన్న మనోవ్యథతో తన మనసు అతలాకుతల మయింది.

"ఆయనకు చెప్పకుండా వెళ్ళిపోదామా?" అంది తను.

నిజానికి చెప్పకుండా వెళ్ళటానికి తనకెలాంటి అభ్యంతరమూలేదు. అతని పట్ల తనకా గౌరవమూ లేదు. మునుగుతున్న మనిషి గడ్డి పోచను కూడ పట్టుకుంటాడు. వెతుకుతున్న తనకా వంక దొరికింది.

"అయ్యో, అతని విషయమే మర్చిపోయాను. మనకింత చేసిన ఆ మనిషికి చెప్పకుండా ఎలా పోతాం. రేపతను క్యాంపునుండి వస్తాడుగా? చెప్పే వెళ్దాం" అంది తన తల్లి.

ఆ రాత్రి తాము వంట చేసుకో లేదు. ఇద్దర్లో ఎవరికీ తినాలన్న ఇచ్ఛలేదు. అంతగా వికలమై ఉన్నాయి తమ మనసులు.

## 4

ఆలా అన్య మనస్కంగా ఆలోచిస్తూ కూర్చున్న విశాలకు టైమెంతయిందో కూడా

తెలియలేదు. తల ఎత్తి గోడవంక చూస్తే, సాయంత్రం ఏడు గంటలయింది. ఆమె అయోమయంలో పడిపోయింది. ట్రైనెప్పుడో ఆమెకు తెలియదు. ఎప్పుడు బయలు దేరాలో తెలీదు. అసలు భానుమతి తన్ను తీసుకెళ్తుందో లేదో తెలీదు. వెళ్ళాలంటే, అన్నం వండు కోవాలి, కానీ ఆమెకు తినాలని లేదు కనుక ఆ ఇబ్బంది లేకుండా పోయింది. భానుమతిని ఎలా కాంటాక్టు చేయాలో ఆమెకు తెలియ లేదు. ఎనిమిదయిందాకా ముళ్ళమీద కూర్చున్నట్టుండి పోయింది విశాల. ఆమె దగ్గరున్న ఫోను నంబరు కామేశ్వరరావుది మాత్రమే. అదీ అతడు ఉత్తరం రాయబట్టి తెలిసింది. భానుమతిది ఉందికానీ, ఆ ఫోను నంబరు మారిపోయినట్లుంది. భానుమతి ఇల్లు ఆమెకు తెలీదు. ఏం చేయాలో తోచక విమూఢంగా కూర్చుండి పోయింది విశాల.

ఇంతలో ఎవరో గేటు తెరుచుకు రావటం కన్పించింది. అతడు రామానుజం. ఆమెతో పాటే ఆఫీసులోపని చేసే నిర్మల భర్త. భార్యా, భర్త లిద్దరూ ఆమె పట్ల స్నేహంగా ఉంటారు. అతడూ మిత్రుడిగా ఆమెతో మెలిగేవాడు. అ దంపతులకు ఇద్దరు పిల్లలు. ఎప్పుడయినా వాళ్ళు ఆమెని తమ ఇంటికి కూడా భోజనానికి పిల్చేవారు. ఆమె పెళ్ళికి సాక్షి సంతకాలు చేసినవాళ్లలో అతను ఒకడు.

ఆమె అలా గోడకు చేరబడి కూర్చునుండటం చూసినతను, “ఏఁవిటలా ఉన్నారు, విశాల గారూ?” అని అడిగాడతను.

అతని రాకతో కొంత ఆశ్వాసన లభించినట్లయింది ఆమెకు.

“ఆయన పోయారు” అంది ఆమె.

“అయ్యో! ఎప్పుడూ?”

చెప్పింది ఆమె. తను భానుమతితో ట్రయినుకు వెళ్ళాల్సిన సంగతీ చెప్పింది, తన సందిగ్ధం గురించీ చెప్పింది.

“హరిద్వార్ చూడటానికి వెళ్తున్నారనుకున్నా కానీ ఇలా జబ్బు చేసి అకస్మాత్తుగా పోతారనుకోలేదు. ఇప్పుడీ పిల్ల నన్ను సందిగ్ధంలే పెట్టి చంపుతోంది” అంది విశాల.

“ఆమె భర్త ఎక్కడా పని చేసేది? గ్లాడ్‌స్టోన్ కంపెనీలోనేగా? మా ఇంటికి దగ్గరలోనే ఆ కంపెనీ లోనే పనిచేసే జగన్నాథం ఉన్నాడు. అతనికి ఫోను చేసి వాళ్ళ ఇల్లు కనుక్కుంటానుండండి” అని అతను మొబైలు బయటికి తీశాడు.

అయితే అతనికా అవసరం లేక పోయింది. అప్పుడే గేటు తెర్చుకుని ఓ వ్యక్తి లోపలకు ప్రవేశించాడు.

"నువ్వేనా, విశాలమ్మంట! ఇల్లెప్పుడు కాళీ చేస్తుండవు?" అన్నాడతను పెద్దగా వస్తూనే.

"నువ్వెవరు, నేను ఇల్లు ఖాళీ చెయ్యాలని చెప్పటానికి?" అంది విశాల, ఉద్విగ్న పడిపోతూ.

"శంకరం సారు పంపించిండు నన్ను!" అన్నాడతను.

శంకరం భానుమతి మొగుడు.

"భానుమతొచ్చి ఖాళీచెయ్యమని చెప్తే చేస్తాలే, నువ్వు వెళ్ళు" అంది విశాల.

"ఆయమ్మ నాయన్ని బొందలో వెట్టి అరిద్వారంట ఎళ్ళింది. ఎళ్తూ ముసలాయన దినవారాలయ్యేలోపల ఇల్లు ఖాళీచేయించమని నాకు చెప్పిండె..."

"ఏ ట్రయినులో వెళ్ళింది...?" అనడిగింది విశాల, ఆశ్చర్య పడిపోతూ.

"డబ్బున్నోళ్ళు! ఆళ్ళు రైల్లో ఎళ్తరా? ఫ్లయిటులో ఎళ్ళింండ్రు. రేపటి కొచ్చేస్తరు. సర్లే, ఎన్నాళ్ళుంటావు అళ్ళ ఇంట్లో ఉద్దరకు.మగడినెట్లనో చంపినావు. మిండమగడిని పెట్టుకు కులుకుతుండవు. నేను మంచిగ చెప్తన్న, ఇనుకో. నేను మంచోళ్ళకు మంచోడిని, చెడ్డోళ్ళకు చెడ్డోడిని. నాకనవసరంగా కోపం తెప్పించకు. ఇల్లెప్పుడు కాళీ చేస్తుండవో చెప్పు."

ఆ మాట అతననంగానే రామానుజానికి కోపం వచ్చింది.

"చూడు, నువ్వెరవో మాకు తెలీదు కానీ, ఆడవాళ్ళని కూడా గౌరవించని మనిషివని నాకర్థమవుతున్నది. స్త్రీలను గురించి మర్యాదగా మాట్లాడటం నేర్చుకో.అది నీ ఒంటికి మంచిది" అన్నాడు.

"ఓర్నియవ్వ, నా కొడక! నువ్వెవడివిరా, నాకు జెప్పేతానికి! బానుమతమ్మ ఎప్పుడో జెప్పినాది, 'దాని మిండమొగుడుంటాడు, ఆడు అడ్డు తగులుతాడు, బద్రమ'ని. ఆ నాయాలువు నువ్వేనన్న మాట! నీక్కూడా వార్నింగిస్తున్నా. మళ్ళిక్కడ కన్పించినవా, నువ్వు బతికుండవు. ఖబడ్దార్!"

"అట్లనా! డిసిపి రసూల్‌ఖాన్ తెల్సునా? అతడు నిన్ను పోలీసు స్టేషనుకు పిలిపించి మాట్లాడతాడులే. అతడిక్కూడా చెప్పు, 'ఖబడ్దార'ని" అన్నాడు రామానుజం.

ఆ మాటతో దిగి పోయాడు రౌడీ. "అదేంది, సార్! గట్ల గరమయితరు. సారు తెల్సని చెప్తుంటే, ఇన్ని మాటలుండవు గందా? మా ధంధా మాది. ఎట్లనో బతకాల్నా? ఈ యమ్మ ఇల్లు కాళీ చేస్తే నాకేంది, లేకుంటె నాకేంది! వస్తా" అని అతను వెనక్కు తిరిగాడు.

"ఓయ్, నీ పేరేందో చెప్పెళ్ళు" అనరిచాడు రామానుజం, వెనకనుండి.

"పేరెందుకు సార్! భూల్ జావ్! మళ్ళ నేనిటు రానంటిగా?" అని వెళ్ళిపోయాడతను.

అతనో స్మాల్‌టైమ్ రౌడీ. పోలీసు మాట వినగానే బెండేలెత్తి పోయాడు, కాలికి బుద్ధి చెప్పాడు. రామానుజానికి డిసిపి రసూల్‌ఖాన్ తెల్సిన మాట వాస్తవమే. ఎప్పుడో చిన్నప్పటి క్లాసుమేటు. ఇప్పుడు తను వెళ్ళి ఆ రౌడీ మీద కంప్లయింట్ చేస్తే అతడు తన మాట మన్నించి చర్య తీసుకుంటాడన్న నమ్మకమేమీ లేదతనికి. అయినా గాలిలో ఓ మాట విసరి చూశాడు. అది ఫలించింది.

స్త్రీని అవమానించటానికి 'మిండ మొగుడ' న్న మాట చాలు! విశాల ఏడుస్తూ కూర్చుంది. ఆమెనెలా సముదాయించాలో అతనికి తెలియలేదు.

"ఆ పనికిమాలిన వెధవ మాట పట్టుకుని బాధ పడకండి. మిమ్మల్ని హరిద్వార్ తీసుకు వెళ్తానని ఆమెచెప్పిన మాట అబద్ధం. మీరాయన భార్య అని గుర్తించ ఇష్టపడని ఆమె మిమ్మల్ని ఎలా తీసుకు వెళ్తుందనుకున్నారో నాకు తెలియదు. మిమ్మల్నిప్పుడు ఇల్లు ఖాళీ చేయించటమే ఆమెకు పట్టుకుంది. ఆయన పోయిన విషయం తెలియగానే ఆమె ప్రయత్నం మొదలెట్టింది. ఆయన వీలునామా రాయకుండా పోతే ఎవరికి ఎంత హక్కు ఇంటిమీద ఉంటుందో నాకు తెలియదు. లాయర్ని కనుక్కోవాలి. అయితే, పెన్షను మాత్రం భార్యకిస్తారు" అన్నాడతను.

"నాకాయన డబ్బువద్దు, ఏమీ వద్దు. నన్ను నామానాన బ్రతకనిస్తే చాలు..." అంది విశాల కుళ్ళుతూ.

"ఎట్లా బతుకు తారు? పసి పిల్లల్లాగా మాట్లాడకండి. బతకటానికి డబ్బుండాలి. ఆ వాస్తవాన్ని గుర్తించ కుండా ఎట్లా బతుకుతారు. బతకటానికి డబ్బెందుకు అనేది అర్థం లేని మాట...!"

అతని మాటలకు ఆమె జవాబు చెప్పలేదు.

అతనే చెప్పాడు, "మీరనసరంగా బాధ పడకండి, హరిద్వార్ వెళ్ళలేక పోయానని. ఇప్పుడు వెళ్ళినాప్రయోజనమేం ఉండదు. పొద్దునో, మధ్యాహ్నామో ఫ్లయిటులో వాళ్ళు వెళ్ళారంటే, దహనం కూడా అయిపోయిందేమో చెప్పలేం. ఇంక ప్రయాణ మెలాగో లేదు కనుక మీరు రెస్టు తీసుకోండి. నేను వెళ్ళి నా భార్యను తీసుకువస్తాను, మీకు తోడుగా ఉంటుంది" అన్నాడతను లేస్తూ.

"థాంక్స్, రామానుజం! అక్కర్లేదు.నాకు ఒంటరితనం అలవాటే. నేనుండగలను"

అంది విశాల. రామానుజం రెండుమూడు సార్లు చెప్పిచూశాడు. కానీ ఆమె అదే మాట చెప్పటంతో అతను తను మర్నాడొస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

మళ్ళా విశాల మనస్సు భూతకాలంలోకి జారుకుంది. భానుమతి అంటే ఆమెకు అసహ్యం ఎప్పటినుండో ఉంది. ఇవ్వాళది పరాకాష్ఠకు చేరింది. తను కేశవమూర్తి పట్ల నిర్దయగా ప్రవర్తించింది కానీ, మరెవరి పట్లనయినా సహృదయత తోనే మెలిగింది. ఇవాళ తను కేశవమూర్తి పట్ల ప్రవర్తించిన తీరుకూడా ఆమెను బాధించ సాగింది. తనలో అంతర్లీనంగా తను అందగత్తె నన్న అహంభావం ఉండి ఉండాలి. అందుకే వచ్చిన అవకాశాల నన్నిటినీ తను కాదనేసుకుంది. వయసు మీరి పోతుండటంతో ఆ అవకాశాలూ రాకుండా పోయాయి. అంతలో కేశవమూర్తి తగిలాడు. సహృదయతతోనే తమకు సాయం చేయ మొదలెట్టినా, అతడు తన పట్ల లాలసతోనే అన్నీ చేస్తున్నాడని భావించింది. తన్ను 'పెళ్ళి చేసుకుంటే చేసుకుంటాన'ని అతడు తనతో అన్నాడని భానుమతి చెప్పాక తన మనసు ఉడికి పోయింది. అలా ఎందుకన్నాడో, అతని ఉద్దేశమేమిటో తేల్చుకోవాలన్న పిచ్చి ఆవేశమొచ్చింది.

మర్నాడు పొద్దున అతను ఇంటికొచ్చాడు. తన తల్లి కాఫీ తీసుకెళ్ళి ఇచ్చింది. అతను తమ పరిస్థితేం గమనించలేదు. కాఫీ తాగుతూ పేపరు పట్టుకు కూర్చున్నాడు. అమ్మ చెప్తుందని ఎదురు చూసిన తనకు ఆమె ఏం మాట్లాడక పోయేసరికి తను నోరు విప్పక తప్పలేదు.

"మేం మీకేం అపకారం చేశామని మీరు మమ్మల్నింత అవమానాల పాలు చేస్తున్నారు?" అని అడిగింది, తను దూకుడుగా వెళ్ళి.

"నేను మిమ్మల్ని అవమానాల పాలు చేస్తున్నానా? అంతకంటే నన్ను తిట్టటానికి మీకేం మాటలు దొరకలా?" అనడిగాడతను నవ్వుతూ.

అతని నవ్వు చూసి తనకు ఒళ్ళు మండుకు పోయింది. ఒంటికి కారం రాచుకున్నట్లయింది.

"అవమానం కాక మరేమిటి? మీ అమ్మాయితో పెళ్ళాడకపోయినా నేను మీ భార్యనని చెప్పటంలో మీ ఉద్దేశమేమిటి? నిన్న మీ అమ్మాయి వచ్చి నానా దుర్భాషలూ ఆడింది..."

"మీరు ముందు కూర్చోండి మాట్లాడు కుందాం..."

"మీరు చూపే మర్యాదలు చాలు! పైకి తియ్యగా మాట్లాడుతూ వెనక గోతులు తవ్వుతారు మీరు! మీ దయ చాలు. మేం ఇప్పుడే ఈ ఇంటినుండి వెళ్ళిపోతున్నాం."

అతను తన మాటలు పట్టించుకోకుండా, "నిజమే. విషయం చాల దూరం పోయింది.

దీనికి పరిష్కారం కనుక్కోవాల్సిందే" అంటూ అతను లేచి, "అక్కయ్యగారూ, ఓ సారిలా రండి, మీతో మాట్లాడాలి" అని తన తల్లిని పిల్చాడు.

"అమ్మ ఎందుకూ? నాకు సమాధానం చెప్పండి."

"చెప్తాను, ఆమెను కూడా రానీండి."

"అమ్మను కూడా ఆకట్టుకున్నారుగా? ఆమెకు కాదు, నాకు సమాధానం చెప్పండి."

"నువ్వొట్టి మూర్ఖపు మొహానివి! చెప్తే విషయాలు అర్థం చేసుకునే తెలివి తేటలు నీకెక్కడివి. నువ్వు ముందు కూర్చో" అని తన చెయ్యి పట్టుకుని కుర్చీలో కూలేశాడతను.

అదే మొదటిసారి అతను తనను 'నువ్వు' అనటం, అలా సిగ్గులేకుండా చెయ్యి పట్టుకోటం. తనకు ఏడుపొచ్చింది, కంపరం కలిగింది. 'నిరాధారులయిన తనూ, తన తల్లినీ ఇంట్లో ఉండనిచ్చి, తిండి పెడుతున్నాడనేగా అతనంత చొరవ తీసుకున్నది' అన్న భావం తన్ను కట్టి కుదిపేసింది. తన తల్లి వచ్చాక, అతను చెప్పాడు, చాల ప్రశాంతంగా. తను తిట్టానన్న కోపం ఆ మాటల్లో ఏమాత్రం వ్యక్తం కాలేదు. ఆ ఇంటిలోకి వచ్చినప్పటి నుండి తను అతని పట్ల విముఖత ప్రదర్శిస్తూనే ఉంది. మనిషి అంత నిర్వికారంగా ఎలా ఉండగలడో! మనిషైనవాడికి ప్రతిస్పందన ఉండాలి; అదిలేని జడత్వమంటే తన కసహ్యం.

"చూడు అక్కయ్యా! ఇంత జరిగాక, జనం నోళ్ళలో మా పేర్లు నానుతున్నప్పుడు మనమేదో నిర్ణయం తప్పక తీసుకోవల్సిందే. ప్రతి సమస్యకూ పరిష్కారముంటుంది. నేను రెండు సూచనలు చేస్తాను. అందులో మీకూ, విశాలకూ ఇష్టమైనది ఎంచుకోవచ్చు. నాకు విశాల పట్ల- మొదటి నుండీ, ఆమెను చూసినప్పటినుండీ కొంత ఆశ ఉంది. అయితే ఆమె తప్పేం లేదు. ఆమె తనకు నా పట్ల ఉన్న వైమనస్యాన్ని ఎప్పుడూ వ్యక్త పరుస్తూనే ఉంది. నాకు కూతురుంది. ఆమె సంసారం ఆమెకుంది. ఎందుకేర్పడిందో నాకు తెలియదు, ఇతరుల పట్ల నేను స్నేహంగా ఉండటం దానికి ఇష్టం ఉండదు. చదువు చెప్పించ ప్రయత్నించాను. చదువులో అది పెద్దగా శ్రద్ధ చూపలేదు.దాని పెళ్ళి చేయగలిగాను.కానీ పెద్ద సంబంధం తేలేక పోయాను. అయినా పిల్లవాడు తెలివికల వాడవటంతో పెద్ద ఉద్యోగంలోకీ వచ్చాడు, బాగానే సంపాదిస్తున్నాడు; ఈ మధ్యే కారుకూడా కొనుక్కున్నారు. ఇదంతా తన అదృష్టం వల్లే సమకూడిందని దాని అభిప్రాయం. కానీ, నేను పెద్ద సంబంధం తీసుకరాలేక పోయానన్న భావన దాని కెప్పుడూ ఉంది. అది నేను చెరిపేయలేను.ఎవరి మనస్సుల్లో ఎవరి పట్ల ఏ భావన ఏర్పడుతుందో మనం చెప్పలేం. అలాగే విశాల కూడా. నా మంచితనం పట్ల మీకు నమ్మకముంది, మీ కూతురికి లేదు. సరే, ఆమెకు నా పట్ల విముఖత, ద్వేషం, అయిష్టత ఉన్నా, నాకు ఆమె పట్ల ప్రేమ,

ఆసక్తి ఉన్నాయి. కనుక, ఇంత జరిగాక, ఒక మార్గం– జనం అనుకున్నది నిజం చేయటం. ఆమెకీ వయసు మీరి పోయింది. యాభయ్యేళ్ళ పెళ్ళికాని వరుడెవరూ ఈ వయసులో దొరకడు. నాకూ, ఆమెకూ వయసులో తేడా సుమారు పదేళ్ళు. నేనామెను వివాహం చేసుకున్నందువల్ల ఇప్పుడున్న పరిస్థితే కొనసాగుతుంది. మార్పేం ఉండదు. ఇల్లుంది. ఇంట్లో ఉండొచ్చు. ఆమెకు ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం ఉండదు. నేను పోయినా ఆమెకు ఫామిలీ పెన్షను వస్తుంది. డబ్బుకంత ఇబ్బంది ఉండదు. ఈ విషయం మీరు నిర్ణయించండి. విశాల అభిప్రాయం నాకవసరంలేదు. వట్టి మూర్ఖపుది. ఉన్న వాస్తవాన్ని చూడగల సత్తా ఆమెకు లేదు. రెండో మార్గం– మీకిష్టం లేకపోతే మీరు వేరే ఇల్లు తీసుకుని ఉండవచ్చు. అందుకయ్యే ఖర్చు నేనే భరిస్తాను. విశాల ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేదు. 'నువ్వుపరాయివాడివి మా భారం నీకెందుకయ్యా' అని మీరడుగుతారేమో? మీరు నేను పరాయివాడి ననుకుంటున్నారు కానీ, నేననుకోటం లేదు. మా అమ్మాయికీ విషయం స్పష్టంగా చెప్పాను. అందుకే అది వచ్చి యాగీ చేసింది. అందుకు, మా అమ్మాయి తరపున నేను మిమ్మల్ని మన్నించమని అడుగుతున్నాను" అన్నాడతను.

అతనిన్ని మాటలు చెప్పటం, నేను వినటం అదే ప్రథమం. ఇంత చక్కగా అతను మాట్లాడగలడని తనకు తెలియదు. తన్ను 'మూర్ఖపుది' అన్నప్పుడు మాత్రం తనకు మండుకు పోయింది. చివరకు తన రంగు బయటపెట్టేసుకున్నాడు. తామిప్పుడు నిరాధారులమన్న అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకున్నాడు. సిగ్గు లేకుండా అతనే ఒప్పుకున్నాడు. అమ్మ ఏం మాట్లాడలేదు. అతనే అన్నాడు, "ఇప్పుడే సమాధానం చెప్పమని నేను బలవంత పెట్టటంలేదు. మీకు కావల్సిన సమయం మీరు తీసుకోండి. అయితే, నా సాయాన్ని నిరాకరించి పోవద్దని మాత్రం నా అభ్యర్థన. అప్పుడు మీరు నన్నవమానించిన వారవుతారు" అని.

అప్పుడు తనేదో మాట్లాడబోయింది. "నోర్మూసుకో, పద" అని తన తల్లి తన్ను కసిరింది, తన చెయ్యి పట్టుకుని తన్ను పక్కగదిలోకి తీసుకువెళ్తూ.

తను రుసరుసలాడుతూనే ఉంది. మధ్యాహ్నం వంటకి అమ్మ కూరలు తరగమన్నా తరగలేదు. వంటయింది. పన్నెండింటికి కాబోలు, ఏం జరగనట్టే అతనువచ్చి భోంచేసి వెళ్ళాడు. అతను వెళ్ళాక, తనూ, అమ్మా భోజనానికి కూర్చున్నారు. భోజనమయ్యాక ఓ క్షణం నడుం వాల్చింది తను. ఉద్యోగం లేకపోవటంతో ఇదో పాడు అలవాటయింది. పడుకున్నా తన మనసులో ఆందోళన సమసి పోలేదు. అతను సూచించిన రెండు మార్గాల్లో ఏదీ తనకు రుచించలేదు. అతన్ని పెళ్ళి చేసుకోటం అసంభవం, అతనిమీద ఆధారపడి

బతకటం కూడా తనకిష్టం లేదు. తను మరేదయినా ఉద్యోగం చూసుకోవాలి. ఆ చిట్‌ఫండ్ కంపెనీవాడు రెండు నెలల్లో ఉద్యోగం ఇస్తానన్నవాడు మాట తప్పాడు. "ఇప్పుడు ఖాళీలు లేవు. వచ్చినప్పుడు నీకే ఇస్తానన్నాడు." క్రితం సారీ ఇదే మాటన్నాడు. అక్కడ మళ్ళా పనిచేసే అవకాశం దొరుకుతుందని తననుకోలేదు. భవిష్యత్తు అంధకారంలా తోచింది. ఈ పరిస్థితికి అతనే కారణమన్నట్టు అతని మీద కోప కూడా వచ్చింది.

అంతలో అమ్మ వచ్చి తన పక్కలో కూర్చుంటూ, "విశాలా!" అని పిల్చింది. ఆమె కంఠం రుద్ధమైఉంది. ఆమె దు:ఖాన్నిచూసి, తన గుండె తరుక్కు పోయింది. 'ఈ ముసలితనంలో తను ఆమెకేమి సాంత్వన కలిగిస్తోంది. తిండి కూడా పెట్టలేని పరిస్థితి వచ్చింది.' అలా అనుకుంటే తనకూ ఏడుపు వచ్చింది.

"నీకు ఇష్టలేని పని చెయ్యమని నేనెప్పుడూ నిన్ను బలవంత పెట్టలేదు. ఇప్పుడు చెప్తున్నాను. నేనింక ఎంతకాలం బతుకుతానో నాకు తెలియదు. నువ్వతన్ని పెళ్ళి చేసుకో. అది అన్ని విధాలా శ్రేయస్కరం. అతను చాల మంచివాడు. నీకిష్టం లేకపోయినా చేసుకో. నాకోసం చేసుకో. నేనింక అగచాట్లు పడలేను. నీ జీవితం ఏమైపోతుందోనని ఆరాటపడ్తూ నేనింక బతకలేను. నేనింక అలసిపోయాను. నాకింత విశ్రాంతి నివ్వు" అంది.

అమ్మ ఆమాట ఎప్పటినుండో చెప్తోంది. తను పట్టించుకోలేదు, పోట్లాడింది కూడ. కాని, అప్పుడు అమ్మ మాటల్ని తను కాదనలేక పోయింది. తన జీవితం ఎలాగో బుగ్గయింది. ఇప్పుడీ వయసులో మొదటి పెళ్ళివాడు వచ్చినా తను పొందేదేమీలేదు. ముసలివాడిని కట్టుకున్నావని జనం అనుకుని పోతారన్న తన అజ్ఞాతపు అహం తప్ప అతన్ని చేసుకోటంలో తనకి ఏ అడ్డంకి ఉండకూడదు. స్త్రీ పట్ల వాంఛ ఉండటం ఏ పురుషుడికయినా సహజమే. ఇంక అదీ చూస్తుంది తను, కోరికలుడిగిన తననుండి అతనేం పొందగలడో!

"సరే, నీ ఇష్టం" అంది తను, మరేం మాట్లాడలేక.

అమ్మ నిట్టూర్చింది, తలపైనున్న పెద్ద భారం దించుకున్నట్టు. విచిత్రంగా తనకూ సాంత్వన కలిగింది. డబ్బుకు ఎంత మహత్వముంది! అదేకదా తన్ను చివరకు లొంగదీసుకున్నది!

నెల రోజుల్లో తన వివాహమయింది. తన తరఫున రిజిస్ట్రారు ఆఫీసులో సంతకం పెట్టటానికి రామానుజం వచ్చాడు; నిర్మల పెళ్ళయినప్పుడు కేశవమూర్తి కూడ వచ్చాడు. ఆ భార్యా భర్తలు తన ఇంటికి వచ్చినప్పుడు కేశవమూర్తి కూడా స్నేహపూర్వకంగా అతనితో మాట్లాడుతుండేవాడు. "అతను సంస్కారవంతుడయిన మనిషి. మీరతన్ని చేసుకుంటే

మంచిదే" అనీ అతను తన్ను ప్రోత్సాహపరిచాడు. కేశవమూర్తి తరపున సంతకం పెట్టటానికి కామేశ్వరరావు వచ్చాడు.

పెళ్ళయి తిరిగి వచ్చాక ఆ రోజు సాయంత్రమే అతను క్యాంపుకంటూ వెళ్ళిపోయాడు. ఇదివరకటి కంటే ఎక్కువ కాలం అతను క్యాంపులలోనే గడపసాగాడు. పొద్దున వస్తే సాయంత్రం వెళ్ళిపోయేవాడు. తమ పున:స్సంధానం కాలేదని తన తల్లి ఎంతో బాధ పడేది. ఒకసారి ఆ విషయం అతనితో కూడ ప్రస్తావించింది.

"దానికేం తొందరలే, అక్కయ్యా! కాస్తంత వెసులుబాటు చూసుకుని చేసుకోవచ్చు. క్యాంపులకు వెళ్ళకపోతే కుదరదు. బతుకు ఒకడి చేతిలో పెట్టాక, మన సౌఖ్యమంటూ ఇంట్లో కూర్చోటానికి వీలులేదు కదా?" అన్నాడతను.

"ఆ ముచ్చట కూడా తీరిపోతే, నేను ప్రశాంతంగా వుంటాను. వయసు మీద పడిపోతోందా, ఎప్పుడు పోతానో ఎవరికి తెల్సు! ఏమయినా నా భారం తీర్చావు, నాయనా! చచ్చి నీకడుపున పుట్టి ఋణం తీర్చుకుంటాను" అంది తన తల్లి.

"అదేం మాటలే, అక్కయ్యా! డెబ్బయ్యేయిదేళ్ళకే వయసు చెల్లిపోయినట్లు మాట్లాడతావు! నా వయసు కూడ పోసుకుని వందేళ్ళు బతుకుతావు" అన్నాడతను.

అతను నెలల తరబడి క్యాంపులకు వెళ్ళినా తమకే ఇబ్బందీ కలగకుండా చూసేవాడు. అతనెక్కడున్నా కామేశ్వరరావు కిచ్చి ప్రతినెలా నాలుగువేలు పంపించేవాడు.

అమ్మకోసారి అనుమాన మొచ్చి అతన్ని అడిగింది. "ప్రతి నెలా డబ్బు తెచ్చిస్తున్నావు! అతను నీకెక్కడ కలుస్తాడయ్యా?" అని.

"నేను ఎప్పుడూ వాడి దగ్గరే ఉంటాను, అక్కయ్యగారూ! తన సహాయకుడిగా పెట్టుకుని నెలకింతని నాకు జీతమిస్తుంటాడు. గవర్నమెంటువాళ్ళు రూల్స్ అందుకనుమతించలేదు. వాడే తన జీతంలోనుంచి ఇంతని చెప్పి ఇస్తుంటాడు. నా బతుకు ఇబ్బంది లేకుండా గడచి పోతోంది" అన్నాడతను.

ఇంక తన తల్లి ఊర్కోలేదు.

"అదేం? నీకంతకు ముందు ఉద్యోగం లేదూ? నీ పెళ్ళాం బిడ్డలనెలా సాకుతున్నావు?" అనడిగింది.

"అదో పెద్ద కథ లేండి. కేశవమూర్తీ, నేనూ కలసి చదువుకున్నాం. వాడు అనాథ. వారాలు చేసుకుని చదువుకునేవాడు. మాకుటుంబంతో పరిచయమయ్యాక, వాడి తెలివితేటలు చూసి మానాన్న ముచ్చట పడిపోయాడు. ఆ తర్వాత వాడి చదువు పట్ల

శ్రద్ధవహించాడు, ప్రోత్సహించాడు.మా నాన్న పోయేటప్పటికి మేం ఎస్ ఎస్ ఎల్ సి పాసయ్యాం. నాకు చదువుమీద పెద్దగా ఆసక్తి లేదు. సర్వీసు కమీషను పరీక్ష పాసయ్యాక నాకు కమ్మర్షియల్ టాక్సు డిపార్టమెంటులోను, వాడికి రెవెన్యూలోనూ క్లార్క్ ఉద్యోగాలొచ్చాయి. నా చదువు ఎప్పుడూ అంతంత మాత్రమే. నేను చదువు అంతటితో ఆపేశాను. వాడు పైకి చదువుకున్నాడు. ప్రమోషన్లొచ్చాయి. ఆర్‌డివో అయ్యాడు. నేను ఉన్న ఉద్యోగం పోగొట్టుకున్నాను. చివరకు వాడే నాకు గతి అయ్యాడు."

"అదేం, నీకు నౌకరీ ఎందుకు పోయిందీ?"

"నుదిటి రాత నెవరు తప్పించగలరు! లంచం తీసుకుంటూ పట్టుబడ్డాను. కేసు తేలేప్పటికి మూడేళ్ళయింది. రెండేళ్ళు జెయిలు శిక్ష అనుభవించాను. నా పెళ్ళాం ఆ అవమానం భరించలేక ఉరేసుకు చచ్చిపోయింది.మాకు పిల్లలు కలగలేదు.ఈ దౌర్భాగ్యంలో అదో మేలు. లేకపోతే వాళ్ళుదిక్కులేనివాళ్ళయేవాళ్ళు."

"అదేం మాట! నీ స్నేహితుడుండగా వాళ్ళు మాత్రం దిక్కులేని వాళ్ళెలా అవుతారు?!"

"ఆ మాట నిజమే లేండి. వాడు ఆపద్బాంధవుడు. తన చేతిలో ఉన్న సాయం ఎవరికీ చేయకుండా వదలడు. ఆ విషయంలో ఎవరి మాటా లెక్క చేయడు.వాడి కూతురు భానుమతి తన సొమ్మేదో నేను తిని పోతున్నానని నా మీ్మద కోపం పెంచుకుంది..."

"అది నిజమేలే. తనకు చెందాల్సిన సొమ్ము మరొకడు అన్యాయంగా తింటూంటే ఎంత మంచివాళ్ళకయినా కడుపు రగిలి పోతుంది కదా? నెలకెంత ఇస్తుంటాడేం?"

"ఆ మాటనకండి.వాడు నా ప్రాణస్నేహితుడు. నేను వాడికి చెరుపుచేస్తానా? జన్మలో జరగదా పని!"అని మనసు కేదో కష్టమనిపించగా మారుమాట్లాడకుండా వెళ్ళిపో బోయాడతను.

"నెలకెంత ఇస్తాడని అడిగితే జవాబు చెప్పకుండా పోతావ్?"

"మూడువేలిస్తాడు" అని వెనుదిరిగి జవాబిచ్చి అతను వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయాక తన తల్లి అంది, "చూశావుటే అమ్మాయి! మనకి నాలుగు వేలు. పరాయివాడు వీడికి మూడు వేలు! అమ్మోవ్! వీడు కొంప గుండం చేస్తున్నాడు. వీడికి త్వరలో ఉద్వాసన పల్కవల్సిందే."

తనలా భావించలేదు. అతని డబ్బు ఎవరు తిన్నా తనకొకటే. అతనికిష్టమొచ్చిన వాళ్ళకు పెట్టుకుంటాడు. అయితే, అమ్మ మాటలతో మనుషులు తేలిగ్గా మారిపోగలరని తనకప్పుడే అర్థమయింది. తమ పరిస్థితులు దీనంగా ఉన్నప్పుడు ఆమె వ్యక్త పరిచిన

సహృదయత ఇప్పుడు పూర్తిగా మృగ్యమయింది, స్వార్థం పురివిప్పుకుంది. తనకా క్షణంలో ఆమెను చూసి కంపరం కలిగింది. పెళ్ళయితే అయింది కానీ, తాము మానసికంగా, శారీరికంగా దగ్గరకు వచ్చింది లేదు. ఎప్పటి లాగానే తాము ఇద్దరూ తాముండే ఆ రెండు గదుల్లోనే ఉండేవారు. తనకతని మీద ఉన్న అయిష్టత పోలేదు.

"ఇప్పుడింక విడిగా ఎందుకూ, మధ్య తలుపు తెరిచి ఆ భాగం కూడ మనం వాడుకోవచ్చు. మూసి పెట్టి ఉంచటమెందుకూ?" అంది అమ్మ.

"అక్కర్లేదు, ఆయన వచ్చినప్పుడు చూసుకోవచ్చులే" అంది తను.

అతనప్పుడు క్యాంపుకెళ్ళి ఉన్నాడు. అమ్మకు గుండె పోటు వచ్చింది. తనే ఆమెను డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళింది. పరీక్షలయాక, ఆయన మందులు రాసిచ్చాడు.

"మందులు జాగ్రత్తగా వాడండి. ఏంజియోగ్రాం చేస్తేనే కానీ మనకు స్పష్టంగా తెలియదు. దానికీ ఆమె తట్టుకుంటుందో లేదో అనుమానమే. మీ వాళ్లెవర్నయినా రమ్మనండి. వాళ్ళతో మాట్లాడి ఏం చేద్దామో ఆలోచిద్దాం" అన్నాడాయన.

అమ్మ అతనికి ఉత్తరం రాయమని శతపోరింది. తనకిష్టం లేదు. అందుకే తప్పని పరిస్థితిలో అన్నయ్యకు జాబు రాసింది. వాడి దగ్గరి నుండి తిరుగు టపాలో జవాబొచ్చింది. నిష్ఠూరాలేస్తూ రాశాడు. పెళ్ళికి పిలవలేదన్నాడు.

"శుభ కార్యాలకు నేను గుర్తుండను. చాకిరి చెయ్యాలన్నా, డబ్బు అవసర పడినా అప్పుడు అన్నయ్య అనే వెధవ ఒకడు ఉన్నాడని నీకు గుర్తుకు వస్తుంది. ఒకటి మాత్రం నిజం. డబ్బు లేని వాడినని మీకు నిర్లక్ష్యం లే!" అంటూ, చివరగా, "నాకు ప్రస్తుతం అక్కడికి రావటం వీలుకాదు. ఈ వయసులో అమ్మ ఆపరేషనుకు తట్టుకోలేదు. ఏమయినా డాక్టరు సలహా మేరకు ఆమెకు మంచి చికిత్స చేయించవల్సింది.నా డబ్బుకోసం నువ్వు ఎదురు చూడకూడదు. నీ మొగుడు గెజిటెడ్ ఆఫీసరని విన్నాను. ఆ మధ్య అమ్మ ఉత్తరం రాస్తే తెలిసింది. లంచాలు, అవీ బాగానే మరిగి ఉంటాడు. కనుక నేను డబ్బు పంపలేదని అనుకోవద్దు. పంపాలన్నా నా దగ్గరలేదు" అని రాశాడు.

మనుషులింత కర్కశంగా ఎలా ఉండగలరో తనకర్థం కాదు!

ఆ మాటే తన తల్లితో అంటే, "నువ్వు మాత్రం తక్కువ తిన్నావా? నేను అల్లుడికి ఉత్తరం రాయమంటే, నువ్వు వాడికి రాశావు. వాడిదగ్గర డబ్బెక్కడిది? మనకి తెలియని విషయమా? ఎక్కడో పాటియాలో నంట, దూరాభారంలో వుంటున్నాడు, సన్నాసి! చూడవద్దా మన్నా ఆ ఖర్చు భరించి రావటంవాడి వల్ల కాని పని. వాడికి మాత్రం మన్ని చూడాలని ఉండదా యేం? వెసులుబాటు కావద్దూ?" అందిఆమె.

"తల్లి పట్ల వాడికి బాధ్యత లేదటే? డబ్బు లేదంటే సరిపోతుందా? ఆయనకు మాత్రం డబ్బు బ్యాంకులో మూలుగుతోందా?" అంది తను.

"అంతంత మాత్రం చూసే మొగుడంటేనే మిడిసిపడి ఛస్తున్నావు! సంసారం సంబడంగా ఉంటే ఇంక నా ముఖమే చూడవు" అంది ఆమె, ముఖం తిప్పుకుంటూ.

"మరి నీ కూతుర్నేగా? నువ్వు మాత్రం తక్కువేం చేస్తున్నావు! నీ ముఖం చూడని కొడుకంటే పడి ఛస్తున్నావు! వాడు ప్రేమగా చూసే కొడుకయితే ఇంక మేం కన్పించే వాళ్ళమా నీకు!" అంది తను.

"ముయ్యవే నోరు! మాటకు మాట చెప్పటం నీకలవాటయింది. ఇలా ఎదురు జవాబులు చెప్తూ సంసారం చెడగొట్టుకోకు."

"అసలు నువ్వు ఆయన గెజెటెడ్ ఆఫీసరని వాడికెందుకు రాశావు?"

"తప్పేం, నేనేం అబద్ధం రాయలేదే?"

"మరి వాడేం ఊహిస్తున్నాడో చూడు. ఆయన లంచాలు పుచ్చుకుంటున్నార్ట!"

"అందులో తప్పేం ఉందే! తీసుకోక పోవటమే తప్పు. అందరిదీ ఒక దారయితే ఉలిపికట్టది మరో దారని ఊరికే అనలేదు."

తనకింక ఆమెతో మాట్లాడాలనిపించ లేదు.

## 5

తనతనికి ఉత్తరం రాసింది. రాయక తప్పలేదు, అతను పంపిన డబ్బు అయిపోయింది. అమ్మకు మందులు, పరీక్షల ఖర్చు పెట్టుకోటంతో, అంతకు ముందు చేతిలో ఉన్న డబ్బుకూడ ఖర్చయి పోయింది. అతనిచ్చిన అడ్రసు రాయవెల్లూరుది. తను ఆ ఊరు ఆంధ్రప్రదేశ్ లోనే ఉందనుకుంది. తను ఉత్తరం రాసినా అతను రాలేదు. కనీసం కామేశ్వరరావును కూడ పంపలేదు. ఇరవై వేలకు డిడి పంపాడు.

"నేను ప్రస్తుతం రాలేని పరిస్థితిలో ఉన్నాను. మీరే ఆమెను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించవలసింది. ఆపరేషనుకు, మిగతా ఖర్చులకూ ఎంత ఖర్చవుతుందో సుమారుగా రాస్తే పంపుతాను. అమ్మ ఆరోగ్యం అశ్రద్ధ చేయవద్దు. ఆమెకు నా నమస్కారాలు తెలుపగలరు" అని రాశాడు.

తనకు ఒళ్ళు మండుకుపోయింది. 'అంత రాలేని పరిస్థితి ఏమిటో? తనక్కావల్సింది ఆమె ద్వారా సాధించుకున్నాడు. ఇంక ఆమె ఉంటేనేం, పోతేనేం' అని కోపగించింది తను.

అయితే, రెండ్రోజుల తర్వాత కామేశ్వరరావు కొంపలో ప్రత్యక్షమయాడు.

"కేశవమూర్తి నన్ను పంపాడు. అమ్మగారికి ఒంట్లో బాగుండలేదటగా? ఉస్మానియాలో మంచి డాక్టరున్నాడు. రేపు తీసుకువెళ్ళి చూపిద్దాం" అన్నాడతను.

కామేశ్వరరావు సాయం తీసుకోటం తనకిష్టంలేదు, అతడు కేశవమూర్తి, పనుపున వచ్చినవాడు కనుక. తప్పలేదు. తనూ, కామేశ్వరరావూ అమ్మను తీసుకెళ్ళి ఉస్మానియా ఆసుపత్రిలో చూపించారు. ఏంజియోగ్రాం చేస్తే గానీ స్పష్టంగా తెలియదన్నాడు డాక్టరు. మర్నాడు చేద్దాం తీసుకురమ్మని చెప్పాడు. ప్రభుత్వాసుపత్రి కనుక ఎక్కువ ఖర్చు కాదని కూడ చెప్పాడు కామేశ్వరరావు. తనకది సాంత్వన కలిగించే విషయం. తన కేమీ కాని ఆ మనిషి డబ్బు తనవాళ్ళకింద ఖర్చుపెట్టటం తనకిష్టంలేదు. తప్పదు కనుక అవసరమైనంత మేరకు తీసుకుంటుంది. ఆ మర్నాడు అమ్మను ఆసుపత్రికయితే తీసుకెళ్ళింది కాని తిరిగి తీసుక రాలేకపోయింది.ఏంజియోగ్రాం చేస్తున్న టేబుల్ మీదే ఆమె అంతిమ శ్వాస విడచింది. డాక్టరు ఏవో సాంత్వన వచనాలు చెప్పాడు, మళ్ళీ మాసివ్ హార్ట్ అటాక్ వచ్చిందట! ఓపెన్ హార్ట్ సర్జరీకీ నిలచే పరిస్థితి కాదన్నాడు.

అన్నయ్యకీ, అతనికీ కామేశ్వరరావు చేతే టెలిగ్రాములు ఇప్పించింది. టెలిగ్రామిచ్చినా అతను రాలేదు. మర్నాడు సాయంత్రానికి గానీ అన్నయ్య రావటం పడలేదు. దూరాభారం, ఆపైన డబ్బు ఇబ్బంది. వెంట డబ్బేం తీసుకరాలేక పోయాడు. కేశవమూర్తి పంపిన డబ్బులో ఎక్కువ ఖర్చు కాలేదు కనుక అది పెట్టి తను దినవారాలు గడపి వేయగలిగింది. అమ్మపోయిన పదమూడోరోజున అన్నయ్య వెళ్ళిపోయాడు. తనను మాట వరసకుకూడ తన ఇంటికి రమ్మనలేదు.

అపైన, "నీ మొగుడికెంత బిజీనే. అత్త చచ్చినా తీరికలేని ఉద్యోగం. డబ్బు సంపాదన మరి! దాని ముందు పెళ్ళాం తల్లి చావు లెక్కలోనిదాయేం? మంచి గట్టి మనిషి!" అన్నాడు.

తనకూ కష్టమేసింది. అయితే ఆ మాటలు అన్న మనస్తత్వాన్నీ ఎత్తి చూపాయి. తన పట్లా, తల్లి పట్లా ఏ మాత్రం కనికరం చూపని మనిషి అతడు!

అందుకే తన బాధను అణి చేసుకుంటూ, "అవును, బావమరది తల్లి చనిపోయినా ఆ ఖర్చంతా భరించాల్సింది ఆయనేకదా? మరి సంపాదించకపోతే ఎట్లా?" అంది తను.

"మొగుడిమీద ఈగ వాలనివ్వవే నువ్వు! వయసుమీరి చేసుకున్నా మీది అన్యోన్య దాపత్యం! నాకు కావల్సిందదే! ఆ చరిత్ర పురుషుడిని చూసే అవకాశమే పడలేదు. సర్లే, నీ మొగుడి మీద జోక్ చేసినా నీకు కోపమొస్తుంది.మళ్ళా తీరిక చేసుకుని

బావగారున్నప్పుడు వస్తా" అన్నాడు వాడు.

అందులో ఈసు ద్యోతకమవుతూనే ఉంది. ఇదివరకటిలో తనంటే డబ్బు లేనిది కనుక తనంటే నిర్లక్ష్యం, బంధం పెంచుకుంటే ఏం తగలాటం పెట్టుకో వలసి వస్తుందో నని భయం. ఇప్పుడు అతను గెజిటెడ్ ఆఫీసరు కనుక, అతడు బాగా లంచాలు పుచ్చుకుని ఉంటాడు కనుక తనంటే ఈర్ష్య కలిగింది.మనుషులు పచ్చగా ఉంటే అయినవాళ్ళు కూడ సహించలేరు.

ఆ తర్వాత రెండు రోజులకు కాబోలు కేశవమూర్తి నుండి ఉత్తరం వచ్చింది. అమ్మ పోయినందుకు విచారం వెలిబుచ్చాడు. వీలయినంత త్వరలో వస్తానని రాశాడు. 'ఎప్పుడైనా రానీ. తనకతని అవసరం లేదు. తను ఆపదలో ఉన్నప్పుడు రాని మనిషి ఎప్పుడు వస్తేనేం?' అనుకున్నది తను.

ఆ తర్వాత నెలరోజుల కొచ్చాడతను.మనిషి సన్నబడ్డాడు. పాలిపోయినట్టున్నాడు. అసలే మనిషి వికార రూపుడు. ఆ పాలిపోయిన ముఖంతో మరింత వికారంగా, దయ్యంలా కన్పించాడు.

వస్తూనే, "బాగున్నావా?" అని నవ్వుతూ పలకరించాడు.

అతనితో మాట్లాడ బుద్ధికాలేదు తనకు. తలూపింది, బాగానే ఉన్నట్టు.

అతను తనకు అమ్మ పోయినందుకు పలకరింపు మాటలు చెప్పబోయాడు కానీ తను పట్టించుకోకుండా లోపలికి వెళ్ళిపోయింది.

తన పోర్షను తాళం తీసుకుని లోపలకు వెళ్ళాడతను. పనిమనిషిని పిలచి ఇల్లు శుభ్రం చేయించుకున్నాడు.

"ఊళ్ళో లేకపోతే మాత్రం తాళం వేసుకోటమెందుకయ్యా? అమ్మున్నది కదా ఇంట్లో" అంది ఆమె.

"నిజమేలే. నేను లేనప్పుడు నీకనవసరపు చాకిరీ ఎందుకని తాళం వేసి వెళ్ళాను" అన్నాడతను.

ఆ సంభాషణ తనకు వినపడుతూనే ఉంది. కానీ తనేం పట్టించుకోలేదు. పది గంటలకల్లా ఆఫీసుకు వెళ్ళి పోయాడు. తనకోసం వంట చేయమని అతను అడగనూలేదు. తను చేయనూ లేదు. మళ్ళా సాయంత్రం ఎక్కడెక్కడో తిరిగి రాత్రి పది గంటలకు కొంపకు చేరాడు. తను పక్కమీద పడుకుని నిద్రపట్టక సతమత మవుతూనే ఉంది. అతను రావటం, తాళం తీసి తలుపు తెరవటం- అన్నీ తనకు విన్పిస్తూనే ఉన్నాయి. అన్నం తిని వచ్చాడో, వండుకుంటాడో తనకు తెలియదు. తను నిద్ర లోకి జారిపోయింది. అవసరమయితే

అతనే మాట్లాడతాడనుకుంది తను.

తనంతకు ముందు పనిచేసిన చిట్‌ఫండ్ కంపెనీ మానేజరు ఉత్తరం రాశాడు: "ప్రస్తుతం ఓ పోస్టు ఖాళీగా ఉంది. మీరు వచ్చి చేరాలనుకుంటే వచ్చే సోమవారంనుండి రండి" అని.

ఇప్పుడింక అతనితో తనకవసరం లేదు. తన మానాన తను బతగ్గలదు.

ఆ మరుసటి రోజు ఆదివారం. అతను తన పోర్షను గది బయటే నిలబడి, "విశాలా!" అని పిల్చాడు. తరుగుతున్న కూరనలా వదిలేసి, తను తన పోర్షను గుమ్మం దగ్గరకు వచ్చింది, ఏమిటన్నట్టు ప్రశ్నార్థకంగా అతని వంక చూస్తూ.

"మీరేమనుకోకపోతే ఒకమాట. ఇలా మనం రెండు పోర్షనులలో నివసిస్తున్నామంటే, జనం రకరకాలుగా అనుకుంటారు. మన పోర్షనుల మధ్య తలుపులు తెరచి ఉంచితేనే మంచిదని నా అభిప్రాయం. అందువల్ల మీ స్వేచ్ఛకూ, స్వాతంత్ర్యానికీ ఏం భంగం కలుగదు" అన్నాడతను.

'అంటే ఇంక తన్ను పెళ్ళాంగా ఉండమంటున్నాడన్న మాట!' అని తను అతని మాటను అనువదించుకున్నది.

"మీకవసరమయితే అలాగే తీస్తాను. నాకయితే అలాంటి అవసరం లేదు" అంది తను తన నిశ్చయాన్ని అన్యాపదేశంగా అతనికి సూచిస్తూ.

"నాకవసరమే, తీయండి. మీరు బయటికి వెళ్ళేప్పుడు మీ తలుపు తాళం మీరు వేసుకు వెళ్ళండి. నేనూ నా తలుపు వేసుకుంటాను" అని చెప్పి తన పోర్షనులోకి వెళ్ళిపోయాడతను.

తన వాటాలోనే మధ్య తలుపుల గడియ ఉండటం వల్ల తను వెళ్ళి తలుపు తెరిచింది. అతను పడక కుర్చీలో పడుకుని పేపరు చదువుకుంటున్నాడు.

"నేను రేపటి నుండి ఉద్యోగంలో చేరుతున్నాను" అంది తను ఎవర్నీ ఉద్దేశించినట్లు కాకుండా.

'ఎక్కడ?' అని అతను అడగలేదు. "అంత అవసరమా?" అని మాత్రం అడిగాడు.

"అవసరమే. ఎవరి బతుకు వాళ్ళు బతకాలిగా? ఇతరులకు భారమై ఎంత కాలం బతగ్గలను" అంది తను.

అతను మాట్లాడలేదు. కనీసం తన కోసం వంట చేయమని అడుగుతాడేమో ననుకుంది తను. అతనాప్రస్తావనే చెయ్యలేదు. వంట ప్రయత్నమూ చెయ్యటం లేదు.

తనే 'అన్నం వండుతా' అని అనాలనుకుందికానీ, ఆ మాట అనలేక పోయింది. పదకొండు గంటలకు అతను బట్టలేసుకుని బయటకెళ్ళి పోయాడు. మళ్ళీ రాత్రి పది గంటలకింటి కొచ్చాడు. గుడ్డలు మార్చుకుని లుంగీ కట్టుకున్నాడు. తను మంచం మీద పడుకునే ఉంది. అతను చేసే పనులన్నీ గమనిస్తూనే ఉంది. తన పోర్షను లోకి వచ్చాడు. తన మంచం దగ్గరగా వచ్చాడు. 'ఇంక మీద పడతాడు పాపిష్ఠివాడు. అతన్నెలా వదిలించుకోవాలి?' అన్న ఆలోచనలో ఉంది తను. అతను వంటగది లోకివెళ్ళాడు. బయటకొస్తుంటే, తనప్పుడే నిద్ర లేచినట్టు మంచం మీద లేచి కూర్చుంది.

తడబడుతూ అన్నాడతను, "నా గదిలో మంచినీళ్ళు లేవు. దాహమయితే...." అని దొంగకు తేలు కుట్టినట్టు సంజాయిషీ ఇచ్చుకుంటూ, తన పోర్షనులోకి వెళ్ళిపోయాడు. తనకింక ఆ రాత్రి నిద్ర పట్టలేదు. నిండా దుప్పటి కప్పుకుని పడుకుంది. అయితే, అతను భయపడి పోయి నట్టున్నాడు. మళ్ళా తన గదిలోకి రాలేదు. తనూ అతనికా అవసరం కలగనివ్వలేదు. మంచినీళ్ళు, మిగతా అతని కవసర పడే వస్తువులు అతని గదిలో ఉంచేసేది.తను భయపడినట్లు అతనేం ప్రవర్తించలేదు.

ఆ తర్వాతి ఫస్టుకు అతను మామూలుగా ఇంటి ఖర్చులకుగాను అమ్మకు ఇచ్చినట్లే తనకూ నాలుగు వేలు ఇవ్వబోయాడు. అయితే, తనా డబ్బు పుచ్చుకోలేదు.

"డబ్బు అవసరమేముంది?నాకు జీతమొస్తున్నదికదా?మీ భోజనం మీరెక్కడ చేస్తున్నారో మరి!" అంది.

తన మాటలు అతను అపార్థం చేసుకున్నాడు.

"మీరు కూడ ఉద్యోగం చేస్తున్నారు కదా! మీకు ఇబ్బంది కల్గించటమెందుకని బయట చేస్తున్నాను. నా కెప్పటినుండో బయట తినటం అలవాటే. దానికి మీరేం బాధ పడకండి. అప్పుడూ అక్కయ్య మాట కాదనలేక పోయాను" అన్నాడతను.

"వంట చెయ్యటం నాకేం కష్టం లేదు. సరే, మీ ఇష్టం, నేనేం బలవంతం చేయను" అంది తను, ఆపైన, "మర్చాను. అమ్మ పోయింది కనుక మనం ఎప్పటిలా ఏం జరగనట్టు ప్రవర్తిస్తే బాగుంటుందేమో? ఇంటి అద్దె కింద ఈ ఐదొందలూ తీసుకోండి" అంటూ, తను ఐదొందల నోటు అతని వైపు చాచింది.

అతడు దిగ్భ్రమ పడినట్లు తన వంక చూశాడు.

"మీరు నిఖార్సయిన బంగారం. పుటం పెట్టినా మీరు మారరు. సంతోషం, మీరెలా ఉండాలనుకుంటే అలా ఉండండి. కనీసం ప్రపంచానికయినా మనం కలసి కాపురం చేస్తున్నట్టు కన్పించే ప్రయత్నం చేయగలిగితే నేను సదా కృతజ్ఞడై ఉంటాను.అంతకంటే

నేను మిమ్మల్ని కోరేదేం లేదు" అంటూ అతనా నోటు పుచ్చుకున్నాడు.

ఆ తర్వాత, అసలు తను ఆ ఇంట్లో ఉన్నట్టే అతను ప్రవర్తించ లేదు. అతని ప్రవర్తన తనకర్థం కాకుండా పోయింది. అమ్మ బతికున్నప్పుడు తనతో కవ్వింపుగా మాట్లాడేవాడు. తనమీద కాంక్ష కన్పరిచేవాడు. తన్నుపెళ్ళిచేసుకోటమే తన ధ్యేయమన్నట్టు ప్రవర్తించేవాడు. ఇప్పుడు తను అతనికి బతికి లేదు. ఒకోసారి ఇంట్లోనే వండుకుని తినేవాడు, ఒకోసారి బయట తిని వచ్చేవాడు. తన్ను దేనికీ అర్థించేవాడు కాదు. తన కన్పించింది-ముసలితనం వస్తున్నకొద్దీ అతనిలో వాంఛ చచ్చిపోయినట్లుంది. అందుకే తను పట్టనట్టున్నాడు- అని. తనకూ ఉద్యోగంలోకి చేరాక తీరిక లేక పోయింది. అతని సంగతి పట్టించుకోటం మానేసింది.

ఎప్పుడయినా తమ ఇంటికి భోజనానికి పిల్చేవారు నిర్మలా, ఆమె భర్త రామానుజం. పిల్లల కాలక్షేపంతో కాలమే తెలిసినట్లుండేది కాదు. అలాంటి సందర్భం కోసం మనసు ఉవ్విళ్ళూరేది. రొటీన్ లైఫ్ తో తనకు విసుగొచ్చేసింది. ఎవరితోనయినా నాలుగు రోజులు గడపాలనిపించేది. ఒకోసారి కేశవమూర్తి అంటే విపరీతమయిన కోపం వచ్చేది. అతను ఇంట్లో ఉన్నా ఉన్నట్లే ఉండదు. ఈ ఇంటి కంటే అడవి నయమనిపించేది. అమ్మ ఉన్నప్పుడు ఇంత ఒంటరితన మనిపించేదికాదు. పారిపోయి ఎక్కడయినా నాలుగు రోజులు హాయిగా గడిపి రావాలనిపించేది. అలా సరదాగా గడపగలిగే సందర్భం అనుకోకుండా లభించే అవకాశం వచ్చింది.

తన అన్న ఉత్తరం రాశాడు, "మేం వారం రోజులపాటు, మీతో గడపాలని వస్తున్నాం. పిల్లలు కూడ అత్తను చూడ ఉరుకులువేస్తున్నారు. ఎల్లుండి ఉదయం ఏడింటికల్లా మీ ఇంట్లో ఉంటాం. బావగార్ని స్టేషనుకు పంపాల్సిన పనిలేదు. నేను రాగలను. బావగారికి నా నమస్కారములు చెప్పవలెను. ఆయన్ని మొదటిసారి కలియటం! నాకెంతో ఉత్సాహంగా ఉంది" అని.

ఆ ఉత్తరం అందుకున్న తనకు ఆనందమేసింది, కానీ మరుక్షణంలోనే నిరుత్సాహం కమ్ముకుంది. ఇప్పుడు రావద్దని రాయటానికి కూడ సమయంలేదు. సమీపం నుండి చూసేవాళ్ళకు తమ బతుకుల్లోని శూన్యం అవగతమవుతుంది. అది వాళ్ళకు తెలియకుండా గడపాలి. అందుకు కేశవమూర్తి సాయ మవసరం. అసలు ఈ విషయం అతనితో ఎలా కదపాలి? ఆ ప్రశ్న తనను అతలాకుతలం చేసింది. తప్పదు కనక, ఆరోజు అతనికి 'మా అన్నయ్య రాశా'డంటూ ఉత్తరమిచ్చింది.

"నాకెందుకూ ఉత్తరం?" అన్నాడతను.

"వాడు వదిన, పిల్లలతో ఓ వారం శలవులు గడప ఇక్కడికి వస్తున్నాడట!" అని

చెప్పింది తను.

"రానీండి. మీకు కూడ రొటీన్ నుండి తెప్పరిల్లినట్లు ఉంటుంది."

"మా అన్న ఆవులిస్తే పేగులు లెక్కపెట్టగలడు. మనమెలా జీవిస్తున్నామో వాడికి తెలియటం నాకిష్టంలేదు."

"మంచిదే. మన బతుకు మనది. మనమెట్లా బతుకుతున్నామో ఇతరులకు తెలియాల్సిన అవసరం లేదు. నేను క్యాంపు వంక పెట్టుకుని ఓ వారం రోజుల పాటు ఎక్కడయినా తిరిగి వచ్చేదా?"

"మీరిది వరకు వెళ్ళిన క్యాంపులన్నీ ఇలా వంకతో సాగించినవేనా?"

"అలాంటి అవసరం పడలేదు. మీరేం చెయ్యమంటే అది చేస్తాను."

ఆ మాటతో తనకు తిక్కరేగి పోయింది.

"నేనేం చెయ్యమంటే అది చేస్తారా? చెయ్యాల్సినవన్నీ అయిపోయాయా? ఈ బంధం నన్నడిగి కలిపారా?..."

"మీరు పొరపాటు పడుతున్నారు..."

తనతన్ని మాట్లాడనివ్వలేదు. తనకు చిర్రెత్తుకొచ్చినట్లయింది.

"ముందా 'మీరు' మానెయ్యండి. విన్నాడంటే మన సంబంధాలు ఏ పాటి మందంలో ఉన్నయ్యో వాడి కర్థమవుతుంది" అంది కసురుకుంటూ.

అతనేం మాట్లాడలేదు.

"ఇవాల్టి నుండి మీరు ఇంట్లోనే భోజనం చెయ్యండి. ముభావంగా ఉంటే బాగుండదు. ఏం కావల్సి వచ్చినా నన్ను నిస్సంకోచంగా అడగండి. నేను ఇంతకు ముందు మీతో పరుషంగా ప్రవర్తించానని, అది మనసులో పెట్టుకుని నన్ను సాధించ ప్రయత్నించకండి."

"ఆ ఆలోచన నా మనసులోకి కూడ రాదు. మీరేం భయపడకండి."

"ఆ 'మీరు' మానెయ్యమని చెప్పానా?"

"తర్వాత మీరు విచారించవల్సి వస్తుంది..."

"అలాంటి అవసరం పడితే తీరుబాటుగా విచారిస్తాను. వాడి ముందు నా పరువు పోకూడదు."

"నేను ఓ సారి మీకు చెప్పాను, విశాలా, మన బతుకు మనం బతకాలనీ, పరువు

పోతుందని చెప్పి మన ఇష్టానికి వ్యతిరేకంగా బతకకూడదని..."

"మీరేం చెప్పవద్దు, నా ఇష్టానికి అనుగుణంగా నన్ను బతకనివ్వండి."

"మీ ఇష్టం."

"నాకో అయిదువేలు కావాలి. సరకులు తేవాలి. కొంప నిప్పచ్చరంగా ఉంది.తీరిగ్గా మీ బాకీ తీరుస్తాను"

"సాయంత్రం ఇస్తాను."

అయితే, బాకీ తీర్చాల్సిన పని లేదని మాత్రం అతడు అనలేదు. అన్నట్టుగానే సాయంత్రానికల్లా బ్యాంకునుండి డబ్బు తెచ్చి ఇచ్చాడు. ఆఫీసునుండి తిరిగి వచ్చాక అలసట అన్పించినా, ఎక్కువ సమయంలేదు కనుక తను అదివరకే తయారు చేసుకున్న లిస్టు ప్రకారం సరకులు తెచ్చుకుంది. సరుకులు తెచ్చుకుని అవన్నీ సర్దుకునేటప్పటికి రాత్రి ఎనిమిది గంటలయ్యింది. ఇంక లేచి వంట చేయాలనుకుంటున్నప్పుడు, అతను హోటలు నుండి కారీరు పట్టించుకు వచ్చాడు.

"మీరు అలసిపోయి ఉంటారని కారీరు పట్టుకొచ్చాను...." అన్నాడతను, సంజాయిషీ ఇస్తున్నట్టుగా.

పైకనలేదు కానీ అందుకు అతనికి మనసులోనే ధన్యవాదాలు తెల్పుకుంది తను. భోజనమై, పక్కమీద నడుం వాల్చాక, తనా రోజును సమీక్షించుకుంది. తన ప్రవర్తనలోని మార్పు తనకేస్పష్టంగా కళ్ళకు కట్టినట్టు కన్పించింది.తలచుకుంటే తనకే సిగ్గువేసింది. తనచ్చంగా అతని భార్యలా ప్రవర్తించింది. తను కాస్తంత సౌమనస్యంతో ప్రవర్తించినట్లయితే, తమ మధ్య ఇంత శైత్యం ఉండేది కాదుగదా? అతని ముఖం ఎప్పటిలా వికారంగానే ఉంది. కానీ, దాన్లో తనకేదో అందం కన్పించింది. యవ్వనం గడప దాటుతున్న తనలో ఏం చూసి తననతడు వాంఛించాడో తన కర్థం కాలేదు. తన వైముఖ్యాన్ని అర్థం చేసుకుని తన నుండి దూరంగా ఉండ ప్రయత్నించిన అతన్ని తను మెచ్చుకోకుండా ఉండలేక పోయింది. అతను చాల అందమైన మనిషి. అలా అనుకోగానే తన ఒళ్ళెందుకో పులకరించి పోయింది. పక్కమీద నుండి లేచి అతనేం చేస్తున్నాడో నని అతని గదిలోకి తొంగి చూసింది తను.

అతను ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. అతను మంచం మీద పడుకోడు. వట్టి నేల మీద చాప కూడ పరుచుకోకుండా పడుకుంటాడు. దిండుకూడ అవసరం లేదు. చెయ్యిమడిచి పెట్టుకుని పడుకుంటాడు. అతని అవసరాలు కొద్ది. అనవసరంగా డబ్బు

ఖర్చు చేయడు. అవసర పడినప్పుడు డబ్బుకు లెక్క చేయడు. తనకు జబ్బు చేసినప్పుడు తను గమనించింది. డబ్బుకు దాస్యం చేసే మనిషి కాదతను. డెప్యూటీ కలెక్టరు హోదా ఉన్న మనిషి ప్రభుత్వం ఇచ్చిన కారును తన స్వంతానికెప్పుడూ వాడుకోడు. పైస పై సంపాదన లేని మనిషి కనుకే కూతుర్నుండి కొనుక్కున్న పాత ఇంట్లో ఉంటున్నాడు. అది తల దాచుకోటానికి పనికి వచ్చే కొంపేకానీ, సుఖంగా బతకటానికి అనువైనది కాదు. అతనెవ్వరికీ ఋణపడని మనిషి. తన కష్టాలు తనవి. వాటిల్లో ఇతర్లెవరికీ ప్రవేశంలేదు. ఇతర్లు అవమానించినా వాళ్ళ కొద్ది తనపు మనస్తత్వం పట్ల నవ్వు కుంటాడు తప్ప, తిరిగి అవమానించాలనుకోడు. తన్ను బలవంత పెడితే తప్ప ఇతరులకు అప్రియమైనవాటి విషయంలో నోరు విప్పడు.

తనకతన్ని గురించి తెలియనిదేం లేదు. అయినా, ఇతర్ల ఎదుట తనతని భార్యగా ప్రవర్తించలేదు. అతను- అవకాశం దొరికి నప్పుడు- తన భార్యని, తనను చెడిపేస్తాడేమోనన్న భయం కలిగేది తనకు. ఇప్పుడతన్ని కౌగలించుకుని అతనిలో లయించుకు పోవాలన్న కోరిక తనలో బలవత్తరమైంది. రెండడుగులు అతనివైపు వేసింది కానీ అతడు వెల్లకిలా తిరగటంతోనే, అతని ముఖం ఆ చిరు కాంతిలో వికృతంగా కనిపించగానే, తన వీపు నెవరో చరిచి నట్లయి వెనక్కు మరలింది తను. మరో కోణంలో మరెంత అందమున్నా, కంటికి ఆ సౌందర్యం కన్పించకపోతే తను భరించలేదు. రాత్రి ఎప్పుడో నిద్ర పట్టింది తనకు. పొద్దున లేచాక, క్రితం రోజు తన ప్రవర్తన పట్ల తనకు సిగ్గు వేసింది. వెళ్ళి అతనికి 'సారీ' చెప్పాలనుకుని కూడ మానుకుంది.

ఆ మర్నాడు అన్న, వదిన, పిల్లలు వచ్చారు. అతను వాళ్ళని చాల సాదరంగా ఆహ్వానించాడు. ఆ రోజు ఆదివారం. ఎన్నో రోజులకు మళ్ళా ఇల్లు కలకలలాడింది. ఎప్పుడో తన తండ్రి బతికున్నప్పుడు తమ ఇల్లుఅలా ఉండేదని తనకు గుర్తు. ప్రయాణం బడలికతో ఆరోజు అన్నావాళ్ళెక్కడికీ కదలలేదు. తను మర్నాడు శలవుపెట్టాలని నిశ్చయించుకున్నది. కానీ ఆ అవసరం లేక పోయింది. వదిన తాయారు తమ్ముడూ, అక్కా మలక్‌పేటలో ఉంటున్నారు.

"వాళ్ళు హైదరాబాదు వచ్చాక రాలేదంటే బాధ పడిపోతారే. రెండు రోజులు అక్కడ ఉండి వస్తాం. నీ దగ్గరకూడ రెండు రోజులుండ కుండా పోతానా?" అన్నాడు అన్నయ్య.

"రేపూ, ఎల్లుండీ కూడ ఇక్కడే ఉండండి. మీ కోసం మీ చెల్లెలు శలవు కూడ పెట్టింది" అన్నాడతను.

"రేపు కాదులేండి. మేం వస్తున్నామని వాళ్ళేదో ఫంక్షనుకూడ పెట్టుకున్నారు. ఇంత

సిటీలో ఎక్కడికి వెళ్ళాలన్నా ఇబ్బందిగా ఉంటుంది. ఓ నాల్రోజులు మీ ఆఫీసు కారు పంపించకూడదూ?" అన్నాడు అన్నయ్య.

కేశవమూర్తి జవాబు తనకు తెల్సు. అందుకే అతన్ని తిట్టించటం ఇష్టంలేక తనే జవాబిచ్చింది, "ఆయన ఇంటి పనులకు ఆఫీసు కారు వాడరు" అని.

"అమ్మో, బావగారి సంగతి నాకు తెలీదూ? ఆయన లాంటి నిజాయితీపరులుండబట్టే ఇంకా ప్రపంచం ఇలా కొనసాగుతోంది. అయినా వారం రోజులకోసం ఎవరు చూడొచ్చారు కనుక!" అన్నాడు.

ఎలా అయినా తన అభీష్టితం నెరవేర్చుకోవాలనే వాడి తత్త్వం మారలేదు.

"మీకు కారే కదా కావల్సింది. నేను ఏర్పాటు చేస్తాలెండి" అన్నాడు కేశవమూర్తి.

తనేం మాట్లాడలేక పోయింది.

ఆ తర్వాత వీలు చిక్కి నప్పుడు తను అతనితో అంది, "మా వాళ్ళ కోసం మీరు మీ నియమాలు సడలించాల్సిన పనిలేదు" అని.

అతను నవ్వాడు. "కారు సంగతేనా? నా స్నేహితుడికి రెండు కార్లున్నాయి. ఓ వారం రోజులు కారు పంపమంటే అతడేం అనుకోడు. డ్రైవరుతో సహా పంపిస్తాడు. పెట్రోలు మనమే పోయించుకుంటాం కదా?" అన్నాడు.

"మరో మాట! నన్ను సంతోషపెట్టలానికి మీరేం చేయనక్కరలేదు" అంది తను.

అతని ముఖం మాడిపోయింది.

"నిన్ను సంతోషపెట్టటం నా వల్ల అయ్యే పని కాదులే?" అన్నాడు.

"ఉహూఁ" అని తల తిప్పేసుకుని తనెళ్ళిపోయింది.

మర్నాడు అన్నయ్య, వదిన, పిల్లలు మలక్‌పేటకెళ్ళి పోయారు. కేశవమూర్తే టాంకు నిండా పెట్రోలు నింపించి కారు పంపాడు. ఆ తర్వాత తను అన్నయ్యను చూడలేదు.

తరవాతి సోమవారం సాయంత్రం అతను ఇంటికి వచ్చాక చెప్పాడు, "మీ అన్నయ్యవాళ్ళు రాత్రి హైదరాబాద్-నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్‌లో ఊరికి వెళ్ళిపోతున్నారు. కారిచ్చి, నాకు థాంక్స్ చెప్పటానికి వచ్చాడు..."అని.

అతను మరేదో చెప్ప సందేహిస్తుంటే, "అంతేనా, మరేమయినా ఉందా?" అని అడిగింది తను.

"కోపగించుకోకు. అర్జంటుగా యాభైవేలు కావాలన్నాడు. నా దగ్గర అంత డబ్బు

లేదు. ఇరవైవేలిచ్చాను. అతను చిన్నబుచ్చుకున్నాడు. ఇంటికి వెళ్ళగానే పంపిస్తాననన్నాడు."

"ఇచ్చేముందు నన్నడగొచ్చుగా?" అంది తను కోపంగానే.

"ఇంటికి ఫోను లేదు. మొబైలు కూడ నీకు లేదు. నేను కొనిస్తే నీకు కష్టమనిపిస్తుందని నేను కొనలేదు. అతను డబ్బు అర్జంటు అన్నాడు. తప్పలేదు. రెండు రోజుల్లో పంపిస్తాడు. ఇంతలో మనం మనస్తాప పడటమెందుకూ?"

"వాడివ్వడు. ఇవ్వటానికి తీసుకోలేదు వాడు. నా ఋణభారం పెంచటానికి తీసుకున్నాడు. ఏమిచ్చి మీ బాకీ తీర్చగలను నేను" అంది తను నిర్వేదంతో.

"మీ అన్న అని నేను అతనికి డబ్బు అప్పు ఇవ్వలేదు. నా పరిచయస్థుడని ఇచ్చాను" అన్నాడతను.

"నా అన్నగా కాక మీకు వాడితో మరే పరిచయముంది. నన్ను...నన్ను..." కళ్ళకు చెంగు కప్పుకుని ఏడ్చింది తను.

అతనికి చాల బాధ కలిగినట్లుంది. తనప్పుడది గుర్తించలేదు. తన చేయి పట్టుకుని తన్ను అనునయించ ప్రయత్నించాడతను. దాన్ని తను మరో విధంగా అర్థం చేసుకుంది.

"ఛీ, నన్ను ముట్టుకోవద్దు మీరు! నన్ను లొంగదీసుకోటానికి.... ఛీ! ఛీ! మనుషులెంత నీచానికయినా ఒడిగడ్తారు."

అతనేం మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత మళ్ళా తనతో మాట్లాడవల్సి వస్తే ఈ వారం రోజులు చనువుగా 'నువ్వ'న్న పిలుపు మానేసి, 'మీర'న సాగాడు. తనన్న మాటలకు అతని మనసు తీవ్రంగా గాయ పడ్డట్టు తనకర్థమయింది కానీ, తనందుకేం చెయ్యలేక పోయింది.

మర్నాడు తీరిగ్గా ఆలోచిస్తే తనకు తెల్సింది. వాడు తన్ను, తన మొగుణ్ణి వాడుకుని విసిరివేయలానికే వచ్చాడు. వాడి తత్త్వం తనకు తెలిసిందే. అయినా 'అన్న' అన్న భ్రమలో పడిపోయింది. హైదరాబాదులో ఉన్నన్ని రోజులు తన భార్య బంధువుల ఇంట్లోనే గడిపాడు. తిరిగి వెళ్ళేటప్పుడు చెల్లెలికి మొహంకూడ చూపించాలని అన్పించలేదు వాడికి. వాడి ప్రవర్తన వల్ల తను అవమాన పడిపోయింది. తనవాళ్ళగురించి అతనేమనుకుంటాడు. చౌకబారు మనుషులు, డబ్బుకు గడ్డిగరిచేవాళ్ళు, మోసకారులూ అనుకోడూ?

వెంటనే ఉత్తరం రాసింది తను అన్నకు, 'మీ బావగారి డబ్బు వెంటనే తిరిగి పంపవల్సింద'ని. 'తనా భారం వదిలించుకోవాలి. తను అతనికి ఇప్పటికే ఎంతో ఋణ పడింది. ఇప్పుడు అదనంగా ఈ ఋణభారం వచ్చి పడింది. తనతనికి ఋణ పడిన

కొద్దీ అతను తనను తక్కువగా చూసే, చులకన చేసే అవకాశముంది. తన్నెవరయినా చులకనగా చూస్తే తను తట్టుకోలేదు. అలాంటి అవకాశమే ఎవరికీ ఇవ్వని విధంగా తను ఇన్నాళ్ళూ బతికింది.'

తన అన్న కూడా వెంటనే తిరుగు జాబు రాశాడు.

"నీ మొగుడు పీనాసి మనిషి. నేను యాభై అడిగితే, ఇరవై ఇచ్చాడు. అలాంటి మనిషి దగ్గర నువ్వెలా కాపురం చెయ్యగలుగుతున్నావో నా కర్థం కాలేదు. మీదగ్గరికి తిరిగి రావటానికి వీల్లేక, ఇలా వెళ్ళాల్సి వచ్చిందని నీకు చెబ్దామన్నా కొంపలో ఫోను లేకుండా చేశాడు. హోదా చూడటానికి పెద్దదే. డిప్టీ కలెక్టరంట! అతని ఆఫీసు కెళ్ళినప్పుడు నేనతని బావ మరది నని చెప్పకుండా ఎంక్వైరీ చేశాను. నీ మొగుడు గడ్డివామి దగ్గర కుక్క లాంటి వాడన్నారు వాళ్ళు. తను తినడు, ఇతర్లని తిన నివ్వడు. అందుకే, ఎందుకూ పనికిరాని డిపార్టమెంటుకేశా రతన్ని. చిన్నప్పుడు ఎట్లా ఉన్నాడో అట్లాగే ఉన్నాడు. ఏమాత్రం ఎదగలేదు.జీవితంలో పై కెలా రావాలో తెలియదు. లేకపోతే ఆ సన్నాసి కొంపలోనా ఉండటం! రిటైరుమెంటుకూడ దగ్గర్లోనే ఉందట! కనీసం ఇప్పుడైనా నాలుగు రాళ్ళు వెనకేసుకోమను. డబ్బుకోసమని మళ్ళీ నాకు రాయకు. నేనేం ఎగ్గొట్టను. అయినా, పిల్లా జెల్లా లేని దానివి నీకంత డబ్బు వెంపరలాట మంచిది కాదు. పిల్లల్ని పెంచి పెద్ద చేస్తుంటే తెలుస్తుంది. ఓ సెల్‌ఫోను కొనుక్కో. కనీసం నీ యోగక్షేమాలయినా కనుక్కునే అవకాశం నాకుంటుంది. నీ కవసరం లేదులే! తోడ బుట్టిన దానివని చూడవచ్చాను. అన్నని చూడాలని నీకెప్పుడయినా అన్పించిందా? నేనంటే ప్రాణం పెట్టే అమ్మ పోయింది. ఇప్పుడిక నేనంటే ఎవరికి లెక్క!"

ఆ ఉత్తరం చదివాక తనకు చెప్పలేనంత ఆగ్రహం కలిగింది. దాన్ని చించి ముక్కలు చేసింది.'అతను తన జీవితమంతా పరిచయస్థుడే అన్నట్టు రాశాడు. తనకెలా తెల్సు-అతను చిన్నప్పుడు ఎలా ఉన్నాడో? నోరు తెరిస్తే చాలు అబద్ధాలు' అనుకుంది.

## 6

కేశవమూర్తి చనిపోయిన ఐదో రోజున వచ్చాడు కామేశ్వరరావు విశాల ఇంటికి. ఆమె ఆఫీసుకు శలవ పెట్టింది కనుక ఇంటిలోనే ఉంది.అతన్ని చూడగానే కేశవమూర్తినే చూసినట్లనిపించింది విశాలకు.

వస్తూనే, ఆమెకు ఓ చిన్న పేపర్ కవరు ఇచ్చాడు అతను.

"ఇందులో ఈ ఇంటిని మీ పేరున రిజిష్టరు చేసిన డాక్యుమెంటు ఉంది. వాడి దగ్గరో నోట్ బుక్ ఉండేది. వాడు దాన్ని గంగలో విసరివేశాడు...." అని చెప్పాడు

కామేశ్వరరావు.

"ఏం ఎందుకూ?" అడిగింది విశాల.

"అది బహుశః వాడి డైరీ అనుకుంటాను. తన ఆలోచనలు ఇతరులకు తెలియటం వాడికిష్టం ఉండి ఉండదు. ఇంక వాడికి సంబంధించిన చిన్నచిన్న సామానులను వాడిష్ట ప్రకారమే అక్కడ బీదాబిక్కీకి దానం చేశాను.ఇంక వాడికి చెందింది నాదగ్గరేమీ లేదు..." అని కళ్ళంబట నీళ్ళు పెట్టుకున్నాడు అతను.

ఓ క్షణం ఆమె కూడ మాట్లాడలేక పోయింది.

"ఇల్లు రిజిస్టరు చేసిన డాక్యుమెంటు మాత్రం నన్ను స్వయంగా మీకిమ్మన్నాడు. రెండోసారి రోగం తిరగబెట్టిన సూచన కలగగానే ఇంటిని మీ పేరున రిజిస్టరు చేశాడు. మీరు ఇంటి కోసం ఇబ్బంది పడకూడదని వాడి కోరిక. ఇంక నేను వెళ్తాను. వాడు అప్పగించిన రెండు పనుల్లోఒకటి పూర్తి చేశాను. రెండోది రేపు చేద్దాం. రేపు పదింటి కొస్తాను. ఫామిలీ పెన్షను మీపేరున చేయిస్తే నా పనిఅయి పోతుంది."

అతను లేచాడు వెళ్ళిపోవటానికి ఉద్యుక్తు డవుతూ.

"అసలేమిటి జబ్బు?" అని అడిగింది విశాల.

"ఎప్లాస్టిక్ ఎనీమియా. ధృతరాష్ట్రుడి తమ్ముడు పాండురాజు ఆ రోగంతోనే పోయాడు. దాని కెప్పుడూ చికిత్స లేదు. ఈ పాండు రోగం వస్తే, తెల్లకణాలు, ఎర్రకణాలు, ప్లేట్‌లెట్లూ కావల్సిన సంఖ్యలో తయారు కావంట! రాయవెల్లూరు డాక్టరు చెప్పినప్పుడు నేను పక్కనే ఉన్నాను. 'మేం మందులు వాడతాం గానీ, తగ్గేట్టుంటే దానంతటదే తగ్గిపోవచ్చు, మళ్ళా తిరిగి రావచ్చుకూడ' అన్నాడు. అదే అయింది. రాయవెల్లూరులో ట్రీట్‌మెంటయి తిరిగి వచ్చాక, మూడేళ్ళు బాగానే ఉన్నాడు."

"మీరు రాయవెల్లూరు ఎప్పుడు వెళ్ళారు?"

"మీ అమ్మగారు పోయినప్పుడు వాడు రాయవెల్లూరు ఆసుపత్రిలోనే ఉన్నాడు. నేను ఆసుపత్రికి దగ్గరలో రూం అద్దెకి తీసుకుని ఉన్నాను. అక్కడికే మీరు రాసిన ఉత్తరం వచ్చింది. వాడే డబ్బు ఇచ్చి మీ అమ్మగారి దినవారాలు పూర్తి చేయించి రమ్మని నన్ను పంపాడు. తెల్సికూడ వాడి ఆరోగ్యం గురించి మీరు విచారించలేదని నాకు కష్టమేసింది. అందుకే నేను వాడి జబ్బు సంగతి మీకు చెప్పలేదు. ఆ తర్వాత, 'ఆమెకు నేను చెప్పలేదు రా. తెలియని మనిషి వచ్చి నాకు సేవ చేయలేదని నువ్వు నెపమెన్నితే ఎలా? ఎప్పటిలా నేను క్యాంపుకు వెళ్ళాననుకుంది ఆమె' అని వాడు చెప్పాక గానీ నాకు తెలియలేదు.

'చెప్పొచ్చుగా?' అన్నాను. 'నాకు చేసి నీకు విసుగేశాక ఆమెకు చెప్తాలే. ఈ నయమవని రోగానికి ఎంతమంది సాయం తీసుకోవల్సి ఉంటుందో? నీకు విసుగేస్తే చెప్పు ఆమెని పిలిపించుదాం.' అన్నాడు. వాడుంటేనే నాకు బతుకు. విసుగేస్తుందని ఎలా చెప్పగలను!"

"ఆ రోగానికి మందు లేదా?" అడిగింది విశాల.

"నిజానికి లేదు. బోన్‌మారో ట్రాన్స్ ప్లాంటేషను చేస్తే ఎక్కువ కాలం బతికే అవకాశం ఉందన్నారు. దగ్గిరి బంధువుల మూలగ మాత్రమే సరిపోతుందన్నారు. కూతుర్ని అడగటం వాడి కిష్టం లేదు. నేనే వెళ్ళి విషయం చెప్పి, 'మూలగను డొనేట్ చేసి మీ నాయన్ని కాపాడుకో' అని చెప్పాను. 'చాల్లే ఆయన ఎక్కడెక్కడో తిరిగి రోగాలు తెచ్చుకుంటూవుంటే, బాగు చేయించటం నా పనా?' అంది. మీతో పెళ్ళయాక ఆ పిల్లకు తండ్రిఅంటే విముఖత పెరిగి పోయింది. రోగిష్ఠి తండ్రిని చూడటానికి ఒకసారి కూడ రాలేదు. కనుక బోన్‌మారో ట్రాన్స్ ప్లాంటేషను గురించి మళ్ళా ప్రయత్నం చెయ్యలేదు మేం..."

"చెడు తిరుగుళ్ళు తిరిగితే ఆ రోగమొస్తుందా?" అనడిగింది విశాల, అనుమాన నివృత్తి కోస మన్నట్టు.

"అది సుఖరోగం కాదమ్మా! ఎందుకొస్తుందో ఎవరికీ తెలీదు. ఆ పిల్ల వాగుడి బట్టి వాడు చెడ్డ మనిషనుకోకు. రోగం తిరగబెట్టింది. మళ్ళా రాయవెల్లూరులో చూపెట్టుకుంటే, అదేదో సిండ్రోములోకి దిగింది, ఇంక బతకటం కష్టమన్నారు. హరిద్వార్‌లో మూలికా వైద్యం చేసే ఆశ్రమముంది, అక్కడ రోగం నయమవుతుందంటే అక్కడికి వెళ్ళాం. అక్కడ రోగం మరింత ముదిరింది. కంఖాల్‌లో రామకృష్ణా మిషను ఆసుపత్రి ఉంది. వాడు వద్దంటున్నా నేనే బలవంతం చేసి వాడినక్కడ చేర్పించాను, ఆ తర్వాత భానుమతికి ఎలాగో ఫోను చేసి చెప్పాను. వాడు చచ్చాక గానీ ఆ పిల్ల రాలేక పోయింది. మీరు రాలేదేమని ఆమెను అడిగాను. 'ఆవిడని తీసుకవచ్చే బాధ్యత నాది కాదంది' ఆ పిల్ల. నిజమే కదా!"

విశాలకు తన పరిస్థితి గురించి చెప్పుకోటం కష్టమయింది. ఆమె హృదయం పశ్చాత్తాపంతో ఘూర్ణిల్లుతోంది. ఆ దైవోపహతుడి పట్ల తనెంత దుర్మార్గంగా ప్రవర్తించిందో తల్చుకుంటే ఆమె విహ్వల అయింది.

"నాకేం తెలియదే! నేనెట్లా రాగలను. ఆ పిల్ల నన్ను తీసుకెళ్తానన్నది. చెప్పకుండా ఒక్కతే వెళ్ళిపోయింది..." అంటూ, ఒక్కసారిగా గుండె పగిలినట్లు, ఆమె శోకించసాగింది. కామేశ్వరరావుకు ఆమెనెలా ఓదార్చాలో తెలియలేదు.

"మీరు వాడిలాగ ధైర్యవంతులనుకున్నాను. స్పృహతప్పబోయే ముందన్నాడు, 'అడ్డమైన

చాకిరీ నీ చేత చేయించు కున్నానురా, ఏమనుకోకు. నాకు నువ్వు తప్ప ఎవరున్నారు...' అన్నాడు... అవును. వాడికి పెళ్ళాం, బిడ్డలున్నారు. మరి నాకు వాడు తప్ప ఎవరున్నారు!..."

అతని కంఠం రుద్ధమయింది. అతడు మరి మాట్లాడలేక పోయాడు. పళ్ళతో పెదవి బిగబట్టి ఏడుపునాపుకో ప్రయత్నించాడు కానీ, కళ్ళు వర్షిస్తూనే ఉన్నాయి.

మాట పెగుల్చుకుంటూ అడిగింది విశాల, "దహనం ఎవరు చేశారు?" అని.

"అల్లుడు బ్రాహ్మడి చేత చేయిద్దా మన్నాడు. నాకది ఇష్టం లేదు. అల్లుడు చెయ్యాలి. అతని వల్ల కాకపోతే నేను చేస్తానన్నాను. నేనే చేశాను. బూడిద చేశాను, అయ్యో....!"

గొంతు గద్గదమై అతడో క్షణం మాట్లాడలేక పోయాడు.

ఆ తర్వాత, అతను వెళ్ళబోతూ, వెనక్కి తిరిగి, "మర్చి పోయాను. ఈ సెల్ ఫోను మీకిమ్మన్నాడు. ఉపయోగించుకోమని చెప్పాడు" అని మొబైల్ ఇచ్చేసి, ఏడుస్తూనే వెళ్ళిపోయాడు.

విశాల ఇంక విముక్త అయినట్లు ఏడవసాగింది. అతని పట్ల తను చేసిన ద్రోహమంతా ఆమెకు కళ్ళకుకట్టి కన్పించసాగింది. తన అన్నావాళ్ళు వెళ్ళిపోయాక, అతను అధికంగా క్యాంపుల్లోనే గడిపేవాడు. అమ్మపోయిన రెండేళ్ళకు అతను రిటైరయ్యాడు.తనకు అంత్యకాలం సమీపిస్తుందని తెలిసే, ప్రిమెచ్యూర్ రిటైర్‌మెంటు తీసుకున్నాడు. ఆతర్వాత రెండు, మూడు వారాలపాటు ఎక్కడికో వెళ్ళాడు. అతడు పాండురోగంతో బాధ పడుతున్నాడనీ, రాయవెల్లూరు డాక్టర్లు పెదవి విరిచే సరికి హరిద్వార్ లోని ఆశ్రమంలో చికిత్స తీసుకో వెళ్తున్నాడనీ తనకు అప్పుడు తెలియక పోయింది. అంతిమంగా వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్నాక, ఇంకా ప్రయాణం వారం రోజులుందనగా చెప్పాడు, "నేను హరిద్వార్ వెళ్ళిపోతున్నాను. ఆ ప్రదేశం బాగుంటుందని అంటారు. నాకు నచ్చితే నేనక్కడే ఉండిపోతాను. మీరూ వస్తే బాగుంటుంది" అని.

"నాకెలా కుదురుతుందీ? ఉద్యోగం వదలి పెట్టి ఎలా రానూ?" అంది తను.

"మీకు ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేదు. ఆ మాత్రం తిండి నా భార్యకు నేను పెట్టలేకపోను" అన్నాడతను అర్థిస్తున్నట్టు.

తను నవ్వింది, "మీరు భర్త, నేను భార్య! ఇంతకంటే జోకేం దొరకలా మీకు!" అంది.

తనప్పుడు గమనించలేదు కానీ మనిషి హతాశుడయి ఉంటాడు.మొహం బాగా

పాలిపోయినట్లు కనిపించింది. మర్నాడు, బ్యాంకు అకౌంటును తమ ఇద్దరిలో ఎవరయినా డబ్బు తీసుకోటానికి వీలుగా మార్పించాడు.

"మీకు నా డబ్బు అవసరం లేదనుకోండి. నా కవసర పడితే, మీరు డ్రా చేసేందుకే ఈ ఏర్పాటు. మీ కంటే నేను విశ్వసించదగిన వాళ్ళెవరూ నాకు లేరు" అని నవ్వుతూ కారణం చెప్పాడు.

తను కాదనలేక పోయింది. 'మీ కూతురు లేదూ?' అందామనుకుని కూడా మాటలు పెంచటం ఇష్టం లేక మానుకుంది తను.

అంతలో విశాల చేతిలో సెల్ ఫోను మోగింది. ఆమె ఉలిక్కి పడి పోయింది. అతను పోయాడని తెలియని వాళ్ళెవరో కేశవమూర్తి కోసం ఫోను చేశారని విశాల ఫోను రిసీవ్ చేసుకోలేదు. కాస్తంత సేపు ఫోను రింగయి ఆగి పోయింది. కాసేపుండి మళ్ళీ రింగవసాగింది. ఇప్పుడింక తప్పలేదు. ఫోను ఆన్ చేసి చెవి దగ్గర పెట్టుకుంటే అందులో రామానుజం గొంతు విన్పించింది.

"ఇప్పుడే దారిలో కలసిన కామేశ్వరరావుగారు చెప్పారు కేశవమూర్తిగారి జబ్బు గురించి. మీ ఫోను నంబరూ ఆయనే ఇచ్చారు. ఆయన కూతురితో కూడ మాట్లాడారట కామేశ్వరరావుగారు. తొమ్మిదో రోజు నుండి కర్మ మొదలు పెడ్తారట. కూలికి బ్రాహ్మణున్ని మాట్లాడుతుంటే వద్దని ఆయన కర్మ తనే చేస్తానన్నారట. ఆ ఏర్పాట్లన్నీ ఆయనే భుజంమీద వేసుకుని చేస్తున్నారు. కేశవమూర్తిగారు గొప్ప మనిషి. తన జబ్బు సంగతి తెల్సీ మీకు బాధ కలుగుతుందని గోప్యంగా ఉంచారంటే ఆయన ప్రశంసించాల్సిన వ్యక్తే. నేనూ, నిర్మలా సాయంత్రంవస్తాం. మీరు ధైర్యంగా ఉండండి. ఏ అవసరపడినా ఈ నంబరుకు ఫోను చేసి చెప్పండి. సందేహించాల్సిన పని లేదు"అని అతను ఫోను ఆఫ్ చేశాడు.

రామానుజం కర్మకాండ, తొమ్మిదో రోజు గురించి చెప్పేసరికి, ఇప్పుడు విశాలకు లోకం, కట్టుబాట్లు గుర్తుకు వచ్చాయి. 'ఇప్పటి దాకా తనకా ఆలోచన కలగలేదు. తనతని భార్య. తనేమనుకున్నా అతని భార్యగా తను నిర్వర్తించాల్సిన విధులు తను నిర్వహించక తప్పదు. అతనికీ లోకంలో సంబంధీకులు, తనకు తెలిసినంత వరకు, ముగ్గురే. ఎంత తండ్రి పట్ల విరోధమున్నా భానుమతికి హరిద్వార్ వెళ్ళక తప్పలేదు; కామేశ్వరరావుకు మిత్రుడిని బూడిద చెయ్యక తప్పలేదు, ఇప్పుడు కర్మకాండ చెయ్యక తప్పటం లేదు; తనకూ పునిస్త్రీ అలంకారాలు విడవక తప్పదు.

ఫోను చేసి తండ్రి పోయినందుకు ఆ పిల్లను పలకరించాలని అన్పించింది. ఫోనులో

ఆమె నెంబరు ఉండొచ్చు. ఆమె తన్ను తిట్టవచ్చు. ఓ క్షణం సందేహించింది. ఇలాంటి పరిస్థితిలో తన భర్త ఎలా ప్రవర్తించి ఉండేవాడు అని ఆలోచించింది ఆమె. తన భ్రమలన్నీ ఇప్పుడు తొలగి పోయాక అతన్ని తన భర్తగా అంగీకరించటానికి ఆమెకేమీ అభ్యంతరం లేక పోయింది. వెంటనే ఆమెకు తోచింది. తనకు అప్రియమయింది ఎదురయ్యే అవకాశం ఉందని తెల్సినా అతను తన కర్తవ్యాన్నుండి వెనుకకు తిరగడు. అలా అన్పించగానే సెల్ తీసుకుని భానుమతికి ఫోను చేసింది.భానుమతి ఫోనెత్తగానే చెప్పింది.

"నేనే విశాలను. మీ నాన్నగారి సెల్‌నుండి ఫోను చేస్తున్నాను. ఆయన పోయిన ఈ సమయంలో మన ఇద్దరి పరిస్థితి ఒకటిగానే ఉంది. అయినా, పెద్దదాన్ని నిన్ను పలకరించాల్సిన బాధ్యత నామీద ఉంది. ధైర్యంగా ఉండవల్సింది. మీ ఇంటికి వచ్చి ఈ మాటలు చెప్పాల్సి ఉండె. నాకు మీ ఇల్లు తెలియక పోవటం వల్ల రాలేక పోయాను...."

"ఏయ్! నీకు తెలీపోతేనేం. నీమీండ మొగుడికి ఆ రామానుజానికి తెల్సుగా? గంగులు వచ్చి చెప్పాడు. మా నాన్న బతికుండగా లేని వలపులు ఇప్పుడు కురిపించాల్సిన అవసరం లేదు..."

"శాంతించు. నీకు బలం మీ నాన్న! ఆయన పోయాక నిన్నెవరూ లెక్కచెయ్యరు. కూతురికి కోపం వస్తుందనో, నువ్వు ఏడుస్తావనో ఏవరూ జడవరు. నా మొగుడి ఇల్లు నాదే. ఆయన ఇంటిని నా పేరున రిజిస్టరు చేశారు. తెలియక పోతే కామేశ్వరరావుగారి నడుగు. నా తదనంతరం కూతురివి కనుక నీకే వస్తుంది, దిగులు పడకు. నీ తండ్రి భార్యకు రంకులెన్నటం నీకే పరువు తక్కువ. మళ్ళీ మాట్లాడతాలే! నీ మనసు బాగాలేదు" అంది విశాల.

ఆ పిల్ల అవాక్కయినట్లయి పోయినట్లు జవాబివ్వ లేదు. విశాల ఫోన్ ఆఫ్ చేసింది. తన భర్తలా సాత్వికంగా మాట్లాడాలనే ఫోను చేసింది కానీ, తన మూల గుణమెక్కడికి పోతుందీ? కఠినంగానే మాట్లాడింది, ఆ పిల్ల రెచ్చగొట్టటంతో.

ఇప్పుడు మొదటి సారిగా ఆమెకు సాంత్వన కలిగింది. ఆ పిల్లకు దిమ్మ తిరిగి పోయిందన్న అనుభూతి తనకు కలిగింది. కాని అతను తనవల్ల ఇతరులు అలాంటి అనుభూతి పొందాలనుకోడు. అతని బలం నైతిక బలమని ఆమెకు మొదటిసారిగా అనుభూతమయింది. ఇతరులతో సహృదయంగా ప్రవర్తించినందు వల్ల అతను భౌతికంగా కొంత నష్టపోయి ఉండవచ్చు, కానీ అది అతనికి మానసిక, నైతిక బలాన్నిచ్చి ఉండాలి.

'తను అతన్ని తృణీకరించి పాపం చేసింది. దానికి తగిన ప్రక్షాళన తను చేసుకోవాలి. అతను తన పట్ల చిన్న ప్రలోభం చూపి నందుకు పెద్ద శిక్ష అనుభవించాడు. చేసిన పొరపాటును గ్రహించగలిగే మానసిక స్థాయి అతనికి ఉంది. అందుకే సమాజంలోని

పురుషత్వపు వెసులుబాటును తనకు అనుకూలంగా మల్చుకునే ప్రయత్నం ఎప్పుడూ చెయ్యలేదు.' అతని ఉన్నత సంస్కారానికి విశాల మనస్సు మొదటి సారిగా అవనత మయింది. ఇంక తన మొగుడికి చెందినదేదీ తనది కాదని తిరస్కరించ లేక పోయింది ఆమె. అలా తిరస్కరిచటం అతనిని అవమానించట మవుతుంది. అందుకే ఆమె ఆ మర్నాడు కామేశ్వరరావు వచ్చి పెన్షను ఆఫీసుకు రమ్మన్నప్పుడు కాదనకుండా బయలు దేరింది.

కేశవమూర్తి రిటైరవబోయేముందు, పదవీవిరమణ కాయితాలపై తన సంతకం తీసుకోటం విశాలకు గుర్తుకొచ్చింది.

✣ ✣ ✣

'అతనో ఫొటోగ్రాఫరును ఇంటికి తీసుకొచ్చాడు. "విశాలా!" అని తన్ను పిల్చాడు. ఆ మధ్య తమకసలు మాటలు లేవు. ఎందుకు పిల్చాడా అని ఆశ్చర్యపోతూ తను వెళ్ళింది.

తను ప్రిమెచ్యూర్ రిటైర్‌మెంటు తీసుకుంటున్నట్టు అతను చెప్పాడు.

"ఏం, అంత అవసరమేం?" అంది తను.

"మరింక ఏడాదిపాటు ఆగే ఓపిక నాకు లేదు" అన్నాడతను, నవ్వుతూ.

తను పెదవి విరిచేసింది.

"నేను రిటైరయి పోతున్నాను కదా! పెన్షన్ ఫారంలలో మనమిద్దరం కల్సి తీయించుకున్న ఫొటోలనతికించాలి. అందుకే అతన్ని రమ్మన్నాను" అన్నాడతను.

అతనితో కల్సి ఫొటో దిగటం తనకిష్టంలేదు.

పెళ్ళప్పుడే తాము ఫొటో దిగలేదు. అందుకు అమ్మకు గునుపుగా కూడా ఉండేది. ఆమె దృష్టిలో ఫొటో ఒక బలమయిన సాక్ష్యం. 'ఈ మొగవాళ్ళను నమ్మలేం. రేప్పొద్దున అసలు నాకు పెళ్ళే కాలేదన్నా ఆడదానికి దిక్కుండదు' అన్నది ఆమె అభిప్రాయం. పెళ్ళి రిజిస్టరవటమే తిరుగులేని సాక్ష్యమంటే ఆమె అర్థం చేసుకునేది కాదు. ఫొటోలుండి, సంప్రదాయంగా జరిగే పెళ్ళే ఆమె అంగీకారం పొందుతుంది. అయితే అతను రిజిష్టరు మారేజీకే మొగ్గుచూపటంతో ఆమె కాదనలేక పోయింది. అసలు కూతురికి పెళ్ళయ్యే దారే కన్పించని సమయంలో, ఏ పెళ్ళికయినా సుముఖత చూపక తప్పలేదు ఆమెకు.

అయితే, ఆ కలసి దిగే ఫొటో విషయం పై ఫొటోగ్రాఫరు ఎదుట చర్చించటమెందుకని తామిద్దరూ కల్సి ఫొటో తీయించుకున్నారు. ఆ తర్వాత అతను ఏవో ఫారాలు ఇచ్చి, సంతకాలు పెట్టమన్నాడు. మారు మాట్లాడకుండా అతను పెట్టమన్న

చోటల్లా సంతకాలు పెట్టింది తను.'

✣ ✣ ✣

ఇప్పుడు అసలు ఇబ్బందే కలుగలేదు. కేశవమూర్తి భార్యగా ఆమె పేరు, ఫొటో, వివరాలు ప్రభుత్వ రికార్డులో నమోదయ్యే ఉన్నాయి. వాళ్ళు వాటిని నిర్ధారించుకోటానికే కామేశ్వరరావు ఆమెను పెన్షను ఆఫీసుకు తీసుకు వెళ్ళాడు. ఫార్మాలిటీస్ పూర్తి చేశాక మరుసటి మాసం నుండి తన పేరునే ఫామిలీ పెన్షను తన బ్యాంకు అకౌంటులో జమవుతుందని వాళ్ళు ఆమెకు చెప్పారు.

పనయి తిరుగుముఖం పట్టేటప్పటికి సుమారుగా ఒంటిగంటయింది.

విశాలను ఇంటి దగ్గర దింపటానికి కామేశ్వరావు ఆమె వెంట బయలుదేరాడు.

"ఈ పూట మా ఇంట్లో భోజనం చేసి వెళ్ళండన్నయ్యా!" అంది విశాల.

ఆమె అంత ఆప్యాయంగా పిల్చేసరికి అతను కాదనలేక పోయాడు.

తిరిగి ఆటోలో బయలు దేరాక "మీరెక్కడ ఉంటారు?" అని అడిగింది, విశాల.

"ఓ కూరలమ్ముకునే మనిషుందమ్మా, మన ఇంటికి కూడా కూరలమ్మటానికి వస్తుంటుంది. ఆమెకు కేశవమూర్తి అప్పుడప్పుడు డబ్బు చేబదులిచ్చేవాడు. ఆమెకు చెందిన ఓ పాతరేకుల ఇంట్లో ఓ చిన్న గదిలో ఉంటున్నాను. నేనుజెయిలు నుండి బయట పడ్డాక, వాడే నన్ను తన ఇంట్లో ఉంచుకున్నాడు. చిన్నప్పటి నుండి నన్ను విడచి వాడుండేవాడుకాదు. ఈ ప్రపంచంలో ఎవరు ఏ చిన్న సాయం చేసినా మర్చి పోయే స్వభావం కాదు వాడిది. జెయిలునుండి బయట పడాక నా బతుకు దుర్భరమయింది. ఉండ ఇల్లు లేదు, జీవనోపాధి లేదు. కేశవమూర్తి ప్రయత్నించినా నాకెవరూ ఉద్యోగమివ్వ సాహసించలేదు. అందుకే వాడితో పాటు కలసి వాడింట్లోనే ఉండేవాడిని. అది అనేక అపార్థాలకు దారితీసింది. అప్పుడే కేశవమూర్తి నెలకు పాతిక రూపాయల అద్దె మీద ఆమె ఇంట్లో నాకు ఆశ్రయం కల్పించాడు. అప్పటి నుండి ఇప్పటిదాకా నన్ను తండ్రిలా పెంచుతూనే ఉన్నాడు..."

"మీరు మంచి స్నేహితులు. ఎవరేమన్నారు మిమ్మల్ని!" అడిగింది విశాల.

"ఎవరి దాకానో ఎందుకులేమ్మా, కూతురే పిచ్చికూత కూసింది. మీకు ఆమె స్వభావం తెలియంది కాదు. నాకు చెప్పటానికే అసహ్యమనిపిస్తున్నది..."

"ఇంట్లో నుండి వెళ్ళిపొమ్మన్నదా?"

"అలా అన్నా మేమంత మనసు కష్టపెట్టుకునేవాళ్ళం కాదు. మేము హోమోలం (స్వలింగసంపర్కులు)అట! అందుకే ఒకళ్ళనొకళ్ళం వదలలేకుండా ఉన్నామట! ఆ పిల్లకు తండ్రి పక్కన ఎవరూ వుండటం ఇష్టం వుండదు. అతడు తనను వదలి పెట్టి ఉండటం కూడ సహించలేదు ఆమె. అతడెప్పుడూ తన దగ్గరే ఉండాలి. అందుకే వాడు తన ఇంటినుండి తిరిగి వెళ్ళి పోయినందుకు తండ్రంటే కసి పెంచుకుంది. అందుకే తన తండ్రికి ఎవరు దగ్గరగా వచ్చినా వాళ్ళను అతని నుండి దూరం చేసే సర్వ ప్రయత్నమూ చేస్తుంది. మరి మీ విషయంలో ఆమె ఏ ప్రయత్నం చేసిందో నాకు తెలీదు. ఆ ప్రయత్నాల్లో ఎదుటి మనుషులని అవమాన పర్చటానికి కూడ వెరువదు. ఆ పిల్లకు పెళ్ళి చేయటం కూడ వాడికి ఎంతో కష్టమయింది. నేను మా నాన్నను విడచి వెళ్ళనని మొండి కేసేది. చివరకు సైకియాట్రిక్ ట్రీట్‌మెంట్ కూడ ఇప్పించాడు వాడు. డాక్టరేమన్నాడో కానీ, కేశవమూర్తి చెప్పిందేమంటే భానుమతి 'ఎలక్ట్రా కాంప్లెక్సు'తో బాధ పడుతోందని."

"ఏంటది?" అడిగింది విశాల.

"తల్లి పట్ల కొడుక్కూ, తండ్రి పట్ల కూతురికీ ఉండే ప్రత్యేక అనుబంధాలను ఇడిపస్, ఎలక్ట్రా కాంప్లెక్స్‌లని అన్నాడు సిగ్మండ్ ఫ్రాయిడ్ ఎప్పుడో. అందులో కామభావం కూడ ప్రచ్ఛన్నంగా ఉంటుంది.సామాన్యంగా సుప్తంగా ఉండే ఈ కామ సంబంధాలు ఒకోసారి ప్రత్యేక సందర్భాలలో ప్రకోపించి ఉంటాయి. నిజానికి తండ్రికీ, కూతురికీ శారీరక సంబంధాలుండవు. మరో స్త్రీ- అది తల్లి అయినా లేక, మరో పురుషుడయినా - తండ్రికిసన్నిహిత మవటం కూతురు సహించలేదు. తన ఇష్టానికి విరుద్ధంగా జరిగితే ఆ పిల్ల పిచ్చిపట్టినట్టు ప్రవర్తిస్తుంది. అలాంటి ఎక్స్‌ట్రీమ్ కేసే భానుమతిది. పైగా తల్లి పోయాక తండ్రి పెంపకంలో పెరిగిన దవటంవల్ల గారాబంతో మకురుగా తయారయింది. పెళ్ళయినాక క్రమ క్రమంగా ఆ లక్షణం తగ్గుముఖం పడుతున్నా, ఒక్కోసారి ఆ పాత లక్షణాన్ని మర్చిపోనట్టే ప్రవర్తిస్తుంది"అని చెప్పి అతని స్మరణలో ఓ క్షణం మాట్లాడలేదు.

ఆ తర్వాత చెప్పాడు: "వాడి డబ్బుతో బతుకుతున్నందుకు నేను బాధ పడేవాడిని. 'అనవసరంగా బాధపడకురా, నేను చెడు మార్గం పట్టకుండా అనుక్షణం నువ్వు కాపాడుతున్నావు. అందుకు ఋణం తీర్చుకుంటున్నాను. పోనీ, క్రిందటి జన్మలో చేసిన బాకీ తీర్చుకుంటున్నాననుకో' అనేవాడు. అది క్రిందటి జన్మ బాకీ కాదు. ఈ జన్మలో ఏకొద్దో మానాయన చేసిన దానికి అలా కృతజ్ఞతలు చెప్పుకునేవాడు. చిన్నప్పుడు, ఓ సారి వాడు ఆకలికి నకనకలాడుతూ మా ఇంటికి వచ్చాడు. మిట్ట మధ్యాహ్నం ఒంటి గంటయిందను కుంటాను. ఆదివారం. నాన్న ఇంట్లోనే ఉన్నాడు. వాడిని చూడగానే ఆయన కర్థమయింది. 'ఏరా, కేశవుడూ, అన్నం తిన్నావట్రా?' అని అడిగాడు. వాడు

నసిగాడు. 'ఇవాళెవరి ఇంట్లోరా వారం?' అని అడిగాడు. చెప్పాడు. 'మరి వాళ్ళు అన్నం పెట్టలేదా?' మా నాయన ఎంతో బలవంతం చేశాక గానీ, వాడు నోరు విప్పలేదు. ఆ ఇంటావిడ అన్నగారు ఊరినుండి వచ్చాడట! 'ఏమయ్యా! కుంటాడివీ, గుడ్డాడివీ కాదు గదా? కష్టించి పని చేసుకు బతకాలి. ఇలా అడుక్కు తింటానికి సిగ్గులేదూ?' అన్నాడట. అందుకు ఇంటివారి పిల్లవాడు, 'అతను చదువుకుంటున్నాడు, మామయ్యా! అందుకనే వారాలు చేసుకుంటున్నాడు' అన్నాట్ట! 'వీడి ముఖం! చదివి ఎవణ్ణి ఉద్ధరిస్తాడట! నిరుద్యోగ సంఖ్యను పెంచటం తప్ప!' అని మేనల్లుడికి చెప్పి, 'ఒరే బాబూ, వెళ్ళి పనిపాటులు చేసుకు బతుకు. మళ్ళా ఇటువైపు రాకు. వచ్చావా బాగుండదు, చెప్తున్నాను' అని ఇంటావిడ చెప్తున్నా వినక కేశవుడిని పంపేశాడట! ఈ మాటలు చెప్పి, 'నేనిక వారాలు చేసుకోను' అన్నాడు. నాన్న 'సరే, చిన్న క్లాసుల పిల్లలకు ట్యూషనులు చెబ్దువుగానిలే. అంత దాకా మా ఇంట్లో భోజనం చెయ్యి. నువ్వు ముందు లేచి అన్నం తిను' అని, నాతో 'ఒరే, మీ అమ్మను కేశవుడికి అన్నం పెట్టమని చెప్పరా. వాడికేదో ఒక దోవ దొరికిందాకా వాడు మన ఇంట్లోనే భోజనం చేస్తాడు' అన్నాడు మా నాయన. అలాంటి చిన్నచిన్న సంఘటనలు వాడు మర్చిపోలేదు. అందుకే వాడు నిస్సహాయంగా నన్నెప్పుడూ వదలలేదు.

"వాడు రిటైరయినప్పుడు వీడ్కోలు సభ జరిగింది. వాడికి నిజాయితీ పరుడని ఎంతో పేరు. అందుకే పెద్ద పెద్ద అధికార్లు కూడ హాజరయారు. సభ పూర్తయే సమయంలో ఒక వ్యక్తి- అతడు కేశవమూర్తికి సన్నిహితుడే- అడిగాడు, 'చుట్టూ సమాజ, వ్యవస్థ చెడిపోయి ఉంది. ఈ అవినీతి, లంచగొండి వ్యవస్థలో మీరెలా నిజాయితీగా బతుకగలిగారు?' అని. అప్పుడు వాడు నవ్వాడు. దూరంగా సభలో కూర్చున్న నన్ను డయాస్‌కు పిల్చాడు. 'ఈయన తెల్సుకదా మీకు?' అని అడిగాడు. 'ఎందుకు తెలియదు? నిత్యం మీ వెంటే ఉంటాడు, మీ బాడీ గార్డు' అన్నాడతను. 'నాకు బాడీ గార్డు మాత్రమే కాదు, నా ప్రవర్తనకు కాపలాదారుడుకూడా. నా పతనానికి నాకు అడ్డుగోడ ఈయన' అన్నాడు వాడు. అలా అని జెయిలు నుండి తిరిగి వచ్చిన నేను మారిపోయాననుకోవద్దు. నిత్యం వాడిపక్కన నన్ను చూసిన జనం నా ద్వారా వాళ్ళ పనులు చక్క పెట్టుకోవాలని చూశారు. వాడు నాకు గట్టిగా హెచ్చరికి చేశాడు: 'నువ్వు నా చిన్ననాటి మిత్రుడిగా నా దగ్గర ఉంటున్నావు. నా పదవీ నిర్వహణలోని వ్యవహారాలు నీకు సంబంధించనివి. వాటిలో నువ్వు జోక్యం చేసుకో మొదలెడితే, నువ్వు నన్ను విడిచి వెళ్ళక తప్పదు' అని. కూతురు మాటలకు తప్పక, వాడు నన్ను విడిగా ఉంచాడు కానీ క్యాంపుకు, మరెక్కడకు వాడు వెళ్ళినా నేను వాడి వెంట ఉండాల్సిందే. వెధవ! ఈ సారి పెద్ద క్యాంపుమీద వెళ్ళాడు, నన్ను తీసుకెళ్ళటం మరిచి!" అంటూ బావురు మన్నాడు కామేశ్వరరావు.

అతని ఏడుపు విని ఆటో డ్రైవరు వెనక్కి తిరిగి చూశాడు. అతన్ని సముదాయించలేక సతమతమయింది విశాల.

అతడు కొద్దిగా కుదుట పడ్డాక అడిగింది విశాల, "ఆయన పోయారు కనుక మీరిక్కడే ఉంటారా, మీఊరు వెళ్ళిపోతారా?" అని అడిగింది ఆమె.

అతడు కళ్ళు తుడుచుకుంటూ, "నాకు ఎక్కడా ఎవరూ లేదు, సెంటు భూమిలేదు. వాడు నాకు లక్ష రూపాయలిచ్చాడు. నా చేత ఒట్టు కూడ వేయించు కున్నాడు- నాకు డబ్బు ఇచ్చిన విషయం ఎవరికీ చెప్ప వద్దని. తను పోయాక నేనేమయి పోతానా అని చాల దిగులు పడి పోయాడు. 'జాగ్రత్తగా డబ్బు వాడుకో. ఇక్కడే, హరిద్వార్‌లో, ఏఆశ్రమంలో నయినా ఉండు. నీ దగ్గర డబ్బున్నట్టు ఉన్నట్టు ఎవరికీ చెప్పొద్దు' అంటూ సవాలక్ష జాగ్రత్తలు చెప్పాడు నాకు. ఇక్కడ వాడి కర్మకాండలయి పోయాక హరిద్వారం వెళ్ళిపోతాను" అన్నాడు కామేశ్వరరావు.

ఇంటికి వచ్చాక ఆటో దిగి డబ్బులివ్వబోతే, "నువ్వు పదమ్మాయి! నేనిచ్చి వస్తాలే! ఇవి వాడి డబ్బులే"అన్నాడు కామేశ్వరరావు.

బాగా ఆలస్యమవటంతో వంకాయలు తరిగి తాలింపు పెట్టి, అన్నం వండింది. పచ్చళ్ళేవో ఉన్నాయి, వాటితో సరి పెట్టాలనుకుంది. ఆటోలో వచ్చేటప్పుడు, కామేశ్వరరావు కూడ అదే అన్నాడు. వంటయి పోయింది. ఆ ఇంట్లో డైనింగ్ టేబుల్ ఉండే అవకాశం లేదు- కేశవమూర్తికీ, విశాలకూ ఉన్న వేరువేరు కారణాల వల్ల. విస్తరిలో క్రిందే వడ్డించాక కామేశ్వరరావును పిలచింది విశాల తన వాటాలోకి, "మా ఇంట్లో మీకు మైల భోజనం చెయ్యక తప్పటం లేద" ని నొచ్చుకుంటూ.

అందుకతను సమాధానం చెప్పలేదు. గోడమీద వేలాడుతున్న ఆమె తండ్రి ఫొటో వంక చూస్తూ, పీటమీద కూర్చుంటూ, అడిగాడు, "ఎవరాయన?" అని.

"మా నాన్నగారు" అంది విశాల.

"చంద్రగిరి వేణుగోపాలరావుగారు మీ నాన్నగారా?" అని అడిగాడు కామేశ్వరరావు అప్రతిభుడయినట్లు.

"మీకాయన తెల్సా?" అనడిగింది విశాల. ఇదే ప్రశ్నను తను మొదటిగా ఆ ఇంటికొచ్చినప్పుడు కేశవమూర్తిని అడిగినట్లు గుర్తుకొచ్చింది విశాలకు. అప్పుడతను జవాబు చెప్పలేదు.

"బాగా తెల్సు. మీ అమ్మగారు- వేణుగోపాలరావుగారి భార్య- కేశవమూర్తి అక్కేగా?" అన్నాడతను, ఔపోపన పట్టి భోజనానికుపక్రమించ బోతూ.

"మరి ఆయన కానీ, మా అమ్మకానీ ఆ విషయం నాకెప్పుడూ చెప్పలేదు!" అంది విశాల ఆశ్చర్య పడిపోతూ.

"మీ నాన్నగారి పేరు వినివుంటే వాడు వెంటనే మీ అమ్మను గుర్తు పట్టి ఉండాలి. వాడికి పదిపన్నేళ్ళ వయసు ఉన్నప్పుడు వాడిని మీ నాయనగారు మీ ఇంటికి తీసుకు వెళ్ళారు, అనాథ అయిన తన సవతి బావమరదిని పెంచి పెద్ద చెయ్యటానికి. మీ అమ్మగారు ఆ నిర్భాగ్యుడిని తన ఇంట్లో ఉంచుకో నిరాకరించారు. అందుకు వాడిమీద మాత్రమే ఆమెకు కోపం కాదు. తన తండ్రి మీద కూడ ఆమెకు కోపం. తన తల్లి- భర్త మీదపెంచుకున్న దురాగ్రహం మీ అమ్మగారు కూడ పంచుకున్నారు. మీ తాతగారి గురించి మీ అమ్మగారేం గొప్పగా చెప్పి ఉండక పోవచ్చు...."

"ముందల ముతాకోరని మాత్రం అక్కసు పడేది. మా నాన్న మాత్రం 'అన్నీ తెలీకుండా ఎవర్నయినా అలా నిందించటం తగద' నే వాడు. 'మీకేం తెలియదు, మీరు మాట్లాడకండి' అనేది అమ్మ."

"మీ తాతగారి రెండో భార్య కొడుకు కేశవమూర్తి. మీ తాతగారూ, మీ చిన్న అమ్మమ్మా రైలు దుర్ఘటనలో మరణించటంతో కేశవమూర్తి అనాథ అయాడు. వివరాలంత బాగా నాకు తెలియవు. మీ నాన్నగారు వాడిని ఏ పరిస్థితిలో మీ ఇంటికి తీసుకు వెళ్ళారో కూడ నాకు తెలీదు. మీ అమ్మగారు వాడిని సాకటానికి నిరాకరించటంతో ఆయన వాడిని గుంటూరు తీసుకు వచ్చాడు. ఆయనకు మా నాయనతో పరిచయముంది. ఆయన సాయంతో ఆ చుట్టు పక్కల నాలుగిళ్ళలో వాడికి వారాలు ఏర్పాటు చేయించాడు.మా ఇంట్లో వరండాలో ఉండేవాడు. వేణుగోపాలరావుగారే వాడిని స్కూలులో చేర్పించాడు. అవసర పడినప్పుడు డబ్బు పంపేవాడు. మేం ఎస్ ఎస్ ఎల్ సి లో చేరేవరకూ వచ్చేవాడు. వాడి తెలివితేటలు చూసి మా నాన్న ముచ్చట పడిపోయాక వాడి చదువు విషయం మా నాయనే శ్రద్ధ వహించాడు. ఆ తర్వాత నేనెప్పుడూ వేణుగోపాలరావుగార్ని చూడలేదు."

ఆ రోజు విశాల మనస్సు ఎంతో ఉద్విగ్నమయి ఉంది, కామేశ్వరరావు మాటలతో. ఆమెకు తెల్సు ఆ తర్వాత తన తండ్రి ఎందుకు మళ్ళా అటువైపు వెళ్ళలేక పోయాడో. ఆయన బిజినెస్ పెంచే ప్రయత్నంలో ఉన్నాడు. తన అన్న ఇంటిని పట్టకుండా తిరుగుతూ వ్యసనాలన్నీ అలవాటు చేసుకోవటంతో ఆయన మనఃశాంతి కోల్పోయాడు. అన్నను బాగుచేసే పనిలో పడ్డాడు. సవతి బావమరదిని పట్టించకునే స్థితిలో లేడు.

అతను భోజనమై లేచాడు.

వెళ్ళబోతూ, "ఎల్లుండి తొమ్మిదో రోజమ్మా! నేను కర్మ మొదలు పెట్టాను. నువ్వు

కూడ శంకరంగారింటి కొస్తే బాగుంటుందనుకుంటాను. నీకు తెలియనిదేం లేదు. పదోరోజు కార్యక్రమంకూడ ఉంటుంది" అని చెప్పి వెళ్ళి పోయాడు.

## 7

ఆ రోజు సాయంత్రం విశాల అన్న, రంగనాథం, ఫోను చేశాడు:

"బావగారు పోయార్ట కదా? వార్త తెలిసినప్పటినుండి ఫోను చేద్దామనుకుంటూనే ఉన్నాను. కుదరలేదు. నేను కూడా రిటైరయ్యాను కదా? నేనూ హైదరాబాదులోనే సెటిలవుదామని అనుకుంటున్నాను. రేపు ఫ్లయిటులో వస్తున్నాం. సామాను ట్రాన్‌పోర్టులో తర్వాత వస్తుంది. పెద్దాడు బెంగుళూరులో ఉన్నాడు. పిల్ల ముంబయిలో మొగుడితో కాపురం చేసుకుంటోంది. అవునూ, కేశవమూర్తి నా కంటే చిన్నవాడే కదా? అప్పుడే రిటైరవటమేమిటే?"

"ఆయన నీ కంటే పెద్ద వారేమోలే! అయినా, ఆయన వయసు నీకేం తెలుసు?" అంది విశాల.

"భలే దానివిలే! నాకు తెలియకపోవటమేమిటి? చిన్నప్పుడు పీలగా ఉండేవాడు. ఆటలో ఓసారి చావ చితక్కొట్టా కూడ. వెధవ, వెళ్ళి అమ్మకుకూడ కంప్లయింటు చేయలేదు. నువ్వప్పుడు బాగా చిన్నదానివిలే. అంత స్తబ్దుగా ఉండే మనిషి అంత పెద్ద ఆఫీసరెలా అయ్యాడో నా కర్థం కాని విషయం."

"చిన్నప్పుడా? చిన్నప్పుడు కూడ ఆయన నీకు తెల్సా?"

"నీ మొగుడు చెప్పలా? భలే మనిషిలే! అతడెవరనుకున్నావు! అమ్మకు సవతి తమ్ముడు. అంటే మన తాతకు, ఆయన రెండో పెళ్ళానికీ పుట్టిన పుత్ర రత్నం. ట్రయిను ఏక్సిడెంటులో వాళ్ళ అమ్మా, నాయనా పోయాక, మనమే దగ్గర బంధువులం కనుక నాన్న అతణ్ణి మన ఇంటికి తీసుకొచ్చాడు. 'అడ్డమయిన సంతనూ నేను పెంచలేనే'ని అమ్మ అప్పుడే నాన్నకు గట్టిగా చెప్పేసింది. ఆ తర్వాత నాన్న అతడిని తీసుకెళ్ళి ఏదో అనాథాశ్రమంలో చేర్పించాడని అమ్మ చెప్పింది. నేను క్రితం సారి వచ్చినప్పుడే అతణ్ణి గుర్తు పట్టాను. అతడి పేరు నాకు బాగా గుర్తు. 'ఆ కేశవమూర్తివి నువ్వేనా?' అని అడిగాను. మనకు మేనమామ కదా, ఆ చనువుతోనే యాభయి వేలు చేబదులు కడిగితే, లేదని చెప్పి ముష్టి ఇరవై వేలిచ్చాడు. నువ్వేమయినా అనుకో, నాకు నిజంగా కష్ట మేసిందనుకో. మళ్ళీ మీ ఇంటికి రాకూడదనిపించింది. అందుకే రాలేదు కూడ. సరే, మనిషి పోయాక, అతడిని గురించి చెడుగా చెప్పుకోకూడదు. ఎంతయినా నా చెల్లెలి మొగుడు. అతడు పోయి నందుకు

నాకు నిజం గానే బాధ అనిపిస్తోంది. కామేశ్వరరావు చెప్పాడు. తనే కర్మ చేస్తున్నాడట! నేను వచ్చేస్తున్నాను. నువ్వింక నిశ్చింతగా ఉండు. అన్నీ నేను నిభాయించుక వస్తానుగా!" అన్నాడు.

"అమ్మమ్మ బతికుండగా, మరో పెళ్ళి ఎందుకు చేసుకున్నాడు తాతయ్య" అని అడిగింది విశాల అన్నను.

"ఆ రోజుల్లో ఏముందే? ఇప్పటిలాగ కాదుగా? తాతయ్య ఆస్తి పరుడు కాదు. వంశం, సంప్రదాయం చూసుకుని, బీదవాడయినా ఫర్లేదని తాతయ్యను ఇల్లరికం తెచ్చుకున్నాడు అమ్మమ్మ తండ్రి. గంగవరంలో స్కూలు మాష్టరు ఉద్యోగం చేసేవాడు ఆయన. 'మన తాహతుకు సరయిన ఉద్యోగం కాదు వదిలెయ్యమ'ని అమ్మమ్మ తండ్రి తాతకు చెప్పాడట! 'మాది పెద్ద సంసారం. నేను సంపాదించి పంపితేనే వాళ్ళు బతకటం కష్టమవుతోంది. నేను ఉద్యోగంమానలేను' అన్నాడట! 'మా నాయన మాటే కాదంటావా?' అని భీష్మించుకు కూర్చుంది మన అమ్మమ్మ. అప్పటికే అమ్మ పుట్టింది. అంతలో వాళ్ళ నాయన పోయాడు. కర్మకాండలకని వెళ్ళినాయన మళ్ళా రాలేదు. రాయబారాలు నడిచాయి. 'అదే నా ఇంటికి కాపురానికి రావాల'ని తాత మంకు పట్టు పట్టి కూర్చున్నాడట! 'అట్లా వీల్లేదు. నువ్వు ఇల్లరికం ఉంటానంటేనే నీ బోటి నిర్భాగ్యుడికి నా కూతుర్నిచ్చి దాని గొంతు కోశాను. నువ్వు ఎలా నా ఇంటికి రావో చూస్తాను' అన్నాట్ట అమ్మమ్మ తండ్రి. ఆయన డబ్బున్న ఆసామి. తాత నౌకరీ పీకించాడు. ఇంక నువ్వే దిక్కంటూ వస్తాడనుకునాడు. ఆయన మొండి మనిషి. ఆ తర్వాత ఆయనెలా బతికాడో అమ్మకు కూడ తెలీదు. మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడని మాత్రం తెలుసు. ఆ దిగులుతోనే అమ్మమ్మ కూడ తన తండ్రి పోయిన కొద్ది కాలానికే చనిపోయిందని అమ్మకు తన తండ్రి అంటే మంట! ఆయన తన రెండో పెళ్ళాంతో రైలు ప్రమాదంలో మరణించి నందుకు ఏ మాత్రం బాధ పడలేదు. తన తల్లి ఉసురు పోసుకున్నందుకే దరిద్రపు చావు చచ్చాడంది.నిజమే కదా! 'వీడు కూడ చచ్చి ఉండాల్సింది. పాపిష్టి పుటక పుట్టాడు. ఈ తద్దినాన్ని నేను నా కొంపలో ఉంచుకో లేను. వాడిని ఏ అనాథాశ్రమంలోనో చేర్పించు' అంది అమ్మ. దారిన పోయే తద్దినాన్ని నెత్తికెత్తుకునే మనిషి నాన్న. కేశవమూర్తిది కూడ గట్టి పిండం. రైలు ప్రమాదంలో తల్లీదండ్రీ పోయారు కానీ ఇతను బతికాడు. నీ మొగుడని తెలిశాక వివరాలన్నీ అడిగాను. గుట్టు మనిషి. చెప్పలేదు. 'అవన్నీ ఇప్పుడెందుకు లెండి. మీరు వచ్చారు, సంతోషం' అన్నాడు అంటీముంటనట్టు. నాకు మాత్రమేం, నేనూ ఆపైన ఆ ప్రస్తావనే చెయ్యలేదు. సర్లే, వస్తానుగా, వివరంగా మాట్లాడుకుందాం" అని ఫోను ఆఫ్ చేశాడు.

అప్పుడు విశాలకు నిర్ధారణ అయింది. తను తన తండ్రి పేరు చెప్పినప్పటి నుండే కేశవమూర్తికి తనెవరో తెలుసు. మరుభూమి లాంటి తన జీవితంలో, ఎవరు ఏ మాత్రం ప్రేమ చూపినా అతడు మరచిపోడు. జీవితాంతం కృతజ్ఞుడై ఉండి పోతాడు. అందుకే తన చిన్నతనంలో తన తల్లి చూపిన నిరాదరణను కూడా మర్చి పోయి, తన తండ్రి ఆదరణను గుర్తుంచుకుని, తమకు సాయం చేయ ప్రయత్నించాడు. తనతల్లి అతన్ని గుర్తు పట్టలేదు. ఏ బంధుత్వాలనూ గుర్తు చేసే మనస్తత్వం అతనిది కాదు.ఆపైన తనంటే అమ్మకు ద్వేషం అనీ అతనికి తెలుసు. అందుకే అతను తనెవరో అమ్మకు చెప్పలేదు, అతనెవరో అమ్మకు తెలియదు. చిన్నప్పుడెప్పుడో చూసిన ఆమెకు అతన్ని గుర్తు పట్టగలిగే అవకాశం లేదు. తనకు నిజంగానే పెళ్ళి సంబంధాలు చూడ ప్రయత్నించాడతను. తన మూర్ఖత్వంతో ఏదీ సానుకూల పడలేదు. గత్యంతరం లేని పరిస్థితిలో తన్ను వివాహ మాడాడు. తనపట్ల అతనికి లాలస ఉన్నట్లు అతనే ఒప్పుకున్నాడు. విధురుడు, స్త్రీ పట్ల ఆసక్తి చూపటం తప్పుపట్టాల్సిన విషయంకాదు. తన విముఖత నతడు గమనించాడు. దాన్ని మన్నించాడు. అంతలోనే మృత్యువు అతనితో స్నేహం చేయటానికొచ్చింది. తన కష్టాన్ని గూర్చి అతనెవరికీ చెప్పుకోలేదు. ఎవరి కష్టాలూ మరొకరికి పట్టవని అతడు చిన్నప్పుడే పాఠం నేర్చుకున్నాడు. పోతూ కూడ చంద్రగిరి వేణుగోపాలరావుగారి కూతురు, బహుశః తన భార్య కూడ నేమో, కష్టాలతో జీవితం గడప కూడదన్న ఉద్దేశంతో, ఫామిలీ పెన్షను ఏర్పాట్లు చేశాడు. ధనహీన, దీన జీవితంలోని బాధ అతనికి తెలుసు. తనలా బతక కూడదని ఆ ఏర్పాటు చేసి వెళ్ళిపోయాడు.

అలా ఆలోచిస్తూవుంటే ఆమె మనసు శోక తప్తమయింది. మర్నాడు రంగనాథం, వదిన తాయారు విశాల ఇంటికొచ్చేటప్పటికి పన్నెండు గంటలయింది.

"అన్నగారు పోయిన విషయం తెల్సి ఆయన ఎంత ఇదయ్యారనుకున్నావు, విశాలా! చెప్తే నువ్వు నమ్మవుగానీ. వెంటనే బయలుదేరి వచ్చేస్తానని అన్నారు. 'ఎట్లాగో రెండు రోజుల్లో ప్రయాణం పెట్టుకున్నాం. వెళ్దాం లెండి. మీరు తొందర పడినందు వల్ల పోయిన మనిషి తిరిగి రారు అని నేనే ఆపాను" అంది తాయారు.

"బావుందే, అది నాకు తోడ బుట్టింది. దాని కష్టం నాది కాదూ? మీ అక్కకు ఒంట్లో బాగుండక ఆసుపత్రిలో చేరితే నువ్వు లబలబలాడుతూ హైదరాబదుకు పరుగెత్తుకు రాలా?" అన్నాడు రంగనాథం.

"నువ్వు హైదరాబాదు వచ్చినట్టే తెలియదు, వదినా? నీకు తీరిక లేకపోతే కనీసం నేనయినా వచ్చేదాన్ని కదా!" అంది విశాల.

"నాకయితే మనసు కొట్టుకు పోయిందనుకో, నిన్ను చూడలేక పోయానని. హైదరాబాదు కొత్త. ఎవరయినా తీసుకు రావాలి. ఎవరి పనులు వాళ్ళకు. నన్ను వెంటపెట్టుకు తీసుకొచ్చే తీరికెవరికీ ఉండదు. అందుకే రాలేక పోయాను" అంది తాయారు.

తన అన్న, వదినలు చూపే ప్రేమ పట్ల విశాల మనసు ఓ క్షణం శంకాకులిత మయింది. ఇదివరకులా తనఅన్న పట్టనట్లు ఉంటే ఆమె ఇబ్బంది పడకపోయేది. వాళు ్ళ రావటం తనకు ఇష్టం లేదు. కానీ అన్నను రావద్దని చెప్పలేక పోయింది. ఇలాంటి పరిస్థితిలో తన భర్త అయితే ఏం చేస్తాడా అని ఆలోచించింది. వెంటనే ఆమెకు మార్గం గోచరించింది. ఎదుటి వ్యక్తుల స్వభావం తెల్సినా, కేశవమూర్తి వారితో మృదువుగానే ప్రవర్తిస్తాడు. వాళ్ళు అతన్ని తమ అనుకూలతకు ఉపయోగించాలని చూసినా చివరవరకు సహిస్తాడు.

భోజనాలయాక "ఏవయినా చెయ్యాల్సిన ఏర్పాట్లుంటే చెప్పు, చేసేస్తాను" అన్నాడు రంగనాథం.

"మనం చెయ్యాల్సిందేం లేదన్నయ్యా! ఏర్పాట్లన్నీ కూతురు చేస్తోంది. మనం ఆ రెండు రోజులూ వెళ్ళి వస్తే సరిపోతుంది" అని చెప్పింది విశాల.

"అదేమిటే, అట్లా ఎట్లా ఒప్పుకున్నా? తెంపి పొయ్యటానికి మనమూ, హక్కులకు వాళ్ళా? నేను కనుక్కుంటానుండు. ఆ కామేశ్వరరావు నెంబరు చెప్పు. నాలుగూ ఝాడిస్తాను" అన్నాడు మొబైల్ తీసి చేతిలో పట్టుకుంటూ.

"ఇందులో నేను ఒప్పుకున్నదేమీ లేదు. ఆ పిల్ల నన్ను అడగా లేదు. తన తండ్రి తన స్వంతం అని ఆ పిల్ల ఎప్పుడూ అనుకుంటుంది. తండ్రి దినవారాలకు భారీగా ఏర్పాట్లు చేస్తోందని కామేశ్వరరావుగారు చెప్పారు. చెయ్యనీ. అంత డబ్బు మన దగ్గర లేదు. చేసే సంతనా లేదు. అసలాయనకు ఏదీ భారీబారీగా చెయ్యటమిష్టముండేది కాదు. నువ్వు ఇందులో ప్రమేయం కల్పించుకోకు."

"సంతన లేదనకు. నేను లేనూ? అయితే, నువ్వు చెప్పిందీ కరెక్టే. ఆ డబ్బు దండగేదో వాళ్ళే పెట్టుకుంటారు. పెట్టుకోనీ" అన్నాడు రంగనాథం.

తన ఆలోచనలకూ, అన్న అభిప్రాయాలకూ లంగరందదని ఆమెకెప్పటి నుండో అనుభూతమే కానీ 'అన్న' అన్న అభిమానం ఆమె కళ్ళనెప్పుడూ కప్పేస్తుంటుంది.

భానుమతి ఇంటికి వెళ్ళటం ఆమె కంత ఇష్టం లేదు. ఆ పిల్ల తన మనసు కష్టపడేట్టు మాట్లాడితే తను తట్టుకోలేదు. ఈ సందర్భంలోనూ తన భర్త ఆలోచన పరిగణనలోకి

తీసుకుంది. తన మనసుకు కష్టం కలుగుతుందని అతడు నిజాన్ని ఎదుర్కోకుండా పారిపోడు. తనకు కీళ్ళజబ్బు వచ్చి, డాక్టరేం చెప్తాడో అన్న భయంతో తను డాక్టరు దగ్గరకు వెళ్ళనని మొండికేస్తే, "భయపడిపారిపోతే, కీడు తొలగిపోతుందా? వాస్తవాన్ని ఎదుర్కోకుండా ఎక్కడికి పారిపోతాం? మనకిష్టమున్నవే కాదు, ఇష్టంలేనివీ జరుగుతాయి జీవితంలో" అన్నాడు కేశవమూర్తి. "నా కలాంటి భయాలేంలేవు. ఇష్టంలేనివి చాల చూశాను నేను జీవితంలో" అంది తను. అప్పటి తన ఉద్దేశం అతను తన విషయంతో జోక్యం చేసుకోవటమని.'

ఇప్పుడింక అతని ఆలోచననే అమలు పెట్ట నిశ్చయించుకుంది ఆమె. తొమ్మిదో రోజు పొద్దున్నే వచ్చి కామేశ్వరరావు విశాలనూ, ఆమె అన్నా, వదినలనూ వెంట పెట్టుకుని భానుమతి ఇంటికి తీసుకెళ్ళాడు. ఆమె వాళ్ళకు ఆహ్వానమూ పలకలేదు, విరసమూ ప్రదర్శించలేదు. వాళ్ళకు ప్రత్యేకంగా ఒక గది మాత్రం కేటాయించింది.

శంకరం మంచి సంపాదన పరుడు. అన్ని హంగులు ఉన్న పెద్ద ఇల్లు కట్టుకున్నాడు. మాడరన్ గాడ్జెట్లూ, కారూ చూశాక శంకరం, అతని భార్యా చాల మంచివాళ్ళనిపించింది రంగనాథంకు. భానుమతితో పాత బంధుత్వం కలుపుకో ప్రయత్నించాడు.

"నీకు తెలుసో, లేదో కానీ అమ్మాయి, మీ నాన్న ఎవరనుకున్నావు?" అన్నాడు.

ఆ పిల్ల వెంటనే అలర్ట్ అయిపోతూ, "ఎవరు?" అనడిగింది.

"మా అమ్మకు సవతి తమ్ముడు కాదూ?" అంటూ ఆ వివరాలన్నీ చెప్పసాగాడు.

"అట్లా చెప్పండి. ఆ సంబంధం కలుపుకునే మా నాన్నను వలలో వేసుకున్నారన్న మాట! పాపం, ఇప్పటి దాకా నేను మా నాన్నే మీ చెల్లెలు ప్రలోభంలో పడి పోయారను కున్నాను. అయితే, మీ అమ్మగారు తను చెప్పుకున్నంత అమాయకురాలేం కాదు" అంది.

ఆ మాటతో రంగనాథం అప్రతిభుడయ్యాడు. ఆ పిల్ల తన్ను మించిన దనుకున్నాడు.

"అమాయకురాలు కాక పోవటమేమిటి? నువ్వన్నా, మీ ఆయనన్నా ఎంత మురిసి పోయేదనుకున్నావు! సొంత మనవరాలూ, మనవడూ అన్నంత ఇదిగా పొంగిపోయేది" అని సర్దుకున్నాడు.

"అట్లాగా? మంచిదే" అని మూతి తిప్పుకుంటూ భానుమతి వేరే గదిలోకి వెళ్ళి పోయింది.

తండ్రి అంత్యక్రియలను భానుమతి ఘనంగానే నిర్వహించింది. బ్రాహ్మణులకు భూరిదానాలిచ్చింది. ఆమెకు నిజంగానే తండ్రి అంటే ఎంతో ప్రేమ. తల్లి పోయాక,

అతడే తల్లీదండ్రీ అయి ఆమెను పెంచాడు.ఆ ప్రేమలో అతనికి ఊపిరి సలుపనీయ లేదు ఆమె. తన తండ్రితో తను ఎలాగయినా వ్యవహరించ వచ్చని భావించి ఆమె దెబ్బతింది.

పెళ్ళికి రాలేక పోయాడు కానీ, పదో రోజున తాడు తెంపుకుని విధవ అయిన చెల్లెలికి పుట్టింటి తరపున తెల్ల చీర మాత్రం తీసుక వచ్చాడు రంగనాథం.

పన్నెండో రోజు అన్నా, వదినలతో పాటు తన ఇంటికి వచ్చేసింది విశాల. రెండు రోజులుగా ఎలా విషయం కదపాలా అని మల్లగుల్లాలు పడ్డాడు రంగనాథం.

మర్నాటి నుండి విశాల ఆఫీసుకు వెళ్ళాలి.

ఆ రోజు సాయంత్రం, సాహసించి, రంగనాథం, "ఎందుకే ఆ ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగం! మానెయ్య రాదూ?" అన్నాడు చెల్లెలితో.

"మానేసి ఏం చెయ్యాలి?"అంది విశాల, ఆశ్చర్యపోతూ.

"ఏం చెయ్యటమేమిటి? బిజినెస్ చేద్దాం."

"ఏం పెట్టి?"

"అంత అమాయకంగా మాట్లాడతావేమిటే? మీ ఆయన నీకేం డబ్బివ్వలా?"

"ఏదో కొద్దిగా ఇచ్చారు. ఈ ఇల్లు ఇచ్చారు, చాలదా? ఫామిలీ పెన్షనూ వస్తుంది. ఉద్యోగం మానేసినా నాకే ఇబ్బంది లేకుండా ఆయన ఏర్పాటు చేసే పోయారు."

"గొప్పగా చెబుతున్నావే. మొగుడు ఛస్తే, ఇల్లు పెళ్ళానికి గాక ఎవరికి వస్తుంది! పెళ్ళానికి వచ్చేది కనుకే దాన్ని ఫామిలీ పెన్షనన్నారు. కూర్చుని తింటే కొండ లయినా కరిగి పోతాయి. అందుకే నేను బిజినెస్ చేద్దామంటున్నాను."

"నా దగ్గర డబ్బు లేదు. బ్యాంకులో ఓ యాభై వేలున్నాయేమో. నేను బిజినెస్ చేసి సంపాదించి ఎవరికి పెట్టాలి కనకా? ఆ సంగతి వదిలెయ్యి అన్నయ్యా!" అంది విశాల.

అప్పటికి రంగనాథం ఊరుకున్నాడు. కానీ మరో రోజు సాయంత్రం విశాల ఆఫీసునుండి వచ్చాక విషయం కదలేశాడు.

"అవునే, బ్యాంకులో యాభై వేలు మాత్రమే ఉన్నాయంటావు! మీ ఆయన చేసిందేమో సబ్ కలెక్టరుద్యోగం. సంపాదించిన దంతా ఏం చేశాడు? ఎప్పుడూ తైనాతి లాగ వెంట ఉంటాడుగా, ఆ కామేశ్వరరావుగాడు మింగేశాడేమో? లేకపోతే కూతురికి దోచిపెట్టాడేమో?"

"ఆయనకు లక్షరూపాయలు మాత్రం ఇచ్చారట! అది కామేశ్వరరావుగారే చెప్పారు నాకు. ఇంక కూతురి విషయం మనకనవసరం. ఆ పిల్ల తండ్రి ఆస్తికి హక్కుదారు. తింటేతింటుంది. మాట్లాడే హక్కు మనకు లేదు."

అలా విశాల అన్నాక కూతురి మాట ఎత్త లేదు కానీ, కామేశ్వరరావుకు లక్షరూపాయలు చెందటం అతను జీర్ణించుకోలేక పోయాడు.

"లక్ష రూపాయలే? వాడు చెప్పినా నువ్వు చెవులు లటలటలాడిస్తూ వింటూ కూర్చున్నావన్నమాట! రానీ వెధవను, ఆ లక్షను కక్కించక పోతే నా పేరు రంగనాథం కాదు."

తన అన్న తన భర్త స్నేహితుడి పట్ల అమర్యాదగా మాట్లాడటం ఆమెకే మాత్రం రుచించలేదు. గట్టిగా చెప్తే, ఎన్నో రోజులకు తన ఇంటికి వచ్చిన తన అన్న మనసు కష్ట పెట్టుకుంటాడేమోనని ఆమె పస్తాయించింది.

"ఆ డబ్బు ఆయన తన స్నేహితుడికి తన ఇష్ట పూర్వకంగా ఇచ్చింది. నువ్వు ఆ డబ్బు గురించి కామేశ్వరరావుగారిని అడగొద్దు. బాగుండదు" అంది గట్టిగానే.

"బావుందే! మనకు రావలసిన డబ్బూ రాబట్టుకోక, డబ్బూ మదుపు పెట్టలేని స్థితిలో మనం బిజినెస్ ఏం చేయగలం. పోనీ ఓ పని చేద్దాం. నువ్వు సెంటిమెంటు పట్టుకు కూర్చుంటే లాభం లేదు. వినాయకుడదే చెప్పేవాడు. మనవాళ్ళు పాతకాలపు ఆలోచనలలో కొట్టుమిట్టాడుకు పోతున్నారు. వీళ్ల పైకి వచ్చేది కల్ల అని." వినాయకరావు రంగనాథం కొడుకు.

విశాలకు ఆ సంభాషణ అసలు నచ్చలేదు.

మొహమాటానికి "ఏమిటో చెప్పు" అంది.

"ఈ ఇల్లు మంచి సెంటర్లో ఉంది. అమ్మేద్దాం. పది లక్షలయినా వస్తుంది."

విశాల విస్తు పోయింది. అంతలో ఆమెకు సాంత్వన చెబుదామని రామానుజం అక్కడికి వచ్చాడు. అతడు తలుపు తట్టటంతో రంగనాథం వెళ్ళి తలుపు తెరిచాడు. "ఎవరండీ, ఏం కావాలి?" అని అడిగాడు రంగనాథం అతనిని.

"విశాల గారిని పలకరించి వెళ్దామని వచ్చాను" అన్నాడతను.

"విశాల అన్నను నేను. మీరేమనుకోక పోతే ఒక మాట! అమ్మాయి మొగుడు పోయి పక్షం రోజులు లయిందేమో! ఇలా వాళ్ళూవీళ్ళూ- అహః మీసంగతి కాదు- వస్తూ పోతూ ఉంటే నలుగురూ నాలుగు రకాలుగా అనుకోటం దానికి మంచిది కాదు. నేను సహించలేను. మళ్ళీ ఎప్పుడూ ఇటుకేసి రాకండి" అన్నాడు.

అతని మొహం వివర్ణమయింది. అతను వెళ్ళిపోదామని వెనక్కి తిరుగుతున్న క్షణంలో, అన్నచెప్తున్న మాటలు వింటూనే విశాల బయటకు వచ్చింది, "అయ్యో! మీరా, రామానుజంగారూ? రండి. మా అన్నయ్య మాటలు పట్టించుకోకండి. చాదస్తం" అంటూ అతని చేతిని పట్టుకుని, "పోన్లేండి. ఏదో మాట్లాడుకుంటునట్టు ఉన్నారు. మళ్ళీ వస్తాను" అని అతను అంటున్నా వినకుండా లోపలకు తీసుకెళ్ళింది విశాల.

అయితే, రంగనాథం అంత తేలిగ్గా ఓటమి అంగీకరించే మనిషి కాదు. తనూ వెళ్ళి రామానుజం పక్కన మరో కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

"అయితే, మీరు విశాలకు బాగా కావల్సిన వాళ్ళేనన్న మాట! ఎవరో పనిలేనివాళ్ళు పలకరింపులంటూ కాలక్షేపం చెయ్యాలని వచ్చారనుకున్నాను. మీరు చెప్పండి. ఎంతకాలం, ఆ ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగం! మానెయ్య మంటే నా మాట వినదు. మీరయినా చెప్పండి" అన్నాడు.

"ఆమెకెప్పుడూ ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేదు. కాలక్షేపానికి చేస్తున్నారు" అన్నాడు రామానుజం.

తన చేతిని పట్టుకుందంటే ఆమెకు తన అవసరమేదో ఉందని అతని కర్థమయింది కానీ, అక్కడ ఆమె అన్న ఉండగా తను చెయ్యగల సాయ మేమిటో అతని కర్థం కాలేదు.

"అందుకు ఈ బోడి ఉద్యోగమే చెయ్యాలా? బిజినెస్ చెయ్యోచ్చుగా? డబ్బెక్కడి దంటుంది. ఈ ఇల్లు ఉంది. ఎందుకూ? డెడ్ కాపిటల్! దీన్ని అమ్మేసి వ్యాపారంలో పెడితే ఇబ్బడి ముబ్బడిగా సంపాదించొచ్చు. ఆ మాట చెబితే దానికి నచ్చినట్లు లేదు."

ఆమె తననుండి కోరుకున్న సాయమేమిటో రామానుజానికి అర్థమయింది.

"అయితే, మీకు మంచి అనుభవ ముందన్న మాట బిజినెస్‌లో?" అని అడిగాడు.

"మరి, ఆర్మీలో పదిహేనేళ్ళు చేసి రిటైరయ్యాక నేను చేసిందేమిటనుకున్నారు! ఓ హోజియరీ షాపులోపని చేశాను. పేరుకు జర్నయిల్ సింగ్ ప్రొప్రయిటరే కానీ మొత్తం మానేజి చేసింది ఎవరనుకుంటున్నారు? నేను. ఆ పనే మన ఆంధ్ర ప్రదేశ్‌లో చేసుకుంటే మనదేశం, మనవాళ్ళు బాగుపడి పోతారని ఇక్కడ అదే బిజినెస్ స్టార్ట్ చెయ్యాలను కుంటున్నాను."

"అయితే, ఇప్పటికే కొన్ని కోట్లయినా సంపాదించి ఉండాలి మీరు!"

"సంపాదించాను. అయితే, ఆ సిక్కువాడి కోటుజేబులోకి పోయాయి..."

"సహజమే లెండి. అతని పెట్టుబడి మీది లాభాలు అతనికే పోయాయి. మీకు కూలి దక్కింది. ఒకవేళ మీ చెల్లెలు పెట్టుబడితో మీరు బిజినెస్ ప్రారంభించినా మీకు కూలేగా దక్కేది. అంతకంటే మీరే స్వంతంగా ఆ బిజినెసేదో ప్రారంభిస్తే ఆ కోట్ల లాభాలు మీకే దక్కుతాయి" అన్నాడు రామానుజం.

రామానుజం 'కూలి' అని ఒకటి, రెండు సార్లు అనటంతో రంగనాథంకు ఒళ్ళు

మండిపోయింది.

అయితే, అది బయటకు వ్యక్త పరచకుండా, "నా డబ్బయితే ఒకటీ, నా చెల్లెలి డబ్బయితే ఒకటీనా? దాని డబ్బు నాదీ, నా డబ్బు దానిదీ. మాలో మాకు ఆ అరమరికలు లేవు" అన్నాడు.

"అది చిన్నప్పటి మాట లేండి. ఇన్నేళ్ళు గడిచినాక అది అయ్యే పని కాదు...." కామేశ్వరరావు ఎప్పుడు వచ్చాడో, ఈ సంభాషణ వింటున్నాడో కానీ, "ఇప్పుడు ఆమెకు బిజినెస్ ఎందుకు లేండి. ఆమె బతుకు ఆమెను బతకనివ్వండి. ఇలాంటివి వాడికీ ఇష్టముండవు" అన్నాడు.

"వాడా, వాడెవడు?" అనడిగాడు కోపంగా రంగనాథం.

చెల్లెలు చెప్పి నప్పటి నుండి తన డబ్బే లక్ష రూపాయలు పోయినట్లు అతని పట్ల అక్కసుతో ఉన్నాడతను.

"కేశవమూర్తి" అని చెప్పాడు కామేశ్వరరావు.

"నువ్వు ఓ ఆర్డర్లీ వెధవ్వి, మా బావగారిని దోచుకుతిన్న వెధవ్వి! ఆయన్ని పట్టుకుని 'వాడు', 'వీడు' అంటావా? 'వాడు' కాదు 'ఆయన' అను, మర్యాద దక్కించుకోవల్నంటే."

కామేశ్వరరావు మొహం చిన్నబోయింది. తనా సంభాషణలో ఎందుకు జోక్యం చేసుకున్నానా అన్పించింది అతనికి.

"వాళ్ళిద్దరూ చిన్నప్పటి స్నేహితులులేండి. వాళ్ళలాగే పిల్చుకునేవారు. ఆ చనువుతోనే కామేశ్వరరావుగారు అలా అన్నారు. అందులో ఆయన మీ బావగార్ని అవమానించిందేం లేదు" అన్నాడు రామానుజం.

"ఛీ, ఛీ కొంప బజారయి పోయింది. ఒక్క విషయం గోప్యంగా చర్చించుకోటానికి వీలు లేదు. ఆ మనిషి ననాలి. కొంపలోకి నానా సంతా తెచ్చేవాడు. అది ఆనవాయితీ అయిపోయింది" అన్నాడు రంగనాథం తన అక్కసునంతా కేశవమూర్తి మీద చూపెడుతూ.

ఈ వ్యవహారం అంతా చూస్తున్న విశాల కడుపుడికి పోయింది. తన అన్న ఎందుకు తన ఇంటికి వచ్చాడో ఆమెకు స్పష్టంగా తెలిసిపోయింది. ఇలాంటి పరిస్థితిలో తన భర్త కూడ చూస్తూ ఊర్కోడు. ఎప్పటి తనే అయినట్లయితే అసలింతదాకానూ రానిచ్చేది కాదు.

"మరి, బంధువులంటూ వచ్చిన వారందరి బిజినెస్‌లో మదుపు పెట్టే ఆనవాయితీ లేదు ఆయనకు. అలాంటి వారిని ప్రోత్సహించ వద్దనేవారు ఆయన. ఆమాటే చెప్పారు కామేశ్వరరావుగారు. అందులో తప్పేంవుంది?" అనడిగింది విశాల సౌమ్యంగానే.

"అంటే, నీ డబ్బు తింటానికి వచ్చాననుకుంటున్నావా?" అన్నాడు రంగనాథం కళ్ళెర్రజేస్తూ.

"మరి, ఇన్నేళ్ళ తర్వాత, ఆయన పోయాక నువ్వు నాకొచ్చి చేసే మంచేమిటో? నువ్వు అప్పుడు ఇరవైవేలు పట్టుకెళ్ళావు చూడు. అది ఆయన వెంటనే మర్చిపోయారు. పన్నెత్తి నువ్వు తిరిగి ఇవ్వలేదనలేదు. నీ చెల్లెల్నికనుక- నీ లక్షణాలు పంచుకున్నదాన్ని కనుక- నేనే నీకు ఉత్తరం రాశాను, డబ్బు పంపమని. నువ్వు నాకు గానీ, అమ్మకుగానీ ఏం చేశావో చెప్పు. ఆయన పోయారు కనుక, ఆడదాన్నికనుక, నువ్వు చెప్పిన దల్లా వింటాననీ, నా డబ్బు తిన వచ్చనీ వచ్చావు. ఆయన పోయారు కానీ ఆయన స్నేహితులున్నారు. ఆయనే ఎప్పుడూ నన్ను వాళ్ళతో మాట్లాడవద్దు, వీళ్ళతో మాట్లాడవద్దు అని నాకు ఆంక్షలు విధించలేదు. ఇప్పుడు నేను రామానుజంగారితో మాట్లాడితో నలుగురూ నానా రకాలుగా చెప్పుకుంటారా? వీరిద్దరూ మాకుటుంబానికి మిత్రులు. వాళ్ళని నువ్వు ఇవ్వాళ అవమానించాలని చూశావు. తప్పు పని చేశావు. ఆయన సహించని పని చేశావు. నీకీ ఇంట్లో ఉండే అర్హత లేదు. నువ్వీ క్షణం నా ఇంట్లో నుండి వెళ్ళిపోతే నేను సంతోషిస్తాను" అంది మహా కటువుగా విశాల.

రంగనాథం చెల్లెలి వంక అగ్గి కురిపిస్తూ చూశాడు.

అరుస్తూ భార్యను పిల్చాడు, "పద, మనమీ కొంపలో క్షణం ఉండొద్దు. ముండమోసినా దానికి పొగరణగలేదు. అది అరచి చచ్చినా నేనీ కొంపలో మళ్ళా అడుగు పెట్టను..." అంటూ నోటి కొచ్చింది రబ్బుకుంటూ, ఇంట్లోకి పోయాడు.

లుంగీ, చొక్కాకూడ మార్చుకోకుండా రెండు చేతుల్లో పెట్టెలుపట్టుకుని, వచ్చాడు.

"మా బాగా అయింది. ఇంతోటి సౌదుబ్యానికి మా చెల్లెలు, మా చెల్లెలు అంటూ పడి వచ్చావు. కొత్త దోస్తీలూ, కొత్త మిత్రులు, మనం కనబడేట్టున్నామా?" అంది తాయారు విరసంగా మూతి తిప్పుకుంటూ.

భార్య వెంటరాగా, వెళ్ళిపోయాడు రంగనాథం విసవిసా నడుచుకుంటూ.

నిరాక్రె నిలబడిపోయారు రామానుజం, కామేశ్వరరావులు.

"క్షమించండి. నేను వచ్చి మీమధ్య పేచీ పెట్టినట్టున్నాను" అన్నాడు చిన్నబోతూ రామానుజం.

"మీరు పెట్టిన పేచీ ఏమీ లేదు. నిజానికి నన్ను రక్షించారు. ఉన్న ఈ ఒక్క ఆశ్రయాన్ని కూడ పోగొట్టుకుని చెట్టు కింద చేరేదా? ఇది రెండోసారి మీరు నా ఇంటిని నాకు

మిగల్చటం. స్వంత అన్నయ్యే నన్ను బజారుకీడ్చ చూస్తే, మీరు స్వంత అన్నయ్యల్లా కాపాడారు" అంది విశాల కళ్ళు చెమ్మగిల్లగా.

"నేను...నేను కేశవమూర్తిని 'వాడు' అనటం అగౌరవంతో కాదు. అతడు అన్నింటా నా కంటే ఉన్నతుడు- తెలివితేటల్లో, మేధస్సులో, దాతృత్వంలో, యమనియమాల్లో- అన్నింట్లో. నాకు జీవితంలో ఉన్నది వాడు...అతడొక్కడే. అతడంటే వాడు... అతడు... నానుండి దూరమవుతున్నట్టుంటుంది. నా స్వంతమయినదేదో పరాయిదయినట్లుండేది. నేను వేరేగా సంబోధించినా అతడూరుకునేవాడు కాదు. అది పొరపాటని ఇప్పటివరకు నాకు తెలియదు. సారీ!" అన్నాడు కామేశ్వరరావు.

"భలేవారే, కామేశ్వరరావుగారూ! మీరాయన్ని మరో విధంగా పిలిస్తే ఆయన్ని అవమానించటమే అవుతుంది. ఈ ప్రపంచంలో మీరు తప్ప ఆయన్నలా ఎవరు పిలవగలరు? అది మీ హక్కు! ఎవరో ఏదో అన్నారని మీరు మీ హక్కు వదలుకోవద్దు" అని చెప్పి కామేశ్వరరావు భుజం తట్టి, "పని ఉంది. మళ్ళీ కలుస్తాను" అని వెళ్ళిపోయాడు రామానుజం. అప్పటికి కొంత స్థిమితం చిక్కింది కామేశ్వరరావుకు.

అతడు చెప్పాడు, "నేను రాత్రికి హరిద్వార్ వెళ్ళిపోతున్నా నమ్మాయి! అది చెప్పాలనే వచ్చాను. వాడిని గురించి ఆలోచిస్తే, మీర్జా గాలిబ్ కవితొకటి నాకు గుర్తుకువస్తుంది. ఆయన చెప్పాడు:

'ప్రతిది సులభమ్ముగా సాధ్య పడదు లెమ్ము!
నరుడు నరుడౌట యెంతొ దుష్కరము సుమ్ము!'

(అను: దాశరథి) అని. వాడు మనిషిగా బతకటానికి ప్రతి క్షణం ప్రయత్నించాడు. మనిషిగా బతకటం ఎంత కష్టం. నీకు చెప్పకూడదనుకున్నా కానీ, మళ్ళీ మనం కలుస్తామో లేదో చెప్పే వెళ్తాను."

"ఏమిటది?" అడిగింది విశాల.

"ఓ రోజు కేశవమూర్తి నన్ను గంగకు తీసుకు వెళ్ళమని అడిగాడు. అప్పటికల్లా వాడు నడిచే స్థితిలో లేడు. నడిస్తే రొప్పుతున్నాడు. డాక్టర్లను అడిగాను. వాడి బతుకు కొద్ది రోజుల్లోనే ఉందని వాళ్ళకు తెల్సు. 'ఆల్ రైట్! లెట్ హిమ్ లివ్ ఏజ్ హి లైక్స్. హిహేజెంట్ మెనీ డేస్ టు లివ్' అని అనుమతించారు. అలాటి పేషెంట్లకు ఇన్ఫెక్షన్లు తేలిగ్గా సోకుతాయి. తనతో పాటు ఓ పుస్తకం పట్టుకొచ్చాడు. జట్కాలో వెళ్తూ 'అదేమిట'ని అడిగాను. 'నా బతుకులే' అని సమాధాన మిచ్చాడు. అదో ఎర్ర బౌండ్ నోట్ బుక్. వాడి డైరీ అనుకుంటాను. గంగనిండుగా ప్రవహిస్తోంది. నీళ్ళలో కాళ్ళు పెట్టి కూర్చున్నాడు.

'వద్దురా, జలుబు చేస్తుంది' అని అన్నాను. వాడు నవ్వాడు. తన చేతిలోని పుస్తకాన్ని తీసి నీళ్ళల్లోకి గిరవాటెట్టాడు. 'అదేంపని?' అని అడిగాను."వాడన్నాడు, 'నేను పోయాక కూడా నేను చేసిన పాడు పనులు నిలవాలా? కలుషహారిణి గంగలో అన్నీ కలసి పోతాయి. నీకు తెలియని నా జీవిత రహస్యం ఒకటి నీకు చెప్పేదా? నేను కూడా నీలాంటి మనిషినే. మనకు ఉద్యోగాలొచ్చాయి. నేను దుర్భర దారిద్ర్యంలో బతికాను.ఏ అతి చిన్న కోరికా తీర్చుకోలేని అశక్తతలో బతికాను. ప్రభుత్వ ఉద్యోగమొచ్చింది. పెళ్ళయింది. కోరికలు గుర్రాల్లా పరుగెత్తాయి. డబ్బు చాలలేదు. పదవిలో వున్న అవకాశాలను అమ్ముకోటం మొదలు పెట్టాను. లంచం పట్టటం మొదలెట్టాను. నన్నప్పుడు టెంపరరీగా రెవెన్యూ నుండి పీడబ్ల్యుడికి మార్చారు. ఏవో కారణాలు. నాకు గుర్తులేదు. అప్పుడు ఓ ఇర్రిగేషనుప్రాజెక్టు మొదలు పెట్టారు. ఇళ్ళకాలనీ కూడ శాంక్షనయింది. ఆ కాలనీకి నీటి సరఫరా కోసం ఓ పెద్ద టాంకు కూడా కట్టాం. ఆ టాంకుకు ఎదురుగా ఉన్న క్వార్టరులోనే నా నివాసం. పెద్ద ఇంజనీరు కింద పని చేశాను. అతనికీ డబ్బు దాహం ఎక్కువే. అయితే కొంత జాగ్రత్త పడేవాడు. డ్యాం విషయంలో చాల ఖచ్చితంగా ఉండేవాడు. కాలనీ విషయం అంతగా పట్టించుకునేవాడుకాదు. కంట్రాక్టర్లు అలాగే అతనికీ, సంధానకర్తనైన నాకూ ముడుపులుముట్ట చెప్పేవారు. పొరపాటు జరిగితే ఇరుక్కు పోయేది అతనే. కాలం పంచకల్యాణిలా పరుగులు తీస్తోంది. నాకు కూతురు పుట్టింది. రెండేళ్ళు దానికి. మళ్ళా నా భార్య గర్భవతి. ఇంక రెండు రోజుల్లో కాన్పుకు పుట్టింటికివెళ్తుంది. మేం అప్పటికింకా క్వార్టరులకు ట్యాపు కనెక్షనులు ఇవ్వలేదు. అవసరమైన స్టాఫు మాత్రమే ఆ క్వార్టరులలో సంసారాలతో ఉంటున్నారు. అవసరమయిన నీళ్ళు ఆ ట్యాంకు కింద ఉన్న కుళ్ళాయి నుండి పట్టుకెళ్ళేవాళ్ళు. ఆ రోజు పొద్దున్నే ఆడవాళ్ళందరూ వరసగా నీళ్ళు పట్టుకుంటున్నారు.పెద్ద దుర్ఘటన! ఒక్కసారిగా పిల్లర్లు ఓవర్ హెడ్ ట్యాంకు బరువుమోయ లేక కూలి పోయాయి, పడుతూ ఓవర్ హెడ్ ట్యాంకు విచ్చి అశనిపాతంలా క్షణంలో కింద నున్న జనం పై పడింది. జనం దానికింద పడి మరణించారు. సుమారుగా పదిహేనుమంది దాకా మరణించారు. వారిలో ఆడవారే అధికం. ఇరవై మంది దాకా గాయపడ్డారు.

"నేను వాడు చెప్పే మాటలు శ్రద్ధగా వింటున్నాను. వాడు ఓ క్షణం మాట్లాడలేక పోయాడు.'చెప్పూ' అనడిగాను. 'చెప్పటానికేం లేదు. నేను చూస్తూఉండగానే ఆ ట్యాంకు కింద పడి మరణించిన వాళ్ళలో నా భార్యా, ఇంకా ప్రాణం పోసుకోని నా కొడుకూ ఉన్నారు. అప్పుడు కానీ నా పాపం ఎంతటిదో నా కర్థం కాలేదు. పెద్ద ఇంజనీరు నుండి కింద వరకు పనిష్మెంట్లు ఇచ్చి చేతులు దులిపేసుకుంది డిపార్టమెంటు. నాకు దీనిలో

ప్రత్యక్ష ప్రమేయం లేదు కనుక నన్ను నా పేరెంటు డిపార్టమెంటుకు పంపేశారు. ఆ తర్వాత నేను లంచాలు పట్టలేదు. బతకటం కష్టమయింది. అలాగే నిలదొక్కుకుని వచ్చాను. ఒక స్థాయి వచ్చాక, నా సంగతి తెల్సి నన్నెవరూ లంచాల ఆశచూపి బాధ పెట్టలేదు. పై ఆఫీసర్లూ నా పట్ల గౌరవంగా మెలిగారు. ఆ తర్వాత నా బతుకు సంగతి నీకు తెల్సు. నీతో పాటు నేను కూడ జెయిలుకు రావల్సినవాడినే. మన ఇద్దరి శిక్షను నువ్వు అనుభవించి వచ్చావు. ఇంక బతికినంత కాలం నీకు తిండి పెట్టాల్సిన బాధ్యత నాది. కనుక నేనేదో పెట్టాను, నువ్వు తిన్నావని భావించ వద్దు.... చలి వేస్తోంది, వెళ్దామా? మళ్ళీ ఈ జన్మలో గంగలో స్నానం చెయ్యలేనను కుంటాను. ఇక్కడే నేనుచనిపోయాక దహనం చేసి, బూడిదను గంగలో కలిపెయ్యి. నా పాపం కొంతయినా పరిహారమవుతుంది.' అన్నాడు."

ఓ క్షణమేమీ మాట్లాడలేదు కామేశ్వరరావు.

ఈ తర్వాత చెప్పాడు.

"నేను వాడిని పట్టుకుని లేపాను. తోవలో జట్కా ఎక్కాక రొప్పుతూ చెప్పాడు, 'మనిషిగా బతకటం చాల దుష్కరం రా. ఆ ప్రయత్నం చెయ్యి' అని. అది నా వల్ల అయ్యేదేనా? వస్తాను" అని వెనుతిరిగాడు అతను.

'నిజమే, మనిషిగా బతకటమెంత కష్టం' అనుకుంది విశాల, అతన్ని పంపేసి, గేటుమూసి, లోపలకు అడుగుపెడుతూ.

(నవ్య వీక్లీ యునైటెడ్ కింగ్డం తెలుగు ఆర్ట్స్ సంయుక్తంగా నిర్వహించిన ఏడు వారాల సీరియల్ పోటీలో విశేష బహుమతి పొందిన పెద్ద కథ.)

నవ్య వీక్లీలో 2011 మే 25 నుండి 2011 జులై 6 వరకు ప్రచురితం.